
# సారాంశం

ఇ.ఎఫ్.ఎ గ్లోబల్ మానిటరింగ్ రిపోర్ట్ ౨౦౦౭



# గట్టి పునాదులు

## బాల్యం ప్రారంభంలో సంరక్షణ మరియు విద్య

# గట్టి పునాదులు

## బాల్యం ప్రారంభంలో సంరక్షణ మరియు విద్య

# సారాంశం

యునెస్కో ప్రచురణ

నివేదిక విశ్లేషణ, విధాన సిఫారసులు యునెస్కో అభిప్రాయాలను ప్రతిబింబించకపోవచ్చు. ఈ నివేదిక అంతర్జాతీయ సముదాయం తరుపున యునెస్కో వెలువరిస్తోన్న ఒక స్వతంత్ర ప్రచురణ. నివేదిక బృందం పలువురు ఇతరులు, ఏజెన్సీలు, సంస్థలు, ప్రభుత్వాలు, సమిష్టి కృషితో ఈ నివేదికను రూపొందించడం జరిగింది. నివేదికలో వెలిబుచ్చిన అభిప్రాయాలు, దృక్కోణాలకు దాని డైరక్టర్ మొత్తం మీద బాధ్యత వహిస్తారు.

ఈ ప్రచురణలో పేర్కొన్న హోదాలు, సమర్పించిన వివరాలు, యునెస్కో తరపున ఏ దేశం, ప్రదేశం, నగరం లేదా ప్రాంతం లేదా అక్కడి అధికారులు లేదా అక్కడి ఎల్లలు లేదా సరిహద్దులపై యునెస్కో తరపున ఏ విధమైన అభిప్రాయాన్ని పేర్కొన్నట్లు భావించరాదు.

## ఇఎఫ్ఏ గ్లోబల్ మానిటరింగ్ రిపోర్ట్ బృందం

డైరక్టర్
నికోలాస్ బర్నెట్

నికోల్ బెల్లా, ఆరాన్ బెనవోట్, ఫదీలా కెయిల్లాడ్, విక్టోరియా కెవిచ్చియోనీ, ఆలిసన్ క్లేనన్, వలేరీ జియోజ్, యానా ఫాంట్-గైనర్, కేథరిన్ జనిస్టీ, సింతియా గట్‌మేన్, ఎలిజబెత్ హీన్, కైయిట్ హింక్లిఫ్, ఫ్రాంకోయిస్ బెక్లెర్క్, లెల్బైన్ సెంగివూనా, బందే జోమినీ, ఉల్రికా పెప్లర్ బ్యారీ, పాలా రాజక్విన్, ఇసబెల్లె ర్యూల్లాన్, యూసఫ్ సయ్యద్, యాలిసన్ కెన్నడీ, ప్రయునెస్కో ఇన్స్టిట్యూటల్ ఆఫ్ స్టాటిస్టిక్), మిషెల్ జె, న్యూమన్ (బాల్యం ప్రారంభంలో సంరక్షణ మరియు విద్యపై ప్రత్యేక సలహాదారు).

నివేదిక గురించి అధిక సమాచారం కొరకు దయచేసి సంప్రదించండి.
డైరక్టర్
ఇఎఫ్ఏ గ్లోబల్ మానిటరింగ్ రిపోర్ట్ టీం.
కె/ఆఫ్ యునెస్కో
7, ప్లేస్ డిఫాంటెనాయ్ 75352 ప్యారిస్ 07 ఎస్‌పి,
ఫ్రాన్స్
ఇ-మెయిల్: efareport@unesco.org
ఫోన్: + 33 1 45 68 21 28
ఫ్యాక్స్: + 33 1 45 68 56 27
www.efareport.unesco.org

గత ఇఎఫ్ఏ గ్లోబల్ మానిటరింగ్ నివేదికలు
2006: లిటరీసీ ఫర్ లైఫ్
2005: ఎడ్యుకేషన్ ఫర్ ఆల్-ది క్వాలిటీ ఇంపరేటివ్
2003/4: జెండర్ అండ్ ఎడ్యుకేషన్ ఫర్ ఆల్-
ది లీప్ టు ఈక్వాలిటీ
2002-ఎడ్యుకేషన్ ఫర్ ఆల్ - ఈజ్ ది వరల్డ్ ఆన్ ట్రాక్?

2006లో ప్రచురించినవారు:
యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్, సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్.
7, ప్లేస్ డి ఫాండిటెనోయ్, 75352 ప్యారిస్ 07 ఎస్‌పి, ఫ్రాన్స్
గ్రాఫిక్ డిజైన్ రూపకర్త
సిల్వోయిన్ బెయెన్స్
ఐకనోగ్రాఫర్: డెల్ఫైన్ గిల్లార్డ్
ముద్రించిన వారు
గ్రాఫోప్రింట్, ప్యారిస్
© UNESCO 2006
ప్యారిస్‌లో ముద్రించబడింది

ED-2006/WS/67

# అందరికీ విద్య (ఇఎఫ్ఎ) నివేదిక 2007లో ముఖ్యాంశాలు

2000 సంవత్సరంలో నిర్ణయించిన అందరికీ విద్య అనే ఆశయాన్ని సాధించడానికి సమయం దగ్గరపడుతోంది. ప్రాథమిక స్థాయిలో బాలికలతో సహా, విశ్వవ్యాప్తంగా ప్రగతి కొనసాగుతున్నా, ఇప్పటికీ చాలా అధిక సంఖ్యలో పిల్లలు బడికి దూరంగా ఉంటున్నారు, కనీస విద్యాస్థాయిని చేరకముందే బడికి పోవడం మానేస్తున్నారు. బాల్యం ప్రారంభం, ప్రాథమిక, సెకండరీ విద్య, వయోజన విద్యల మధ్య ఉండే బంధాలను నిర్లక్ష్యం చేయడంవల్ల దేశాలు, ప్రాథమిక విద్యా స్థాయిని సార్వత్రికంగా మెరుగుపరిచే అవకాశాలను కోల్పోతున్నాయి. ఈ ప్రకియలో అన్నిచోట్లా పిల్లలు, యువకులు, వయోజనులు భవిష్యత్ అవకాశాలను కోల్పోతున్నారు.

## లక్ష్యాల దిశలో ప్రగతి

### *ప్రాథమిక విద్యావ్యాప్తి కొనసాగుతోంది*

సార్వత్రిక ప్రాథమిక విద్యకు సుదూరంలో ఉన్న మూడు ప్రాంతాలలో రెండింటిలో 1999 మరియు 2004 మధ్య బడికెళ్ళే పిల్లల సంఖ్య ఎంతో వేగంగా పెరిగింది: ఉప-సహారా ఆఫ్రికాలో అది 27% పెరగగా, దక్షిణ, పశ్చిమాసియాలో అది 19% పెరిగింది, అయితే అరబ్ దేశాల్లో మాత్రం ఈ వృద్ధి కేవలం 6 శాతమే. ప్రపంచ వ్యాప్తంగా నికరంగా బడికి వెళ్ళేవారి రేటు 86 శాతం ఉంది. గ్రేడ్-1లో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగినా, బడిలో చేరిన పిల్లల్లో ఎంతోమంది ప్రాథమిక స్థాయి విద్య పూర్తికాక ముందే చదువు ఆపేస్తున్నారు: దక్షిణ అమెరికా, కరిబియన్ ప్రాంతంలో లభ్యమయ్యే వివరాల ప్రకారం 83% కంటే తక్కువ, ఉప-సహారా ఆఫ్రికాలో ఇది మూడింట రెండొంతుల కంటే తక్కువ మంది ప్రాథమిక విద్యను పూర్తి చేస్తున్నారు.

### *బడికి వెళ్ళని పిల్లలు: ఎంత మంది ? వారెవరు ?*

బడిలో చేరని ప్రాథమిక విద్యా వయసు పిల్లల సంఖ్యను తగ్గించే దిశలో ప్రగతి సాధిస్తున్నాం. 1999-2004 మధ్య ఈ సంఖ్య 21 మిలియన్ల నుంచి 77 మిలియన్లు తగ్గింది. అయినా, బడికెళ్లని పిల్లల సంఖ్య ఇంకా చాలా ఎక్కువగా ఉంది, ఇది అంగీకారం కాదు. ఉప-సహారా ఆఫ్రికా, దక్షిణ, పశ్చిమాసియాలోనే ఇలాంటి పిల్లల్లో మూడొంతుల మంది ఉన్నారు, అయితే దక్షిణ, పశ్చిమాసియాల్లో 1999 మరియు 2004 మధ్య వీరి సంఖ్య సగానికి తగ్గింది, దీనికి ప్రధానంగా భారత్‌లో జరిగిన ప్రగతే కారణం. ఈ విశ్వ అంచనాలు ఎంతో ఎక్కువగా ఉన్నప్పటి ఇవి సమస్యను పూర్తిగా ప్రతిబింబించడంలేదు: గృహాలవారి సర్వేలో లభించిన వివరాల ప్రకారం, బడిలో చేరిన పిల్లల్లో ఎంతోమంది బడికి సక్రమంగా వెళ్ళడంలేదు.

బడిలో చేరని, చేరినా మధ్యలో మానేసే పిల్లలు గ్రామీణ ప్రాంతాల్లోని అత్యంత పేద కుటుంబాలకు చెందినవారు. అక్షరాస్యురాలైన తల్లి పిల్లలకంటే, నిరక్షరాస్యురాలైన తల్లి పిల్లలు బడికి వెళ్ళకపోయే అవకాశాలు రెండింతలు ఉంటాయి.

### *విద్యకు దూరమవడాన్ని ఆపేందుకు ప్రభుత్వ విధానాలు*

ఎన్నడూ బడిలో చేరకుండా ఉండిపోయే, చేరినా బడికి వెళ్ళని పిల్లల బృందాలను గుర్తించేందుకు వెనువెంటనే ప్రభుత్వాలు ప్రయత్నాలు ప్రారంభించాలి. విద్యకు దూరమయ్యే వారిని చేరడం, విద్య నాణ్యతను, ఆవశ్యకతను, వెసులుబాటును మెరుగుపరిచేందుకు ఇది మొదటి అడుగు.

విద్యామృతం అందరికీ చేరేలా చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు: బడి ఫీజుల రద్దు, బాలకార్మికుల ఆదాయంపై ఆధారపడకుండా ఉండేలా పేద, గ్రామీణ కుటుంబాలకు ఆదాయం పెంచుకొనే మద్దతు, పిల్లల మాతృభాషలో విద్యాబోధన, వికలాంగ పిల్లలకు, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ సోకిన పిల్లలకు విద్యావకాశాలు కల్పించడం, యువకులు, వయోజనులకు విద్యను నేర్చుకొనేందుకు రెండో అవకాశం కల్పించాలి.

### *ఉపాధ్యాయుల భర్తీ, శిక్షణ, పనిచేసే పరిస్థితులను మెరుగుపరచడం*

అందరికీ విద్య (ఇఎఫ్ఎ) లక్ష్యాలను సాధించడానికి అవసరమైన స్థాయిలో అర్హతగల, దీక్షాదృక్పథంగల ఉపాధ్యాయులు లేరు. 2015 నాటికి ఉప-సహారా ఆఫ్రికాలో 1.6 మిలియన్ల మంది ఉపాధ్యాయుల అవసరం ఉంది. ఈ ప్రాంతంలోనూ, దక్షిణ, పశ్చిమాసియాలలో బాలికలను బడికి ఆకర్షించి కొనసాగించేలా చేయగల సంఖ్యలో మహిళా ఉపాధ్యాయులు లేరు. ఎన్నో వర్ధమాన దేశాలలో ఉపాధ్యాయుల గైర్హాజరు కూడా తీవ్రమైన సమస్యగా మారింది.

సమస్యాపూరిత పరిస్థితులలో ఉపాధ్యాయులను భర్తీచేసి, వారు అలాగే కొనసాగేలా చేయడానికి పాటించాల్సిన వ్యూహాల్లో, ఉద్యోగంలో చేరకముందు తక్కువకాలం శిక్షణ ఇచ్చి, ఉద్యోగంలో అనుభవం, వృత్తిపరమైన అభివృద్ధి, దూర ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయడానికి ప్రోత్సాహకాలు ఇవ్వడం ఉన్నాయి.

### *సెకండరీ విద్య: పెరుగుతున్న డిమాండ్, సరిపోని సదుపాయాలు*

సెకండరీ విద్య సదుపాయాల వ్యాప్తికోసం డిమాండ్ నాటకీయంగా పెరుగుతోంది. వర్ధమాన ప్రాంతాలన్నింటిలోను స్థూల ఎన్‌రోల్‌మెంట్ నిష్పత్తులు పెరిగాయి. అయితే ఉప- సహారా ఆఫ్రికాలో (30%), దక్షిణ, పశ్చిమాసియాలో (51%) మరియు అరబ్ దేశాల్లో (66%) ఇంకా తక్కువగానే ఉన్నాయి.

సెకండరీ విద్యాసౌకర్యాలు తక్కువగా ఉండటంవల్ల, ప్రాథమిక విద్యను పూర్తి చేయడానికి గల ప్రోత్సాహం తగ్గుతుంది, తద్వారా సార్వత్రిక ప్రాథమిక విద్యను సాధించడంలో జాప్యం ఏర్పడుతుంది. అదే సమయంలో, సెకండరీ విద్యకు డిమాండ్ పెరగడంవల్ల, ప్రభుత్వ నిధుల ఖర్చుపై పోటీ పెరుగుతుంది.

### *లింగ సమానత్వం : ఇంకా నిజం కాలేదు*

ప్రస్తుతం ప్రతి 100 మంది బాలురకు, 94 మంది బాలికలు బడికి వెళ్తున్నారు, 1999లో ఇది 92 మాత్రమే. 2004 నాటి వివరాల ప్రకారం 181 దేశాలలో మూడింట రెండొంతుల దేశాలు ప్రాథమిక విద్యలో లింగ సమానత్వాన్ని సాధించాయి. 2000 సంవత్సరాలలో 90% కంటే తక్కువ స్థూల ఎన్‌రోల్‌మెంట్ నిష్పత్తిగల 26 దేశాల్లో కేవలం నాలుగు దేశాలు మాత్రమే బాలురు, బాలికల మధ్య తేడాను పూరించగలిగాయి.

గణాంక వివరాలు లభ్యమయిన 177 దేశాలలో కేవలం మూడింట ఒకవంతు దేశాలు మాత్రమే సెకండరీ విద్యలో లింగ సమానత్వాన్ని సాధించగలిగాయి. అయితే ఈ స్థాయిలో కొన్ని దేశాల్లో బాలురు ఎక్కువ ఉండగా, కొన్ని దేశాల్లో బాలికలు ఎక్కువగా ఉన్నారు. 2004లో వివరాలు లభ్యమయిన 148 దేశాల్లో, తృతీయ శ్రేణి విద్యలో కేవలం అయిదు దేశాలు మాత్రమే లింగసమానత్వాన్ని సాధించాయి. లింగ సమానత్వం సాధించడం ఇంకా సమస్యగానే ఉంది. పాఠ్యపుస్తకాలలో స్టీరియోటైపు అంశాలు ఉండటం, ఉపాధ్యాయులు బాలురనుంచి ఆశించే స్థాయి, బాలికలనుంచి ఆశించే స్థాయి కంటే వేరుగా ఉండడం ఈ సమస్యకు దోహదపడుతున్నాయి.

### *అక్షరాస్యత : అందని ఆశయం*

దాదాపు 781 మిలియన్ల వయోజనులకు (ప్రపంచ జనాభాలో ప్రతి అయిదుగురిలో ఒకరు) కనీస అక్షరాస్యత స్థాయిలేదు. ఇందులో మూడింట రెండొంతులు మహిళలు. అక్షరాస్యత రేటు దక్షిణ, పశ్చిమాసియాలో (59%) ఉప-సహారా ఆఫ్రికా (61%), అరబ్ దేశాలు (66%) మరియు కరిబియన్ (70%)లలో తక్కువగా ఉంది. అక్షరాస్యత వ్యాప్తికి సర్వత్రా కృషిజరగనట్లయితే 2015 నాటికి, నిరక్షరాస్య వయోజనుల సంఖ్య కేవలం 100 మిలియన్లు తగ్గుతుంది. అలాగే అక్షరాస్య వాతావరణాన్ని నెలకొల్పడంపై కూడా ప్రభుత్వాలు దృష్టి సారించాలి.

### *కల్లోలిత దేశాలు : తరచూ విశ్లేషణకు దూరంగా ఉంటున్నాయి*

ఘర్షణ పరిస్థితుల కారణంగా, లేక ఘర్షణలనుండి బయటపడిన తర్వాత ఎన్నోదేశాల గణాంక వివరాలు లభ్యంకావు. అందువల్ల వాటిలోని స్థితిగతులు ఈ నివేదిక విశ్లేషణలో పూర్తిగా ప్రతిబింబించవు. ఆదేశాల్లో అందరికీ విద్య (ఇఎఫ్ఎ) పరిస్థితి ఆందోళనకరంగా ఉందనే విషయాన్ని విశ్వవ్యాప్తంగా ఇ.ఎఫ్.ఎ. చిత్రాన్ని పరిశీలించేటప్పుడు మనం గుర్తుంచుకోవాలి.

## ఆర్థిక నిధులు మరియు విదేశీ సహాయం

***విద్యపై పెట్టే ఖర్చు:*** 1999-2004 మధ్య గణాంకాలు లభ్యమైన 106 దేశాలలో, 41 దేశాల్లో విద్యపై పెట్టే ఖర్చు జి.ఎన్.పి.లో శాతంగా తగ్గింది, అయితే మిగతా అనేక దేశాల్లో అది పెరిగింది. ఇఎఫ్ఎను సాధించడానికి కావలసిన కీలక అవసరాలపై ప్రభుత్వ ఖర్చు దృష్టి సారించాలి: ఉపాధ్యాయులు, వయోజన అక్షరాస్యత, బాల్యం ప్రారంభంలో సంరక్షణ, విద్య (ఇసిసిఇ), అన్ని స్థాయిల్లో అందరినీ అక్కున చేర్చుకునే విధానాలు.

***బడి ఫీజులను,*** అత్యధిక దేశాలు తగ్గించాయి, లేదా పూర్తిగా రద్దు చేశాయి, అయినా ఇది ఇంకా సర్వసాధారణంగా కన్పించి, పేద పిల్లలు ప్రాథమిక విద్య పొందడానికి పెద్ద అడ్డంకిగా ఉంది.

***పేద దేశాలలో ప్రాథమిక విద్యకు విదేశీ సహాయం,*** మొదట తగ్గినా 2000-2004 మధ్యకాలలో రెండింతలయింది (1.8 బిలియన్ల నుంచి 3.4 బిలియన్ల అమెరికన్ డాలర్లు-2003 ధరల ప్రకారం). అయితే తక్కువ ఆదాయంగల దేశాలకు అందించే మొత్తం విదేశీ సహాయంలో భాగంగా చూస్తే ఇది 54% వద్ద నిలకడగా ఉంది. ద్వైపాక్షిక ఆర్థిక సహాయన్నందించే దేశాలలో సగం దేశాలు, తమ విద్యా సహాయంలో కనీసం సగం మధ్యస్థాయి ఆదాయంగల దేశాలకు అందిస్తున్నాయి. దాదాపు సగం దేశాలు ప్రాథమిక విద్యకు నేరుగా 25% కంటే తక్కువ ఇస్తున్నాయి.

***విరాళాలిచ్చే సంస్థలకు ముఖ్యమైన సమన్వయంచేసే*** యంత్రాంగంగా **ఫాస్ట్‌ట్రాక్ ఇనిషియేటివ్** ఉపయోగపడుతుంది కాని, ఇంతవరకు సార్వత్రిక ప్రాథమిక విద్య వంపిణీ సాధించేందుకు గ్లోబల్ కాంపాక్ట్ ఏర్పాటు వీలుకాలేదు. 2002 నుంచి మొత్తం విరాళాలు 96 మిలియన్ అమెరికన్ డాలర్లు కేవలం 11 దేశాలకు మాత్రమే వచ్చాయి. అయితే గత సంవత్సరం దాతలు తమ విరాళాల హామీని పెద్దయెత్తున పెంచారు.

***సహాయం లోటు:*** ఇ.ఎఫ్.ఎ కు, వయోజన అక్షరాస్యతకు, ఇసిసిఇల అవసరాలకు ఏటా 11 బిలియన్ అమెరికన్ డాలర్ల విదేశీ సహాయం అవసరమని అంచనా. ఇది ప్రస్తుత విదేశీ సహాయ స్థాయికి మూడురెట్లు ఎక్కువ, ఇటీవల హామీ ఇచ్చినట్లుగా సహాయం పెరిగినా 2010 నాటికి వచ్చే సహాయానికి రెండింతలు ఉంది.

# బాల్యం ప్రారంభంలో సంరక్షణ మరియు విద్య

## అంటే ఏమిటి ?

- ఇసిసిఇ నియత నిర్వచనాలలో ఎంతో వైవిధ్యం ఉంది. ఈ నివేదిక సంపూర్ణ దృక్పథాన్ని ఎంచుకుంది: పిల్లల మనుగడను, పెరుగుదల, అభివృద్ధిని, విద్యను ఇసిసిఇ బలపరుస్తుంది -ఇందులో భాగంగా ఆరోగ్యం, పౌష్టికాహారం, అభిజ్ఞా వికాసం, సాంఘిక, శారీరక, భావోద్రేక అభివృద్ధి-పుట్టుక నుంచి నియత, అనియత, అనధికార పద్ధతుల్లో నడిచే ప్రాథమిక పాఠశాలలో చేరేవరకు ఉంటాయి.

- ఇసిసిఇ కార్యక్రమాలు ఎన్నో రకాల ఏర్పాట్లు కలిగి ఉంటాయి, తల్లిదండ్రుల పెంపకం కార్యక్రమం, కమ్యూనిటీ ఆధార శిశు సంరక్షణ, సెంటర్ ఆధారంగా సరకుల లభ్యం, తరచూ పాఠశాలల్లో జరిగే ప్రారంభ ప్రాథమిక విద్య (ప్రీ-ప్రైమరీ) విద్య ఇందులో కొన్ని.

- సాధారణంగా వయసు ఆధారంగా రెండు బృందాలపై ఈ కార్యక్రమాలు దృష్టి సారిస్తాయి: మూడు సంవత్సరాల లోపు పిల్లలు మరియు మూడు నుంచి ప్రాథమిక పాఠశాలలో చేరే వయసు పిల్లలు. (మామూలుగా 6 సంవత్సరాల వయసు వరకు, లేదంటే 8 వరకు).

## దీని ఆవశ్యకత ఏమిటి ?

- దాదాపుగా సర్వత్రా ఆమోదించబడిన పిల్లల హక్కుల ఒప్పందం ఇసిసిఇని ఒక హక్కుగా గుర్తించింది.

- చిన్నారి శిశువుల సంక్షేమాన్ని ఇసిసిఇ మెరుగుపరుస్తుంది-ముఖ్యంగా వర్ధమాన దేశాలలో శిశువులపై దృష్టిసారిస్తుంది. ఈ దేశాలలో శిశువులు అత్యంత నిరుపేద పరిస్థితుల్లో జీవించే అవకాశం నలభై శాతం ఉండి, యేటా 10.5 మిలియన్ మంది శిశువులు 5 సంవత్సరాల వయసు కంటే ముందే నివారించగల వ్యాధులకు గురై మరణిస్తున్నారు.

- ప్రారంభ శైశవ దశలో మెదడు అత్యంత వేగంగా అభివృద్ధి చెంది, తరువాతి వికాసానికి పునాదులు వేస్తుంది.

- ఇతర ఇ.ఎఫ్.ఎ ఆశయాల సాధనకు ఇసిసిఇ తోడ్పడుతుంది, (ఉదా: ప్రాథమిక పాఠశాలలో ప్రారంభ తరగతులలో పిల్లల వికాసాన్ని మెరుగుపరుస్తుంది) అలాగే మిలీనియం డెవలప్‌మెంట్ లక్ష్యాల సాధనకు తోడ్పడుతుంది. ముఖ్యంగా ప్రధాన ఆశయమైన పేదరిక నిర్మూలనలతోపాటు విద్యా, ఆరోగ్య ఆశయాలను సాధించేందుకు తోడ్పడుతుంది.

- ప్రతికూల పరిస్థితులలో పెరిగిన పిల్లలకు ఆ తరువాత దానికి పరిహారంగా సౌకర్యాలు కల్పించేబదులు, చిన్నతనంలో నివారణ చర్యలు చేపట్టి వారికి మద్దతునివ్వడం ఎంతో ఖర్చును తగ్గిస్తుంది.

- పనిచేసే తల్లిదండ్రులకు ముఖ్యంగా తల్లులకు అందుబాటులో, విశ్వసనీయమైన శిశు సంరక్షణ లభించడం ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

- పేద కుటుంబాలకు చెందిన పిల్లలు ఎదుర్కొనే ప్రతికూల పరిస్థితులను, వివక్షను నివారించడం ద్వారా ఇసిసిఇపై పెట్టే పెట్టుబడికి మంచి ఆర్థిక లాభాలు కలుగుతాయి.

## ప్రస్తుత పరిస్థితి ఏమిటి ?

- 80 శాతం వర్ధమానదేశాల్లో ఏదో ఒక రూపంలో అధికారికంగా ప్రసూతి సెలవుల పద్ధతి ఉంది, అయితే వీటి అమలులో చాలా తేడా ఉంది.

- అందరికంటే ఎక్కువగా చిన్న శిశువులు నిర్లక్ష్యానికి గురవుతారు. ప్రపంచదేశాల్లో దాదాపు సగం దేశాల్లో మూడు సంవత్సరాలలోపు పిల్లలకు ఖచ్చితమైన కార్యక్రమాలు లేవు.

- వర్ధమానదేశాలలో ఇంకా చాలా తక్కువగా ఉన్నప్పటికీ, 1970 నుంచి ప్రీ-ప్రైమరీ విద్యలో చేరే పిల్లల సంఖ్య మూడు రెట్లయింది.

- ఆర్థిక సహకారం మరియు అభివృద్ధి సంఘానికి (ఓ.ఇ.సి.డి) చెందిన అనేక దేశాలలో కనీసం రెండేళ్ళ ఉచిత ప్రీ-ప్రైమరీ విద్య అవకాశాలున్నాయి.

- వర్ధమాన దేశాల ప్రాంతాలలో దక్షిణ అమెరికా, కరిబియన్, పసిఫిక్ ప్రాంతాలలో అత్యధిక ప్రీ-ప్రైమరీ స్కూల ఎన్‌రోల్‌మెంట్ నిష్పత్తులున్నాయి. తూర్పు ఆసియా, దక్షిణ, పశ్చిమాసియా, అరబ్ దేశాలు, ఉప-సహారా ఆఫ్రికా ఈ దేశాల కంటే ఎంతో వెనుకబడి ఉన్నాయి.

- 1990లలో తీవ్రంగా పడిపోయినా, మధ్య ఐరోపా, తూర్పు ఐరోపాలోని మార్పుచెందుతున్న దేశాల్లో ప్రీ-ప్రైమరీ ఎన్‌రోల్‌మెంట్ మళ్ళీ నిదానంగా కోలుకుంటున్నాయి. అయితే మధ్య ఆసియా దేశాల్లో మాత్రం ఇంకా అలా జరగడం లేదు.

- అన్ని ధనిక, మార్పుచెందుతున్న, దక్షిణ-అమెరికా దేశాలలో ఇసిసిఇ ఏర్పాట్లను ప్రభుత్వాలే చేపట్టాయి.

- ఉప సహారా ఆఫ్రికా, అరబ్ దేశాలు, కెరిబియన్, తూర్పు ఆసియా దేశాల్లో ప్రైవేటురంగం ప్రధానపాత్ర పోషిస్తుంది.

- ప్రీ-ప్రైమరీ విద్యలో దాదాపు అన్ని ప్రాంతాలు లింగ సమానత్వాన్ని చాలా వరకు సాధించాయి.

- అంతర్గతంగా దేశాల మధ్యనే అమలులో ఎన్నో అసమానతలు ఉన్నాయి. కొన్ని ముఖ్యమైన దేశాలను మినహాయిస్తే, నిరుపేద, గ్రామీణ కుటుంబాల పిల్లలకు, సాంఘికంగా మినహాయించబడిన వర్గాల (ఉదా: జనన సర్టిఫికేట్లు లేనివారు) పిల్లలకు ఇ.సి.సి.ఇ.ని పొందే అవకాశాలు ధనిక, పట్టణ వర్గాల పిల్లలకంటే చాలా తక్కువ.

- ఇసిసిఇ కార్యక్రమాల వల్ల అత్యధికంగా లాభపడాల్సిన పిల్లలు-పౌష్టికాహార లోపానికి గురయ్యేవారు, నివారించగల వ్యాధులకు గురయ్యే పిల్లలు-బడిలోచేరే అవకాశాలు అత్యంత తక్కువ.

- వర్ధమాన దేశాలలో ఇసిసిఇలో పనిచేసే ఉద్యోగులకు సరైన విద్య, శిక్షణ ఉండటంలేదు. అలాగే అనేక దేశాల్లో వారి జీతభత్యాలు కూడా చాలా తక్కువగా ఉన్నాయి.

- ప్రీ-ప్రైమరీ విద్యపై ఖర్చుకు ప్రభుత్వాలు తక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు కలిసి ఉండటం, గణాంకాలు లభ్యం కాకపోవడం వలన ఇసిసిఇపై వివిధ దేశాలుపెట్టే ఖర్చును అంచనా వేయడం కష్టమవుతోంది. విస్తరణ, నాణ్యత, సేవల రకాలలో మార్పులను దృష్టిలో పెట్టుకొని వివిధ పరిస్థితులకు తగ్గట్టుగా అయ్యే ఖర్చును దేశాలు అంచనా వేయవచ్చు.

- విరాళిచ్చే అనేక సంస్థలకు ఇసిసిఇ ప్రాధాన్యత కాదు. ఈ సంస్థలన్నీ తాము ప్రాథమిక విద్యకు ఇచ్చే విరాళాలలో 10% కంటే తక్కువప్రీ-ప్రైమరీ విద్యకు ఇస్తున్నాయి. సగం కంటే ఎక్కువ సంస్థలు 2% కంటే తక్కువ కేటాయిస్తున్నాయి.

## *ఏ కార్యక్రమాలు ఫలితాలను ఇస్తాయి?*

- పౌష్టికాహారం, ఆరోగ్యం, సంరక్షణ, విద్యల మిశ్రమాన్ని కలిగిన దృక్పథం చిన్నపిల్లల సంక్షేమాన్ని మెరుగుపరిచేందుకు ప్రభావపూరితంగా ఉంటుంది. ఏదో ఒక్క అంశంపైనే కేంద్రీకరిస్తే ఫలితాలు అంతగా ఉండవు.

- అందరినీ కలుపుకుపోయే కార్యక్రమాలు సంప్రదాయ శిశు సంరక్షణ పద్ధతులు, పిల్లల భాష, సంస్కృతుల వైవిధ్యాన్ని గౌరవించి, అంగవైకల్యం, ప్రత్యేక విద్యా అవసరాల్ని గుర్తించి, పిల్లలను జన జీవన స్రవంతిలో చేరుస్తాయి.

- అధికార భాషలోని కార్యక్రమాలకంటే మాతృభాష కార్యక్రమాలు ఎక్కువ ప్రభావపూరితంగా ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా ఈ పద్ధతినే పాటిస్తున్నారు.

- స్త్రీ పురుషులను సాంప్రదాయ పాత్రల్లో (స్టీరియో టైప్) చూపకుండా ఉండేలా మంచి కార్యక్రమాలు రూపొందించాలి.

- పిల్లల అవసరాలను కేంద్రంగా ఉంచి పిల్లలు, ఉద్యోగుల మధ్యగల సత్సంబంధాలు ఇసిసిఇ నాణ్యతను నిర్ణయించే అత్యంత ముఖ్యమైన అంశం. దీన్ని సాధించడానికి సరైన పని పరిస్థితులు, కలివిడితనాన్ని పెంపొందించడం. పిల్లల/ఉద్యోగుల నిష్పత్తి తక్కువగా ఉండడం సరిపోను సామాగ్రి ఉండాలి.

- సిబ్బంది, పాఠ్యాంశాల కొనసాగింపు, తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉంటే పిల్లలు ప్రాథమిక పాఠశాలకు మారడం సులభమవుతుంది. విభిన్న కుటుంబ పరిస్థితులు, అనుభవాలతో వచ్చే చిన్నపిల్లలను అక్కున చేర్చుకొనేందుకు తొలి సంవత్సరాల బడిలో నాణ్యత పెంచాలి.

## *ఇ.సి.సి.ఇ ఆశయాన్ని ఎలా సాధించాలి*

- ఉన్నత స్థాయిలో రాజకీయ మద్దతు అత్యంత కీలకం.

- పుట్టుక నుంచి 8 సంవత్సరాల వరకు పిల్లల సంరక్షణకోసం జాతీయ విధానాన్ని చర్చల ద్వారా రూపొందించి, అన్ని సంబంధిత రంగాలు, ప్రభుత్వ స్థాయిలలో పాలనా బాధ్యతలు, ఆర్థిక కట్టుబాట్లు స్పష్టంగా విభజించాలి.

- ఇఎఫ్ఏ లక్ష్యాలను సాధించడానికి కావలసిన అవసరాలు, ఫలితాలను బేరీజు వేయడానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గణాంకాల సేకరణ, పర్యవేక్షణ ప్రయత్నాలు కొనసాగించాలి.

- చిన్న పిల్లలు, ఇసిసిఇలపై విధానాన్ని రూపొందించడానికి ఒక మంత్రిత్వశాఖ లేదా ఏజెన్సీని ఏర్పాటు చేయడం, ఇతర ఏజెన్సీలతో సమన్వయం చేసేందుకు యంత్రాంగాన్ని ఏర్పాటుచేసి దానికి నిర్ణయాలు తీసుకొనే అధికారాలివ్వాలి.

- అన్ని వయసుల వారికి సంబంధించిన సేవలందించే పబ్లిక్, ప్రైవేట్ సంస్థలకు వర్తించేలా జాతీయ నాణ్యతా ప్రమాణాలను బాగా అమలుచేయడం.

- అనేక ప్రాంతాలలో ఇసిసిఇ రంగంలో ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తున్న ప్రైవేటురంగం, ప్రభుత్వరంగాల మధ్య భాగస్వామ్యం అధికం పటిష్టం కావాలి.

- ఇసిసిఇ ఉద్యోగుల స్థాయిపెంచడం-ముఖ్యంగా వెసులుబాటుగల భర్తీ వ్యూహాలు, సరైన శిక్షణ, నాణ్యతా ప్రమాణాలు, మంచి జీతభత్యాలు ఇవ్వడం ద్వారా శిక్షణపొందిన ఉద్యోగులను నిలుపుకోవచ్చు.

- పేద పిల్లలు, గ్రామీణ ప్రాంతాల పిల్లలు, అంగ వైకల్యంగల పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టేలా ఇసిసిఇపై ప్రభుత్వ ఖర్చు పెంచడం.

- జాతీయ బడ్జెట్, వివిధ రంగాల ప్రణాళికలు, పేదరిక నిర్మూల వ్యూహాలవంటి కీలక ప్రభుత్వ పత్రాలలో ఇసిసిఇని తప్పక చేర్చడం.

- విరాళాలిచ్చే సంస్థలు ఈ అంశంపై ఎక్కువ దృష్టిసారించి, ఎక్కువ విరాళాలివ్వాలి.

# పరిచయం

బడిలో ప్రవేశించకముందే పిల్లలు నేర్చుకోవడం ప్రారంభిస్తారు. 2000లో డకార్‌లో 164 దేశాలు ఆమోదించిన అందరికీ విద్య (ఇఎఫ్ఎ) ఆరు లక్ష్యాలలో మొదటి అంశం పిల్లల ప్రారంభ సంవత్సరాల ప్రాముఖ్యతను వ్యక్తం చేసింది. ఈ వయసులో పిల్లలు ఎంతో సున్నితంగా ఉంటారు. అలాగే ఎంతో వేగంగా నేర్చుకొనే సామర్థ్యం కలిగి ఉంటారు. సరైన రక్షణ, సంరక్షణ, ప్రోత్సాహం కల్పిస్తే, వారి భవిష్యత్ సంక్షేమం, అభివృద్ధికి గట్టి పునాదులు ఏర్పడతాయి.

మొదటి ఇఎఫ్ఎ ఆశయం, ప్రభుత్వాలు ''బాల్యం ప్రారంభంలో సమగ్ర సంరక్షణ, విద్యావకాశాలను విస్తరించి, మెరుగుపరచాలి, ఇందులో ముఖ్యంగా బలహీన వర్గాల, ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న పిల్లలకు ప్రాధాన్యం ఇవ్వాలి''- దీని వలన ఇలాంటి సౌకర్యాలు లభ్యంకాని పిల్లలు వాటిని పొంది అత్యంత ప్రయోజనం పొందుతారు అని పిలుపునిచ్చింది.

పుట్టుక నుంచి 8 సంవత్సరాల వరకు సంరక్షణ, విద్యలను కల్పించే సంపూర్ణ దృక్పథం ఉండాలన్నదే సమగ్ర కార్యక్రమాల పిలుపు సారాంశం. ఇలాంటి కార్యక్రమాలు వివిధ అవసరాలపై దృష్టిసారించి, ఆరోగ్యం, పౌష్టికాహారం, అభిజ్ఞ, సాంఘిక భావోద్రేక అభివృద్ధికి తోడ్పడతాయి. మిల్లేనియం అభివృద్ధి ఆశయాలకు కీలకమయిన అంశం అయిన పేదరిక నిర్మూలన, అందరికీ ప్రాథమిక విద్య అనే ఆశయాలను సాధించేందుకు పాటించే వ్యూహాలలో సమగ్ర బాల్యం ప్రారంభ కార్యక్రమాలు ప్రధానపాత్ర వహిస్తాయి. నాణ్యతగల కార్యక్రమాలు పిల్లల ఆరోగ్యం, పౌష్టికాహారాన్ని మెరుగుపరచి హెచ్.ఐ.వి/ఎయిడ్స్‌ను ఎదుర్కొని, ప్రాథమిక పాఠశాలకు సాఫీగా మారడానికి పిల్లలను సంసిద్ధం చేస్తాయి.

ఇటీవల బాల్యం ప్రారంభంలోని కార్యక్రమాలపట్ల నిబద్ధత పెరిగింది. 1989లో ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభ ఆమోదంపొంది, ఇప్పటికి 192 దేశాలు స్వీకరించిన పిల్లల హక్కుల ఒప్పందం, పిల్లల మనుగడ, అభివృద్ధి, రక్షణ హక్కులను కాపాడే ఏకైక సాధనం. వేగంగా సాగుతున్న ఆర్థిక, సాంఘిక అభివృద్ధుల కారణంగా బాల్యం ప్రారంభంలోని కార్యక్రమాలు ఇంకా ఎక్కువగా ప్రారంభించాల్సిన అవసరం ఏర్పడింది. వర్ధమాన దేశాలలో బాల్యం ప్రారంభంలోని కార్యక్రమాలు సాధారణంగా అందుబాటులో లేవు. ఇందుకు భిన్నంగా, ధనిక దేశాలలోని పిల్లలకు కనీసం రెండు సంవత్సరాలపాటు ప్రాథమిక పాఠశాల విద్యకు ముందు ప్రి-స్కూల్ విద్య అందుతోంది.

బాల్యం ప్రారంభంతో పాటు, ఐదు ఇ.ఎఫ్.ఎ ఇతర ఆశయాలవైపు ప్రగతిని ఈ నివేదిక పరిశీలిస్తుంది. ఇంతకుముందెన్నడూ లేని విధంగా బడికి దూరంగా ఉన్న పిల్లలపై విశ్లేషణ, వారిని, ఇతర ప్రమాదాలెదుర్కొంటున్న పిల్లలను చేరుకోవడం కోసం పాటించాల్సిన వ్యూహాలను ఈ నివేదిక చర్చించింది. ఇ.ఎఫ్.ఎ.ను సాధించడం కోసం ప్రభుత్వాలు అమలుచేస్తున్న విధానాలను, ఈ ప్రయత్నాలకు దాతలు అందిస్తోన్న విదేశీ ఆర్థిక సహాయాన్ని ఇది గుర్తిస్తుంది. ఆ తర్వాత ఈ నివేదిక తన ప్రత్యేక ఇతివృత్తంపై దృష్టిసారిస్తుంది. బాల్యం ప్రారంభంలో సంరక్షణ, విద్యల (ఇసిసిఇ) కార్యక్రమాలను పటిష్టపరచవలసిన ఆవశ్యకతలను, దాని హేతుబద్ధతను చర్చించిన తర్వాత, ఈ దిశలో దేశాలు చేస్తున్న ప్రయత్నాలను ముఖ్యంగా బలహీన, పేద వర్గాల పిల్లలకోసం చేస్తున్న ప్రయత్నాలను బేరీజు చేస్తుంది. విభిన్న పరిస్థితుల్లో, వివిధ ఆశయాలతో పుట్టుక నుంచి 8 సంతవర్సరాల వయసు వరకు చేపట్టిన కార్యక్రమాల లక్షణాలలో ఎంతో వైవిధ్యం ఉంటుంది, అయితే వీటన్నింటిలో మంచి ఆచరణల రూపురేఖలను సులభంగానే గుర్తించవచ్చు. ఈ సేవల విస్తృతికి చేపట్టాల్సిన జాతీయ వ్యూహాల కీలకాంశాలను విశ్లేషించింది. చివరగా, విశ్వసమాజం చేపట్టాల్సిన కార్యక్రమ ఎజెండాను సూచించి నివేదిక ముగుస్తుంది.

వివిధ దేశాల విద్యా గణాంకాలు, కుటుంబాల సర్వే, చర్చలు, సంప్రదింపులు, సాహితీ సమీక్షలు, యునెస్కో వెబ్‌సైట్‌పై లభ్యమయ్యే ప్రత్యేకంగా కమిషన్డ్ పత్రాలు ఆధారంగా ఈ నివేదిక రూపొందింది. వెబ్‌సైట్ (www.efareport.unesco.org)లో ఈ సారాంశం, పూర్తి నివేదిక, గణాంకాల పట్టికలు, ప్రాంతీయ సమీక్షలు ఉన్నాయి.

## అందరికీ విద్య ఆశయాలు

1. సమగ్ర బాల్యం ప్రారంభ సంరక్షణ మరియు విద్యలను విస్తరింపచేసి, వాటిని మెరుగుపరచడం, ముఖ్యంగా అత్యంత ప్రతికూల పరిస్థితుల్లోని, బలహీన వర్గాల పిల్లలకు.

2. పిల్లలందరికీ, ముఖ్యంగా బాలికలు, క్లిష్టమైన పరిస్థితులలో ఉన్నవారు, జాతిపరంగా అల్పసంఖ్యాక వర్గాలకు చెందిన పిల్లలకు 2015 వరకు ఉచిత, నిర్బంధ ఉన్నత ప్రమాణం గల ప్రాథమిక విద్య అందుబాటులో ఉండి, పూర్తి చేయగలగాలి.

3. సరైన విద్య, జీవనాధార నైపుణ్యాల కార్యక్రమాలను సమానంగా లభ్యంచేయడం ద్వారా యువజనులు, వయోజనుల విద్యావసరాలు తీర్చడం.

4. 2015 నాటికి వయోజన, ముఖ్యంగా మహిళల విద్యా స్థాయిలో 50 శాతం వృద్ధిని సాధించడం, వయోజనులందరికీ ప్రాథమిక విద్య, విద్యను కొనసాగించే సౌకర్యాలను సమానంగా అందుబాటులోకి తేవడం.

5. 2005 నాటికి ప్రాథమిక, సెకండరీ విద్యలో లింగ అసమానతలను తొలగించడం, 2015 నాటికి విద్యారంగంలో లింగ సమానత్వాన్ని సాధించడం, ఉన్నత ప్రమాణంగల ప్రాథమిక విద్య అవకాశాలను బాలికలు సంపూర్ణంగా, సమానంగా పొందగలిగేలా చేయడం.

6. విద్యకు సంబంధించిన అన్ని అంశాలలో నాణ్యతను మెరుగుపరిచి, అన్నింటిలోనూ అత్యున్నస్థాయిని సాధించడంద్వారా, గుర్తింపు పొందిన విద్యాప్రమాణాలు ముఖ్యంగా అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం, జీవనాధార నైపుణ్యాలను అందరూ పొందగలగాలి.

# భాగం - I ఇ.ఎఫ్.ఎ దిశలో ప్రగతి: మినహాయింపును ఎదుర్కోవడం


- ప్రాథమిక విద్య వ్యాపిస్తున్నది
- బడికి వెళ్ళని పిల్లల సంఖ్య తగ్గుతోంది
- పిల్లలు బడికెందుకు వెళ్లడంలేదు
- సెకండరీ విద్యపై ఒత్తిడి
- బాలబాలికల మధ్య తేడాను తగ్గించడం
- ఉపాధ్యాయుల కొరత సవాలు
- సాధించని అక్షరాస్యత ఆశయాలు
- మినహాయింపు తొలగించేందుకు చర్యలు
- సరిపోని దేశీయ ఖర్చు

చిన్న పిల్లల సంరక్షణ, మేధా వికాసం నుండి యువకులు, వయోజనులకు అక్షరాస్యత, జీవనాధార నైపుణ్యాలవరకు ఎంతో విశాలమైన రంగాన్ని ఇ.ఎఫ్.ఎ లక్ష్యాలు కలిగి ఉన్నాయి. యునెస్కో గణాంకాల సంస్థ (యుఐఎస్) కు 2004 విద్యా సంవత్సరానికి పంపిన వివరాల ఆధారంగా రూపొందిన ఈ భాగం తమ విద్యా వ్యవస్థలను మెరుగుపరిచి, విస్తృతపరిచేందుకు, పిల్లలు, యువకులు, వయోజనులకు విద్యావకాశాలను మెరుగుపరచి, వాటిని లభ్యంచేసేందుకు వివిధ దేశాలు సాధించిన ప్రగతిని పరిశీలిస్తుంది. బడికెళ్లని పిల్లల పరిస్థితిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. పిల్లలెందుకు బడికి వెళ్ళలేకపోతున్నారనే కారణాలను, అడ్డంకులను స్పష్టంగా అవగాహన చేసుకున్నప్పుడే, పిల్లలందరికీ కనీస విద్యాహక్కును గ్యారంటీ చేయగల వ్యూహాలను, విధానాలను ప్రభుత్వాలు రూపొందించగలుగుతాయి. విద్యా సౌకర్యాన్ని అందజేయడం ఎంతో క్లిష్టంగా ఉన్న వర్గాల పిల్లలకు విద్యను నేర్పేందుకు చేపట్టిన కార్యక్రమాలను ఈ భాగం గుర్తిస్తుంది. బాల్యం ప్రారంభంలో అందించే సేవా కార్యక్రమాలను విడిగా నాల్గవ భాగంలో పేర్కొన్నాము.



## ఇ.ఎఫ్.ఎ అభివృద్ధి సూచిక: అతిపేద దేశాలు అత్యధిక ప్రగతిని సాధించాయి.

2003/04 నివేదికలో ప్రారంభించిన ఇఎఫ్ఎ అభివృద్ధి సూచిక (ఇ.డి.ఐ), నాలుగు ఇఎఫ్ఎ ఆశయాలు: సార్వత్రిక ప్రాథమిక విద్య (యుపిఇ), వయోజన అక్షరాస్యత, లింగ సమానత్వం, విద్యానాణ్యతల సాధనలో దేశం సాధించిన ప్రగతిని సూచిస్తుంది. సమాచార వివరాలను పూర్తిగా ప్రమాణీకరించని కారణంగా, బాల్యం ప్రారంభంలో సంరక్షణ, విద్య (మొదటి ఆశయం), యువకులు, వయోజనుల విద్యావసరాలను (మూడవ ఆశయం) ఇందులో చేర్చలేదు. ఈ నాలుగు ఆశయాలలో ప్రతిదానిని ఒక ప్రాక్సీ ఇండికేటర్‌తో సూచిస్తారు. ఈ నాలుగు ఇండికేటర్ల సగటును ఇ.డి.ఐగా సూచిస్తారు: ఇది 0 నుండి 1 వరకు మారుతూ ఉంటుంది. సూచిక 1 ఇ.ఎఫ్.ఏ.ను సాధించడాన్ని సూచిస్తుంది. 2004 సంవత్సరానికి 125 దేశాలకు ఈసూచికను గణించారు:



© AFP/Tang Chhin Sothy

*ప్రక్కప్రక్కనే ఉన్నా ప్రపంచాలే వేరు: నాంఫెన్, కాంబోడియాలో బడికెళ్తున్న బాలుడు, బ్రతుకుదెరువుకోసం చెత్తనేరుకునే మరో బాలుని ప్రక్కనుండి వెళ్తున్న దృశ్యం.*

- 47 దేశాల ఇ.డి.ఐ 0.95 లేదా అంతకు పైన ఉంది. అంటే వారు ఇ.ఎఫ్.ఎ. ఆశయాలు సాధించి ఉంటారు లేదా సాధించడానికి దగ్గర్లో ఉన్నారని అర్థం. ఉత్తర అమెరికా, యూరప్‌లోని దాదాపు అన్ని దేశాలతోపాటు దక్షిణ అమెరికా మరియు కేరిబియన్‌లో ఆరు దేశాలు, మధ్య ఆసియాలో నాలుగు దేశాలు ఈ స్థాయిలో ఉన్నాయి.

- వివిధ ప్రాంతాలలోని 49 దేశాల ఇ.డి.ఐ 0.80 నుండి 0.94 వరకు ఉన్నాయి. ఐదవ గ్రేడు స్థాయి వరకు (నాణ్యత ప్రాక్సీ) కొనసాగే పిల్లల సంఖ్య తక్కువగా ఉండటం కారణంగా దక్షిణ అమెరికాలోని 15 దేశాల్లో అనేక దేశాలు ఈ రకంలో ఉన్నాయి. వయోజన అక్షరాస్యత తక్కువ ఉండటం కారణంగా అరబ్ దేశాల ఇ.డి.ఐ తక్కువగా ఉంది. ఈ రకంలోని ఎనిమిది ఉప-సహారా అఫ్రికాలోని దేశాలు దక్షిణ-ఆఫ్రికాలోనో లేదా చిన్న ద్వీప రాజ్యాలుగానో ఉన్నాయి.

- 29 దేశాల ఇడిఐ స్కోరు 0.80 కంటే తక్కువగా ఉంది. ఇందులో మూడింట రెండొంతుల దేశాలు ఉప-సహారా ఆఫ్రికాలో ఉన్నాయి. అయితే కొన్ని అరబ్ దేశాలు, దక్షిణాసియా, తూర్పు ఆసియా దేశాలు కూడా ఈ రకంలో ఉన్నాయి. ఈ రకంలోని ఐదు దేశాలు ఫ్రెంచ్ భాష మాట్లాడే పశ్చిమ ఆఫ్రికాలో ఉన్నాయి, వాటి స్కోరు 0.60 కంటే తక్కువగా ఉంది.

2003 నుంచి 2004 మధ్య ఈ సూచిక సగటున 1.6% పెరిగింది. అత్యధిక పెరుగుదల 4.5% అతి తక్కువ ఇడిఐఉన్న రకం దేశాలలో నమోదవడం ఎంతో ఆశాజనకమైన పరిణామం (పటం-1.1). ఇందులో గమనించదగిన విషయం, అతి తక్కువ ఇడిఐ రకంలో ఉండే అవకాశమున్న దాదాపు 12 దేశాలు కల్లోలిత స్థితిలోనో లేదా ఘర్షణ నుంచి ఇప్పుడే బయటపడి ఉండటం వలన వాటి వివరాలు లేక ఈ సమీక్షలో చేర్చలేదు.

## ప్రాథమిక విద్య: విస్తరిస్తోంది, కాని ఇంకా అందరికీ అందుబాటులోలేదు

ఇ.ఎఫ్.ఏ ఆశయాలు, మిల్లీనియం అభివృద్ధి అశయాలను సాధించాల్సిన గమ్యం 2015. ఆనాటికి పిల్లలందరూ మంచి నాణ్యతగల ప్రాథమిక విద్య పూర్తి చేయాలంటే, అర్హతగల వయసున్న పిల్లలందరూ 2009 నాటికి గ్రేడ్1లో చేరాలి. ఇలా జరగాలంటే ఇంకా ఎక్కువ విద్యావకాశాలు నెలకొల్పి ఉపాధ్యాయులను భర్తీ చేయడానికి దేశాలు, విదేశీ విరాళాలిచ్చే సంస్థలు ప్రాథమిక విద్యపై పెట్టే ఖర్చును పెంచాలి. కొంతమంది పిల్లలు ఎందుకు బడిలో అసలే చేరడంలేదు, చేరినా మధ్యలోనే ఎందుకు వదిలేస్తున్నారు, వారు ఎదుర్కొంటున్న అడ్డంకులేమిటి అనే అంశాలను ప్రభుత్వాలు అర్థం చేసుకుంటేనే, ఆ అడ్డంకులను తొలగించే దిశలో ప్రభావపూరిత చర్యలు, కార్యక్రమాలు రూపొందించగలుగుతాయి.

2004లో 682 మిలియన్ పిల్లలు ప్రాథమిక పాఠశాలలో చేరారు. 1999తో పోలిస్తే ఇది 6% ఎక్కువ. వారి సంఖ్య ఉప-సహారా ఆఫ్రికాలో (27%), దక్షిణ, పశ్చిమాసియాలో (19%) గణనీయంగా పెరిగింది, అయితే అరబ్ దేశాల్లో (6%) కొంచెం తక్కువ పెరిగింది.

1. యుపిఇ: నికర ప్రాథమిక ఎన్‌రోల్‌మెంట్ నిష్పత్తి మొత్తం; వయోజన అక్షరాస్యత, 15, అంతకు మించి వయసున్న వ్యక్తుల అక్షరాస్యత; లింగ సమతుల్యం మరియు సమానత్వం: లింగ ఆధార ఇఎఫ్ఏ సూచిక: విద్యా నాణ్యత: గ్రేడ్-5 వరకు కొనసాగడం.

## విశ్వవ్యాప్తంగా బడిలో చేరేవారి సంఖ్య పెరగడంవల్ల బాలికలు ప్రయోజనం పొందుతున్నారు

ప్రపంచ వ్యాప్తంగా ప్రాథమిక నికర ఎన్‌రోల్‌మెంట్ నిష్పత్తి (ఎన్ఇఆర్)[2] 1999 లో ఉన్న 83% నుండి 2004లో 86% పెరిగింది. (పటం 1.2) అత్యంత తక్కువ విస్తృతిగల ప్రాంతాలు అద్భుతమైన ప్రగతిని సాధించాయి. ఉప-సహారా ఆఫ్రికాలో ఎన్.ఇ.ఆర్ 55% నుండి 65%కు పెరిగింది, దక్షిణ, పశ్చిమాసియాలో అది 77% నుండి 86% నికి పెరిగింది. 1999లో ఎన్ఇఆర్ 85% కంటే తక్కువవున్న దేశాలన్నీ తమ పరిస్థితిని మెరుగుపరచుకొన్నాయి, కొన్ని దేశాల్లో అది గణనీయంగా పెరిగింది. (ఉదా: ఇథియోపియా, లెసోథో, మొరాకో, మొజాంబిక్, నేపాల్, నైగర్, యునైటెడ్ రిపబ్లిక్ ఆఫ్ టాంజానియా). 1999లో 85% పైన వున్న 45 వర్ధమాన దేశాలలో ఇరవై నాలుగు దేశాలలో ఈ మధ్యకాలంలో ఎన్ఇఆర్ పడిపోవడం ఆదుర్దా కలిగించే విషయం.

విశ్వవ్యాప్తంగా బడిలో చేరేవారి సంఖ్య పెరగడంవల్ల బాలికలు ప్రయోజనం పొందుతున్నారు. ఎన్‌రోల్‌మెంట్ నిష్పత్తి తక్కువగా ఉండి, లింగ అసమానతలు ఎక్కువగా ఉన్న దేశాలు ఎక్కువ మంది బాలికలకు విద్యను అందిస్తున్నాయి. విశ్వవ్యాప్తంగా, 2004లో బడిలో చేరిన ప్రతి 100 మంది బాలురకు 94 మంది బాలికలు ఉంటున్నారు, 1999లో ఇది 92 మాత్రమే. 2004లోవివరాలు లభ్యమైన 181 దేశాలలో మూడింట రెండువంతుల దేశాలు ప్రాథమిక విద్యలో లింగ సమానత్వాన్ని సాధించాయి. కొన్ని దేశాలు 1999 నుంచే ఈ సమానత్వాన్ని సాధించాయి. ఇందులో మలావి, మారిటానియా, కతార్, ఉగాండా ఉన్నాయి. లింగ అసమానత ఆఫ్ఘనిస్తాన్ (100 బాలురకు 44 బాలికలు), సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, చాడ్, నైగర్, పాకిస్తాన్, యెమెన్‌లలో చాలా ఎక్కువగా ఉంది. అయితే, బడిలో చేరాక బాలికలు ఎక్కువ కాలం కొనసాగుతున్నారు, బాలురతో సమానంగా లేదా మెరుగ్గా చదువుకుంటున్నారు.

2. బడిలో దాఖలు కావాల్సిన అధికార వయసులో బడిలో చేరిన వారి సంఖ్య, ఆ వయసు వారి మొత్తం జనాభాలో శాతంగా.

ప్రాథమిక విద్యలో విశ్వవ్యాప్తంగా నమోదైన పెరుగుదల, గ్రేడ్-1లో కొత్తగా చేరే పిల్లలు పెరగడాన్ని చాలా వరకు ప్రతిబింబిస్తుంది. 1999-2004 మధ్య ఉప-సహారా ఆఫ్రికాలో ఇది 30.9% పెరిగింది. ఒకటవ గ్రేడ్‌లో చేరే పిల్లల సంఖ్య దక్షిణ, పశ్చిమాసియాలో 11.5% పెరగగా, అరబ్ దేశాల్లో 9.1% పెరిగింది, యెమెన్‌లో ఇది చాలా ఎక్కువగా 57% పెరిగింది.


గ్రేడ్-1లో ఆలస్యంగా చేరడం ఉప-సహారా ఆఫ్రికా, దక్షిణ అమెరికా, కేరిబియన్ ప్రాంతాలలో ఇంకా ఆచరణలో ఉంది. ప్రాథమిక స్థాయిలో ఆలస్యంగా చేరిన పిల్లలు చదువుకోవడంలో కొంత సమస్యను ఎదుర్కొంటారనీ పై స్థాయి విద్యకు వెళ్ళే అవకాశం తక్కువనీ కొన్ని అనుభవాలు తెలుపుతున్నాయి. ఎక్కువ వయసులో బడిలో చేరేవారు ఎక్కువగా పేద కుటుంబాల నుండి, గ్రామీణ ప్రాంతాల నుండి వస్తారు. తల్లి విద్య కూడా దీనిపై ప్రభావం చూపుతుంది: కెన్యాలో విద్యలేని తల్లుల పిల్లలు 60% మంది ఆలస్యంగా బడికెళ్ళడం ప్రారంభిస్తే, ప్రాథమిక విద్య పూర్తి చేసిన తల్లుల పిల్లలు కేవలం మూడింట ఒకవంతు మందే ఇలా చేరారు.

### *ఎంత మందిపిల్లలు బడికెళ్లడం లేదు?*

బడికెళ్ళని పిల్లల సంఖ్య తగ్గించడంలో ప్రగతి కొనసాగుతోంది.[3] ప్రాథమిక విద్య వయసున్న పిల్లల జనాభా, బడిలో చేరిన పిల్లల సంఖ్యలపై అందుబాటులో ఉన్న అధికార వివరాలను పోల్చిచూస్తే 2004లో 77 మిలియన్ల మంది పిల్లలు బడికెళ్ళడంలేదని తెలుస్తోంది.-

3. బడికెళ్లని పిల్లల సంఖ్యపై యదార్థ చిత్రాన్ని ఈ నివేదిక ప్రవేశపెట్టింది. ఇంతకు ముందు ప్రాథమిక పాఠశాలకెళ్ళే వయసులో ఉండి ప్రాథమిక పాఠశాలకు వెళ్లనివారి సంఖ్యపై ఆధారపడి దీనిని లెక్కించేవారు. అయితే ఇలా బడికెళ్లని వారిలో లెక్కించిన పిల్లల్లో కొందరు అప్పటికే సెకండరీ విద్యలో చేరేవారు. నిర్వచనం ప్రకారం, బడికెళ్లని పిల్లలంటే వారు ప్రాథమిక లేదా సెకండరీ పాఠశాలల్లో దేనిలోనూ చేరనివారు.


పటం: 1.1: 2004లో ఇ.డి.ఐ మరియు 2003 నుండి మార్పు




*గమనిక:* ఇడిఐ 0.800 కంటే తక్కువగా ఉన్న దేశాలనే చూపించారు.

*మూలం:* ఇ.ఎఫ్.ఎ పూర్తి నివేదికలో రెండవ అధ్యాయం చూడండి.

పటం1.2: ప్రాథమిక విద్యలో నికర దాఖలు, 1999, 2004




*మూలం:* ఇ.ఎఫ్.ఎ పూర్తి నివేదికలో రెండవ అధ్యాయం చూడండి.

1999తో పోలిస్తే 21 మిలియన్లు తగ్గింది. ఇదెంతో గుర్తించదగిన విజయం. ఇందులో 75% 2002-2004 మధ్యే తగ్గింది. వర్ధమాన దేశాలున్న అన్ని ప్రాంతాలలో ఈ సంఖ్య 1999-2004 మధ్య తగ్గింది. దక్షిణ, పశ్చిమాసియాలో (31 మిలియన్ల నుండి 16 మిలియన్ల) ఇది గణనీయంగా తగ్గింది, భారతదేశంలో బాగా తగ్గడమే ఇందుకు ప్రధాన కారణం. 1999-2004 మధ్య 43 మిలియన్ నుంచి 38 మిలియన్లకు తగ్గినా, ప్రపంచంలోని బడికెళ్ళని పిల్లల్లో 57% బాలికలు ఉన్నారు వారి శాతం 1999లో 59%. దక్షిణ, పశ్చిమాసియాలలో వారి భాగం చాలా ఎక్కువ (69%). 28 వర్ధమాన దేశాలలో (వివరాలు లభ్యమైన 112లో) ఒక్కొక్క దేశంలో మిలియన్లకు మించి బడికెళ్ళని పిల్లలున్నారు. నైజీరియా, పాకిస్తాన్, భారతదేశం, ఇథియోపియాలో అవరోహణ క్రమంలో అత్యధికంగా ఇలాంటి పిల్లలున్నారు-ఈ నాలుగు దేశాల్లోనే 23 మిలియన్ల మంది ఉన్నారు. (పటం 1.3).

బడికెళ్ళని పిల్లల సంఖ్య తగ్గడం ఎంతో ఉత్సాహాన్నిచ్చే అంశమయినప్పటికీ, దీన్ని చూసి అలసత్వం రావద్దు. కొన్ని దేశాల అధికార పాఠశాల దాఖలు వివరాలు, ఇతర దేశాలలో హాజరు సమాచారం కోసం చేసిన కుటుంబ సర్వేలు, ఆధారంగా యు.ఐ.ఎస్ మరియు యునిసెఫ్ సంయుక్తంగా జరిపిన అధ్యయనం 2002లో బడికెళ్ళని పిల్లల సంఖ్య 115 మిలియన్ల అంచనా వేసింది. అయితే ఆ సంవత్సరం ప్రభుత్వ వివరాలు 94 మిలియన్లు సూచించాయి. మరోవైపు ఈ రెండు సంఖ్యలు రెండు సక్రమంగా బడికెళ్లని పిల్లల సంఖ్యను తక్కువగా అంచనా వేసిఉండవచ్చు: ఉదాహరణకు, భారతదేశం అంతటా ప్రాథమిక పాఠశాలలు, విద్యార్థులపై ఇటీవల జరిపిన సర్వేలో, సర్వే బృందం ఆయా బళ్ళకు వెళ్ళిన రోజుల్లో గైర్హాజరైన పిల్లల శాతం సగటున 30% అని తేలింది.

### *బడికెళ్ళని పిల్లలెవరు?*

బడికెళ్లని పిల్లల సంఖ్యను తగ్గించడానికి ప్రభావవూరితమైన విధానాలను రూపొందించి అమలు చేయాలంటే, ప్రభుత్వాలకు అసలు బడికెళ్ళని పిల్లలెవరో స్పష్టంగా తెలియాలి. బడికెళ్లని పిల్లల ప్రధాన పరిస్థితుల లక్షణాలు, వారి విద్యా అనుభవాలపై యుఐస్/యునిసెఫ్ అధ్యయనం మరియు ఈ నివేదికకోసం చేపట్టిన కార్యక్రమం దృష్టిసారించాయి. వీటిలో పొందువర్చిన సాక్ష్యాధారాలు వివిధ స్థాయిలలోని ప్రతికూల పరిస్థితులను ప్రభావవూరితంగా ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలను రూపొందించేందుకు విలువైన దిశానిర్దేశం చేస్తాయి. (బాక్స్ 1.2)


2004లో బడికెళ్ళని దాదాపు 77 మిలియన్ల పిల్లలలో, 7 మిలియన్ల మంది బడిలో చేరి వెళ్ళడం మానేశారు, 23 మిలియన్ల మంది ఆలస్యంగా బడిలో చేరే అవకాశముండగా, 47 మిలియన్ల మంది పిల్లలు అదనంగా ప్రోత్సాహకాలిస్తే తప్ప బడికెళ్ళే అవకాశంలేదు. ఈ మూడవ రకం పిల్లల్లో అత్యధికులు విద్యా సూచికలు అతి తక్కువగావున్న ఉప-సహారా ఆఫ్రికా, దక్షిణాసియా ప్రాంతాల్లో ఉన్నారు. దక్షిణ అమెరికా, కేరిబియన్, తూర్పు ఆసియా, పసిఫిక్ ప్రాంతాల్లో అసలే బడిలో చేరని పిల్లల కంటే ఆలస్యంగా బడిలో దాఖలు అయ్యేరకం పిల్లలెక్కువ.

బడికి వెళ్లని పిల్లల పరిస్థితులపై ఎనభై దేశాల్లో జరిపిన కుటుంబ సర్వేలు వివరాలు అందించాయి. (పటం 1.4):

- పరిశోధన జరిపిన లక్షణాలలో **లింగ అసమానత** పెద్దగా కనబడలేదు.అయితే కొన్ని దేశాల్లో బడికెళ్లని వారిలో బాలికల సంఖ్య గణనీయంగా ఎక్కువగా ఉంది, అవి: అరబ్ దేశాలు (ప్రతి 100 బాలురకు 134 మంది బాలికలు), దక్షిణ, పశ్చిమాసియా (129), మరియు కొన్ని దేశాలు యెమెన్ (184), భారతదేశం (136), బెనిన్ (136).


**77 మిలియన్ల పిల్లలు బడికెళ్ళడం లేదు.**

**పటం 1.3 : 2004లో 500,000 పైగా బడికెళ్లని పిల్లలున్న వర్ధమాన దేశాలు**




*మూలం:* ఇఎఫ్ఎ పూర్తి నివేదికలో రెండవ అధ్యాయం చూడండి.

**పటం 1.4: 80 దేశాలలో బడికెళ్లని పిల్లల లక్షణాలు**




*మూలం:* ఇఎఫ్ఎ పూర్తి నివేదికలో రెండవ అధ్యాయం చూడండి.

**ఉప-సహారా ఆఫ్రికాలో మూడింట రెండొంతుల కంటే తక్కువ విద్యార్థులు ఆఖరి గ్రేడ్‌కు చేరతారు.**

- ***నివాసం:*** 24 దేశాలలో పట్టణ ప్రాంతంలో బడికెళ్లని పిల్లల కంటే గ్రామీణ ప్రాంతంలో బడికెళ్లని పిల్లలు రెట్టింపు సంఖ్యలో ఉన్నారు. పట్టణ-గ్రామీణ అసమానతలు బుర్కినా ఫాసో, ఎరిట్రియా, ఇథియోపియా, నికరాగువాల్లో ఎక్కువగా ఉన్నాయి. ఉప-సహారా ఆఫ్రికాలో, దక్షిణ, పశ్చిమాసియాల్లోని బడికెళ్ళని పిల్లల్లో 80% పిల్లలు గ్రామీణ ప్రాంతాలవారే.
- ***కుటుంబ ఆర్థిక వనరులు:*** అతి పేద 20% కుటుంబాలకు చెందిన పిల్లలు, అత్యంత ధనిక 20% కుటుంబాల పిల్లల కంటే బడికి వెళ్ళకపోయే అవకాశం మూడురెట్లు ఎక్కువ. ఈ ప్రభావం ముఖ్యంగా అరబ్ దేశాలలో ప్రముఖంగా కనిపిస్తుంది, మధ్య తూర్పు ఐరోపాల్లో ఇది అతి తక్కువగా కనిపిస్తుంది.
- ***తల్లి విద్య:*** చదువుకున్న తల్లి పిల్లలకంటే, ఏ చదువులేని తల్లి పిల్లలు బడికి వెళ్లకపోయే అవకాశం రెండింతలు ఉంటుంది. దక్షిణాసియా, దక్షిణ అమెరికాలలో ఈ తేడా దాదాపు 2.5 రెట్లు ఉంటుంది.

వీటన్నిటి సమిష్టి ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుంది. గినియాలో, పట్టణంలో చదువుకున్న తల్లికి అత్యంత ధనిక కుటుంబాలలో పుట్టిన బాలుడు, గ్రామీణ ప్రాంతంలో, చదువురాని తల్లికి, అత్యంత పేద కుటుంబాలలో పుట్టిన బాలిక కంటే బడికి వెళ్ళే అవకాశం 126 రెట్లు ఎక్కువ.

## *ప్రాథమిక విద్యలో చివరి తరగతికి ఎంతమంది పిల్లలు చేరతారు?*

పిల్లలెంతకాలం బడిలో కొనసాగుతారనే అంశంపై ఎన్నో విషయాలు ప్రభావం చూపుతాయి. బడికెళ్ళని పిల్లలపై విశ్లేషణ చూపినట్లు కుటుంబ పేదరికం. పిల్లలు బడిలో కొనసాగటానికి అతిపెద్ద అడ్డంకి. కొన్ని దేశాలలో, విద్యపై అయ్యే ఖర్చులో 40% వరకు ఫీజులు, పాఠ్యపుస్తకాలు, యూనిఫారం, రవాణా ఖర్చుల రూపంలో కుటుంబాలే భరిస్తాయి. కుటుంబ ఆదాయానికి తోడ్పడటంకోసం చాలాసార్లు పిల్లలు పనిచేయాల్సి వస్తుంది (బాక్స్ 1.1) లేదా తోబుట్టువుల పెంపకం చూసుకోవాల్సి ఉంటుంది. స్కూల్లో ఒకసారి చేరిన తర్వాత, అక్కడ విద్యా ప్రమాణాలు సరిగ్గా లేకుంటే అంటే-తరగతుల్లో పరిమితికి మించి విద్యార్థులు, శిక్షణలేని ఉపాధ్యాయులు, పాఠ్యసామాగ్రి కొరత వంటివి ఉంటే అవి పిల్లల చదువుపై బలమైన దుష్ప్రభాన్ని చూపుతాయి, పిల్లలు బడి మానేసే అవకాశాలను పెంచుతాయి.

### బాక్స్ 1.1: ప్రాథమిక విద్యను సార్వత్రికం చేయడానికి బాలకార్మిక సమస్యను తగ్గించాలి.

పేదరికం కారణంగా బడికెళ్ళని పిల్లలు ఏదో పనిలో చేరే అవకాశం ఉంది. ఈ మధ్యకాలంలో బాలకార్మిక సమస్య కొంత తగ్గినప్పటికీ, నేటికి కూడా 218 మిలియన్ల బాలకార్మికులు పనిచేస్తున్నారు, వారిలో మూడొంతుల మంది 14 కంటే తక్కువ వయసు పిల్లలు. దీంట్లో 5-17 సంవత్సరాల మధ్య వయసున్న పిల్లలు 126 మిలియన్ల మంది అతి హీనమైన దోపిడి గురవుతున్నారు-ట్రాఫికింగ్, వెట్టి చాకిరీ, బానిసత్వం, లైంగిక అత్యాచారాలు, ఇతర అక్రమ కార్యకలాపాలు. బాలకార్మిక సమస్యపై అంతర్జాతీయ కార్మిక సంస్థ రూపొందించిన రెండు అంగీకారాలను 2006 వరకు 162 దేశాలు సంతకం చేశాయి. పిల్లలు పనిచేసి సంపాదించాల్సిన అవసరం లేకుండా చాలా దేశాలు నగదు సబ్సిడీ కార్యక్రమాలు ప్రారంభించాయి, తద్వారా వారు బడికిపోయే అవకాశాలు మెరుగవుతాయి. ఇంకొన్ని దేశాలు పనిచేసే పిల్లలను నేరుగా చేరుకుని వారికవసరమైన రీతిలో వెసులుబాటుగల విద్యా కార్యక్రమాలు రూపొందిస్తున్నాయి.

వివరాలు లభ్యమైన 132 దేశాలలో సగం దేశాలలో ప్రాథమిక పాఠశాలలో చేరిన పిల్లలలో 87%, 2003లో ప్రాథమిక విద్యలో చివరి తరగతికి చేరారు. అయితే ఈ సగటు రేటు వెనుక ఎంతో ప్రాంతీయ వైరుధ్యం దాగి ఉంది. దక్షిణ అమెరికా, కేరిబియన్‌లలో బడిలో దాఖలయ్యే పిల్లల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ బడి విద్యను పిల్లలు పూర్తి చేయకపోవడం ఒక ముఖ్యమైన యుపిఇ సవాలుగా మారింది. అక్కడ అత్యధిక దేశాలలో గ్రేడ్ 1లో ఉన్న విద్యార్థులలో 83% కంటే తక్కువ విద్యార్థులు ఆఖరు గ్రేడువరకు చేరగలుగుతున్నారు. ఉప-సహారా ఆఫ్రికాలోని అనేక దేశాలలో బడిలో దాఖలయిన పిల్లలలో కేవలం మూడింట రెండువంతుల మందే చివరి గ్రేడుకు వెళ్తున్నారు. బంగ్లాదేశ్, నేపాల్‌తో సహా దక్షిణ, పశ్చిమాసియా ప్రాంతంలోని చాలా దేశాలలో కూడా బడిలో కొనసాగేవారి సంఖ్య తక్కువగా ఉంది.

బడిలో చేరకపోవడానికి తోడ్పడే కారణాలే మధ్యలో బడి ఆపేయడానికి తోడ్పడతాయి. పిల్లల లింగమేదయినప్పటికీ, పేద గ్రామీణ కుటుంబాలకు చెందిన పిల్లలు బడి మానేసే అవకాశాలు ఎక్కువ. ఇథియోపియాలో పట్టణ ప్రాంత పిల్లలకంటే గ్రామీణ ప్రాంత పిల్లలు బడి మధ్యలో మానేసే అవకాశం అరవై రెట్లు ఎక్కువ. బుర్కినా ఫాసో, మాలి, మొజాంబిక్‌లలో అతిపేద 40% కుటుంబాలకు చెందిన ప్రాథమిక పాఠశాలలో చేరిన పిల్లలో కేవలం 10% మందే ప్రాథమిక విద్యను పూర్తి చేయగలిగారు.

ప్రాథమిక స్థాయిలో ఆఖరు తరగతికి చేరిన పిల్లలు, ఆ తరగతిని విజయవంతంగా పూర్తి చేసిన పిల్లల మధ్య చాలా తేడా ఉంటుంది (20% కంటే ఎక్కువ). సెకండరీ స్థాయి ప్రారంభ తరగతులలో కొద్ది అవకాశాలే ఉండటం వలన ప్రాథమిక స్థాయి ఆఖరు తరగతిలో కష్టమైన పరీక్షలు, పిల్లలు తక్కువగా నేర్చుకోవడం కూడా ఇందుకు కారణం కావచ్చు. యుపిఇ పూర్తిగా సాధించడంకోసం ప్రాథమిక పాఠశాలలో ప్రాథమిక విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి అలాగే సెకండరీ స్థాయిలో క్రింది తరగతులలో ప్రవేశావకాశాలు పెంచాలి.

## సెకండరీ పాఠశాలలపై ఒత్తిడి

తొమ్మిది సంవత్సరాల కనీస సార్వత్రిక విద్యను కల్పిస్తామని ఎన్నో ప్రభుత్వాలు తమ కట్టుబాటును ప్రకటించాయి. మొత్తం 203 దేశాలు, ప్రాంతాలలో నుండి 192 దేశాలలో నిర్బంధ ప్రాథమిక విద్యకు చట్టాలున్నాయని తెలిపాయి. వీటిలో మూడొంతుల దేశాలలో నిర్బంధ విద్యలో సెకండరీ స్థాయిలోని క్రింది తరగతులు కూడా ఉన్నాయి.

సెకండరీ విద్యకు గిరాకీ పెరుగుతోంది. 2004లో 502 మిలియన్ల విద్యార్థులు సెకండరీ విద్యలో దాఖలయ్యారు, 1999 కంటే ఇది 14% ఎక్కువ. అరబ్ దేశాలు, ఉప-సహారా ఆఫ్రికా, దక్షిణ, పశ్చిమాసియాలలో చాలా వేగంగా పెరిగింది. (ప్రతి చోటా 20% పెరుగుదల) ఉప-సహారా ఆఫ్రికా మినహా అన్ని ప్రాంతాలలోని సగం దేశాలలో ప్రాథమిక విద్య పూర్తయిన వారిలో 90% మంది విద్యార్థులు సెకండరీ విద్యలో చేరారు. ఉప-సహారా ఆఫ్రికాలో మూడింట రెండొంతుల కంటే తక్కువ విద్యార్థులు సెకండరీ స్థాయికి మారారు.

ఉత్తర అమెరికా, పశ్చిమ ఐరోపా, పసిఫిక్‌లలో సెకండరీవిద్య దాదాపు సార్వత్రికంగా ఉంది, మధ్య, తూర్పు ఐరోపా, మధ్య ఆసియా, లాటిన్ అమెరికా, కేరిబియన్‌లలో ఇది చాలా ఎక్కువ. అందుకు భిన్నంగా

సెకండరీ స్థాయిలో స్థూలంగా దాఖలయిన నిష్పత్తులు (జిఇఆర్‌లు)[4] ఉప-సహారా ఆఫ్రికాలో 30% కంటే తక్కువ, దక్షిణ, పశ్చిమాసియాలలో 51% అరబ్ దేశాలలో 66% ఉంది. సెకండరీ స్థాయిలో చేరుతున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ అది ప్రాథమిక స్థాయిలలో చేరే వారికంటే చాలా తక్కువ. 2004లో ప్రపంచవ్యాప్తంగా సరాసరి జి.ఇ.ఆర్ కేవలం 65% మాత్రమే.

విశ్వవ్యాప్తంగా సెకండరీస్థాయిలోని క్రింది తరగతులలో చేరేవారి సంఖ్య, పై తరగతులకు వెళ్ళేవారికంటే ఎక్కువగా ఉంది. 2004లో క్రింది తరగతుల జి.ఇ.ఆర్. 78% ఉండగా పై తరగతులకు 51% నమోదయింది. (పటం 1.5). ఈ రెండు స్థాయిలలో పాల్గొనే విద్యార్థుల సంఖ్యలో తేడా (పర్సెంటేజ్ పాయింట్లలో) తూర్పు ఆసియా, పసిఫిక్‌లలో (42) మరియు దక్షిణ అమెరికా, కేరిబియన్‌లలో (31) ఎక్కువ. ఈ రెండుచోట్లా ఇది విశ్వ సగటు (27) కంటే ఎక్కువ ఉంది.

పెరుగుతున్న డిమాండు దృష్ట్యా, సెకండరీ విద్య అందుబాటు అసమానత్వంతో కూడుకొని ఉంది. బలహీన వర్గాల (పేదలు, కొన్ని జాతులవారు, వికలాంగులు, ముఖ్యంగా ఆడపిల్లలు) పిల్లలకు అది లభ్యంకావడంలేదు. ఉప-సహారా ఆఫ్రికాలో సెకండరీ విద్య పొందలేని వారిలో అనుపాతానికి మించి అత్యధికులు పేదలు, గ్రామీణ ప్రాంతాల బాలికలున్నారు. అత్యంత ధనిక కుటుంబాలకుచెందిన బాలురలో దాదాపు 50% మంది ఏడవ గ్రేడ్ వరకు చదువుకోగా, అత్యంత పేద కుటుంబాలకు చెందిన బాలికల్లో కేవలం 4% మందే ఆ స్థాయికి చేరతారు.


ప్రాథమిక స్థాయిలో లింగసమతుల్యాన్ని మూడింట రెండొంతుల దేశాలు సాధించగా, సెకండరీ స్థాయిలో కేవలం మూడింట ఒక వంతు దేశాలే సాధించాయి. అన్ని స్థాయిల్లోనూ లింగ సమతుల్యాన్ని నెలకొల్పేలా కార్యక్రమాలను రూపొందించాల్సిన ఆవశ్యకతను ఈ స్థితి ఎలుగెత్తి చాటుతోంది. పాఠశాలలో లైంగిక వేధింపులు, హింసను ఖచ్చితంగా ఎదుర్కోవాలి. పాఠ్య పుస్తకాలలో ఉండే వివక్షను సవరించి, లింగ చైతన్యం కలిగేలా ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చి, సాంఘిక దురాచారాలను, మూఢ నమ్మకాలను ఓడించేందుకు ప్రయత్నించడమనేవి సమానత్వాన్ని సాధించే వ్యూహంలో భాగంగా ఉండాలి.

ప్రాథమిక స్థాయికన్నా సెకండరీ విద్యలో లింగ అసమానతల పద్ధతులలో (ప్యాటర్న్స్)లో సంక్లిష్టత ఉంటుంది. బాలికలు వివక్షకు గురవుతున్న దేశాలు ఎన్ని ఉన్నాయో, బాలురు వివక్షకు గురవుతున్న దేశాలు అన్నే ఉన్నాయి. మొదటి రకం దేశాలలో సెకండరీ విద్యలో దాఖలు రేటు చాలా తక్కువగా ఉంటుంది. (అఫ్ఘనిస్తాన్, చాడ్, గినియా, టోగో, యెమెన్‌లలో సెకండరీ విద్యలో దాఖలయ్యే ప్రతి 100 మంది బాలురకు కేవలం 50 మంది బాలికలే చేరుతున్నారు). బాలురు లింగ అసమానతలకు గురవడాన్ని ధనిక దేశాలలోనూ, అత్యధిక లాటిన్ అమెరికా, కేరిబియన్ దేశాలలో చూడవచ్చు.

### తృతీయ శ్రేణి: పెరుగుతోంది కాని లైంగిక అసమానత కొనసాగుతోంది

తృతీయ శ్రేణి విద్యకు, ఇ.ఎఫ్ఎ ఆశయాలకు కనీసం రెండు విధాలుగా సంబంధం ఉంది: లింగ సమానత్వాన్ని సాధించాలనే ఆశయంతో నేరుగా

**పటం1.5: 2004లో వివిధ స్థాయిలలో, ప్రాంతాలలో సెకండరీ విద్యలో స్థూల దాఖళ్ళ నిష్పత్తులు**




*మూలం:* ఇ.ఎఫ్.ఎ పూర్తి నివేదికలో రెండవ అధ్యాయం చూడండి.

సంబంధం ఉండగా, తరచుగా ఉపాధ్యాయులు, పాలనా సిబ్బందిని అందించే రంగంగా సంబంధం ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా 2004లో 132 మిలియన్ల మంది విద్యార్థులు తృతీయ శ్రేణి విద్యలో దాఖలయ్యారు. ఇది 1999 కంటే 43% ఎక్కువ. ఇందులో మూడొంతుల అభివృద్ధి వర్ధమాన దేశాలలోనే జరిగింది. కేవలం చైనాలోనే 60% పెరిగింది. ఈ స్థాయిలో జి.ఇ.ఆర్ 24% ఉంది, అయితే దక్షిణ, పశ్చిమాసియాల్లో (10%) మరియు ఉప-సహారా ఆఫ్రికాలో (5%) చాలా తక్కువగా ఉంది.

తృతీయ శ్రేణి విద్యలో లింగ సమానత్వం కేవలం అడోరా, సైప్రస్, జార్జియా, మెక్సికో, పెరూలోనే కనిపిస్తుంది. ఆధునిక దేశాలు, మార్పు చెందుతున్న దేశాలలో, మహిళలు, పురుషులకంటే ఎక్కువగా ఈ స్థాయిలో కనిపిస్తారు. 1999, 2004 మధ్య వర్ధమానదేశాలు కొంత ప్రగతి సాధించినా పురుషులకంటే మహిళల భాగస్వామ్యం చాలా తక్కువగానే ఉంటోంది. 2004లో ప్రతి 100 దాఖలయిన పురుషులకు కేవలం 87 మంది మహిళలే చేరుతున్నారు. అయితే ఇది 1999లో కేవలం 78 ఉండేది. తృతీయ శ్రేణి విద్యా రంగాలయిన విద్య, సాంఘిక శాస్త్రం, శాస్త్ర సాంకేతిక రంగాలలో మహిళలు తక్కువగా పాల్గొనటం వలన ఉద్యోగావకాశాలు, సమాన వేతనాలు, యాజమాన్య పదవులు తగ్గి సమాజంలో లింగ అసమానతలను బలపరుస్తున్నాయి.

### ఉపాధ్యాయులపై అధిక పెట్టుబడి, పిల్లలు ఎంత బాగా నేర్చుకుంటారో సమీక్షించడం ద్వారా నాణ్యత పెంచవచ్చు.

విద్యావ్యవస్థలు పిల్లలకెంత ఉపయోగపడుతున్నాయో విశ్లేషించే ప్రయత్నాన్ని ఈ నివేదిక ప్రతి ఎడిషన్ చేపట్టుంది. బడికి వెళ్తున్న పిల్లలు మధ్యలో మానేయడం, వారిలో కొందరు ప్రాథమిక అక్షరాస్యత, అంకెల పరిజ్ఞానం వంటి నైపుణ్యాలను నేర్చుకోలేకపోవడం విద్యా వ్యవస్థలోని నాణ్యతా ప్రమాణాల లోపాల్ని పాక్షికంగా ప్రతిబింబిస్తాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు నేర్చుకోవడంలో విజయాలు అనేవి తరగతి గదుల్లో ప్రపంచ వ్యాప్తంగా ఏమవుతుందో తెలుసుకొనేందుకు ఉపయోగపడే రెండు కోణాలు.

**పెరుగుతున్న డిమాండు దృష్ట్యా, సెకండరీ విద్య అందుబాటు అసమానత్వంతో కూడుకొని ఉంది.**

4. ఏదైనా ఒక స్థాయి విద్యలో, వయసుతో నిమిత్తం లేకుండా చేరినవారందరి సంఖ్య, ఆ స్థాయి విద్యకు అధికారికంగా నిర్ధారించిన వయసుగల వారి జనాభాలో శాతంగా

## ఉపాధ్యాయుల సంఖ్య, శిక్షణ, ప్రేరణలను పరిష్కరించడం

ప్రతి ఉపాధ్యాయునికి ఎంతమంది పిల్లలున్నారనే నిష్పత్తిని తరచుగా విద్యా ప్రమాణాల నాణ్యతకు సూచిగా వాడతారు. దక్షిణ, పశ్చిమాసియాలో తప్ప మిగతా అంతటా 1999-2004 మధ్య విద్యార్థి/ ఉపాధ్యాయుడు నిష్పత్తులు (పిటిఆర్‌లు) తగ్గాయి. 2004లో వివరాలు లభ్యమైన 174 దేశాలలో 84% దేశాలలో ప్రాథమికస్థాయిలో ఒక ఉపాధ్యాయునికి నలభై కంటే తక్కువ విద్యార్థులున్నారు. దాదాపు ముప్పై దేశాలలో విద్యార్థులు- ఉపాధ్యాయుల నిష్పత్తి 40: 1 కంటే ఎక్కువగా ఉంది. ఇందులో అత్యధికం ఉప-సహారా ఆఫ్రికాలోను, మరికొన్ని తూర్పు ఆసియా మరియు పసిఫిక్, దక్షిణ పశ్చిమాసియాలో ఉన్నాయి. ప్రాథమిక స్థాయిలో దాఖలు సంఖ్య పెరుగుతున్న దేశాలలో పి.టి.ఆర్. ఎక్కువగా ఉంటుంది. కాంగో, ఇథియోపియా, మలావీలలో డెబ్భై మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుని చొప్పున ఉన్నారు.

**అనేక దేశాలలో ప్రైమరీ స్కూలు టీచర్లలో అత్యధికులు మహిళలే**

కొన్ని మినహాయింపులు ఉన్నప్పటికీ అత్యధిక దేశాలలో ప్రాథమిక పాఠశాలలలోని ఉపాధ్యాయులలో మహిళలే ఎక్కువగా ఉన్నారు. ప్రాథమిక పాఠశాలలలో బాలుర పట్ల ప్రాధాన్యత ఎక్కువగా ఉండి లైంగిక వివక్ష తీవ్రంగా కనబడే ఆఫ్ఘనిస్థాన్, బేనిన్ చాడ్, టోగో వంటి దేశాలలో ప్రాథమిక పాఠశాలలో పనిచేసే వారిలో మహిళల సంఖ్య 20% లేదా అంతకన్నా తక్కువగా ఉంది. ఉన్నత విద్యా స్థాయిలో ఉపాధ్యాయుల సంఖ్యలో మహిళల సంఖ్య ఇంకా తక్కువగా ఉంది. ముఖ్యంగా తృతీయ శ్రేణి విద్య బోధకులలో మగవారిదే పై చేయిగా ఉంది.

డేటా కలిగి ఉన్న 41 దేశాలలో సగం దేశాలలో 1999-2004 మధ్య సుశిక్షితులైన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల శాతం కొద్దిగా పెరిగింది. బహామాస్, నమీబియా, రవాండాలలో ఈ పెరుగుదల గణనీయంగా ఉంది. (60%నికి పైగా పెరుగుదల) 2004లో 76 దేశాల నుండి ప్రాథమిక స్థాయిపై, 59 దేశాల నుండి సెకండరీ విద్యపై లభించిన వివరాలను బట్టి, సగం దేశాలలో ఉపాధ్యాయులకు బోధనా పద్ధతులపై శిక్షణలేదని తెలిసింది. ఉదాహరణకు లెబనాన్, నేపాల్, టోగోలలో సగానికికన్నా తక్కువ మంది ఉపాధ్యాయులు మాత్రమే జాతీయ ప్రమాణాలకు తగిన శిక్షణ పొందారు.

ఉపాధ్యాయుల భర్తీ, శిక్షణ ఇంకా కీలక సమస్యలుగానే ఉన్నాయి. ముఖ్యంగా, ప్రాథమిక స్థాయి విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న ప్రాంతాలలో ఈసమస్య ఇంకా తీవ్రంగానే ఉంది. బంగ్లాదేశ్, ఇథియోపియా, పాకిస్తాన్, సౌదీ అరేబియా దేశాలకు కలిపి ఏడాదికి 65000 ఉపాధ్యాయులు అదనంగా కావాలి. యుపిఇ ఆశయాన్ని సాధించి, పిటిఆర్‌ని 40:1కి తగ్గించాలంటే ఉప-సహారా ఆఫ్రికాలో 2015 నాటికి 1.6 మిలియన్ల ఉపాధ్యాయులను భర్తీ చేయవలసి ఉంటుంది.

ఉపాధ్యాయుల నియామకమనేది వారి హోదా, సేవా నిబంధనలతో ముడిపడిన అంశం. ఉప-సహారా ఆఫ్రికా, దక్షిణాసియా[5] ఎన్నో దేశాలలో ఇటీవల ఉపాధ్యాయుల ప్రేరణపై జరిపిన పరిశోధన ప్రాజెక్టు ప్రకారం తక్కువ ఆదాయం కలిగిన దేశాలలో అత్యధిక పాఠశాల వ్యవస్థలు ఉపాధ్యాయుల ప్రేరణ సంక్షోభం ఎదుర్కొంటున్నాయని తేలింది. పట్టణ ప్రాంతాలకంటే గ్రామీణ ప్రాంతాలలో పనిచేయడం ఎంతో కష్టం. ఉపాధ్యాయులలో అంకితభావాన్ని పెంచడంకొరకు ఈ అధ్యయనం కొన్ని వ్యూహాలను గుర్తించింది. అవి:

- గ్రామీణ ప్రాంతాలకు ఉపాధ్యాయులను ఆకర్షించి, వారు అక్కడే కొనసాగేలా చేయడంకోసం నీటి పంపులు, విద్యుచ్ఛక్తి సౌకర్యంగల చోట గృహవసతిని కల్పించడం అనేది ఆర్థికంగా అత్యంత ప్రభావపూరితమైన పద్ధతి కావచ్చు.
- గ్రామీణ ప్రాంతాలలో ఎదురయ్యే సమస్యలకు సరైన పరిహారం చెల్లించే విధంగా ఉపాధ్యాయులకు ప్రత్యేక అలవెన్సులు.
- ఎవరూ పనిచేయడానికి ఇష్టపడని గ్రామీణ పాఠశాలలలో పనిచేసే ఉపాధ్యాయులకు సత్వర పదోన్నతి మరియు/లేదా తమ అర్హతలను మెరుగుపరుచుకోవడానికి కోరుకున్న అవకాశాలను కల్పించాలి.
- నిర్ణయాలు తీసుకొనే ప్రక్రియలో ఉపాధ్యాయులు పాల్గొనేలా చేయాలి. పాఠశాల నిర్వాహకులు, తల్లిదండ్రులు, సముదాయంతో ఉపాధ్యాయులు చర్చలు జరపాలి.

అనేక లాటిన్ అమెరికా దేశాలలో ప్రోత్సాహక వ్యూహాలు అమలులో ఉన్నాయి. బొలీవియా గ్రామీణ ప్రాంతాలలో పనిచేసే ఉపాధ్యాయుల వేతనాలను పెంచింది. మెక్సికో, చిలీ పనితీరు ఆధారిత ప్రోత్సాహక పద్ధతులను ప్రవేశపెట్టాయి. చిలీలో, ఈ కార్యక్రమాలలో పాల్గొనే పాఠశాలలో విద్యార్థుల ప్రతిభ పెరిగిందని ప్రాథమిక సాక్ష్యాధారాలు తెలుపుతున్నాయి. ఎల్‌సాల్వెడార్, హోండూరాస్‌లలో వికేంద్రీకరణ, పాఠశాల ఆధారిత యాజమాన్య విధానాల ఫలితంగా ఉపాధ్యాయులకు తమ పాఠశాలలలో నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో ఎక్కువగా పాల్గొనే అవకాశం లభించింది. బ్రెజిల్‌లో అదనపు ఉపాధ్యాయులను నియమించి, వారికి శిక్షణ ఇవ్వడం కోసం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రోత్సాహకాలను అందించే ఒక జాతీయ కార్యక్రమం కొనసాగుతోంది.

ఉపాధ్యాయుల సంఖ్యను పెంచి, శిక్షణను వాస్తవ బోధనా ప్రపంచంతో అనుసంధానించడంకోసం అనేక దేశాలు స్వల్పకాలిక శిక్షణా కార్యక్రమాలను ప్రవేశపెట్టాయి, ఆన్-ది-జాబ్ ప్రాక్టీస్‌కు ప్రాధాన్యాన్ని ఇస్తున్నాయి. క్యూబాలో ఉద్యోగానికి ముందుగా ఇచ్చే శిక్షణ అంతా పాఠశాల ఆధారితంగానే ఉంటోంది. ఈ విధమైన పద్ధతికి శిక్షణ వాతావరణాన్ని కల్పించడంకోసం సరిపోను పాఠశాలలు కావాలి. అలాగే మెంటర్స్‌గా పనిచేయడానికి తగినంత మంది ఉపాధ్యాయులు ఉండాలి. ఉప-సహారా దేశాలలో చాలా వాటిలో స్వల్పకాలిక శిక్షణ పద్ధతినే పాటిస్తున్నారు. గినీ, 1998లో శిక్షణా కాలాన్ని మూడేళ్ళ నుండి రెండేళ్లకు తగ్గించింది. ఆ తరువాత నుండి ప్రతి యేటా 1500 మంది కొత్త ఉపాధ్యాయులు ఉద్యోగంలో చేరుతున్నారు. ఈ సంస్కరణ అమలు చేయక ముందు కేవలం 200 మందే చేరేవారు. ఉపాధ్యాయుల లభ్యతను పెంచడంకోసం ఉద్యోగంలో చేరేముందు ఇచ్చే శిక్షణ కాలాన్ని తగ్గించడమే కీలకమైన వ్యూహం. రోజురోజుకు మరిన్ని దేశాలు తక్కువ శిక్షణకాలం, పాఠశాల ఆధారిత శిక్షణవైపు మొగ్గు చూపుతున్నాయి. యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఇప్పుడు శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు వారి శిక్షణాకాలంలో మూడింట రెండొంతుల సమయాన్ని పాఠశాలల్లోనే గడుపుతున్నారు.

## విద్యా ఫలితాల జాతీయ సమీక్షకు పెరుగుతోన్న ప్రాధాన్యత

1990ల నుండి అనేక దేశాలు విద్యాఫలితాలను, విద్యార్థులు నేర్చుకున్న అంశాలను సమీక్షించే చర్యలు చేపడుతున్నాయి. ఈ జాతీయ సమీక్షల ద్వారా తమ విద్యావ్యవస్థల సామర్థ్యం, నాణ్యతపై ప్రభుత్వాలకు ఎంతో ఉపయోగకరమైన సమాచారం లభిస్తోంది. ఎంపిక చేసిన

5. ఘనా, భారత్, లిసోతో, మలావీ, సియెరా లియోన్, యునైటెడ్ రిపబ్లిక్ ఆఫ్ టాంజానియా, జాంబియా

పాఠ్యాంశాలలో జాతీయంగా నిర్ణయించిన ప్రమాణాల ఆధారంగా విద్యార్థులు నేర్చుకునే అంశాలను పోల్చిచూస్తారు.

ఈ సమీక్షల నాణ్యతలలో ఎంతో తేడా ఉన్నప్పటికీ విద్య నాణ్యతను పర్యవేక్షించేందుకు దేశాలు చేస్తున్న ప్రయత్నాలను ఇది సూచిస్తుంది. 1960లలో ప్రారంభమైన అంతర్జాతీయ సమీక్షలో అనేక దేశాలు చేరడంతో విశ్వప్రగతిని సమీక్షించడానికి ప్రాధాన్యత అధికమవుతోంది. 1989 నుండి ఎన్నో మధ్య మరియు తక్కువ ఆదాయ దేశాలు వివిధ సమీక్షలలో పాల్గొన్నాయి. లాటిన్ అమెరికా, ఉప-సహారా ఆఫ్రికా, పసిఫిక్ ద్వీపాలలో విద్యార్థులు నేర్చుకున్న అంశాలను సమీక్షించే ప్రాంతీయ ప్రక్రియలను ఇది ప్రోత్సహించింది.

వివిధ దేశాలలో విద్యార్థులు నేర్చుకున్న అంశాలపై ఇటీవల జరిపిన అధ్యయనాలు పేద, సాంస్కృతికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన పిల్లలు, ధనిక, సాంస్కృతికంగా జీవన స్రవంతిలో భాగమైన కుటుంబాలకు చెందిన పిల్లలకంటే తక్కువ ప్రతిభ కనబరుస్తున్నారన్న సత్యాన్ని ఇంకా తెలియవరుస్తూనే ఉన్నాయి. ఇంటివద్ద నాణ్యమైన విద్యా వాతావరణం (పుస్తకాలు, వార్తా పత్రికలు, ఇతర రాత సామాగ్రి లభ్యత) పిల్లల ప్రతిభను గణనీయంగా పెంచుతుంది. విద్యాప్రమాణాలను మెరుగుపరచడం వలన పేద, ప్రతికూల పరిస్థితుల నుండి వచ్చే పిల్లలకు ఎక్కువ ప్రయోజనం చేకూరుతుంది.

## విద్య మరియు జీవన నైపుణ్యాలు: మెరుగైన పర్యవేక్షణకు మార్గాలు

విద్య మరియు జీవన నైపుణ్యాల కార్యక్రమాల పరిధి కిందకు విస్తృత. విభిన్న శ్రేణి ప్రొవైడర్లు, కార్యకలాపాలు చేరడం వలన పర్యవేక్షణ కష్టంగా మారుతుంది. ముఖ్యంగా నియత విద్యా వ్యవస్థకు వెలుపల ఉన్న పిల్లలు, వయోజనులకు విద్యావకాశాలను కల్పించాలనేది ఇఎఫ్ఎ మూడవ లక్ష్యం. కొన్ని దేశాలు నియత విద్యావ్యవస్థకు వెలుపలగల విద్యా కార్యకలాపాలను గుర్తించే ప్రయత్నాలు చిత్తశుద్ధితో చేస్తున్నాయి. కానీ, విశ్వసనీయమైన డేటా లభించడం కష్టమే. యునెస్కో, సభ్యసంస్థలు రూపొందించిన అనియత విద్యా యాజమాన్య సమాచార వ్యవస్థల నమూనాను కాంబోడియా, భారత్, జోర్డన్, యునైటెడ్ రిపబ్లిక్ ఆఫ్ టాంజానియాతో పాటు అనేక దేశాలు ప్రయోగాత్మకంగా అమలుచేస్తున్నాయి.

## అక్షరాస్యత : లక్ష్యం ఇంకా గగనకుసుమమే

2006 నివేదికలో అక్షరాస్యతను విస్తృతంగా చర్చించాము. సంప్రదాయ పద్ధతులు ఒక వ్యక్తి అక్షరాస్యత నైపుణ్యాలను, ప్రావీణ్యాన్ని నేరుగా పరీక్షించలేవు. అవి సమన్య వాస్తవ స్థాయిని ప్రతిబింబించని ఒక చిత్రాన్ని అందిస్తాయి. ఈ సాంప్రదాయ పద్ధతుల ప్రకారం సుమారు 781 మిలియన్ల మంది వయోజనులకు కనీస అక్షరాస్యత నైపుణ్యాలు కొరవడినాయి. వారిలో మూడింట రెండొంతుల మంది మహిళలు ఉన్నారు. వీరిలో అత్యధికులు దక్షిణ, పశ్చిమ ఆసియా, ఉప-సహారా ఆఫ్రికా, తూర్పు ఆసియా, పసిఫిక్‌లలో నివసిస్తున్నారు. మొదటి రెండు ప్రాంతాలలో జనాభా పెరుగుదల వలన నిరక్షరాస్యుల సంఖ్యలోనూ పెరుగుదల ఉంది. వయోజన విద్యాకార్యక్రమాలను విస్తరించడం కొరకు అంతర్జాతీయ సముదాయం, జాతీయ విధాన రూపకర్తలు సమిష్టి కృషి జరపనట్లయితే ప్రపంచంలో నిరక్షరాస్యుల సంఖ్య 2015 నాటికి కేవలం 100 మిలియన్లు మాత్రమే తగ్గుతుంది.

**పట్టిక 1.1 2000–2004లో అంచనావేసిన వయోజన అక్షరాస్యత రేట్లు (వయసు 15+) జెండర్ పారిటీ ఇండెక్స్ (జిపిఐ) మరియు 2015 నాటికి అంచనాలు.**

| | 2000-2004 | | 2015 | |
|---|---|---|---|---|
| | అక్షరాస్యత రేట్లు (%) | జిపిఐ | అక్షరాస్యత రేట్లు (%) | జిపిఐ |
| | మొత్తం | స్త్రీ/పు | మొత్తం | స్త్రీ/పు |
| ప్రపంచం. | 82 | 0.89 | 87 | 0.92 |
| | | | | |
| ఉప-సహారా అమెరికా | 61 | 0.77 | 67 | 0.84 |
| అరబ్ దేశాలు | 66 | 0.72 | 79 | 0.82 |
| మధ్య ఆసియా | 99 | 0.99 | 100 | 1.00 |
| తూర్పు ఆసియా/పసిఫిక్ | 92 | 0.93 | 96 | 0.96 |
| తూర్పు ఆసియా | 92 | 0.93 | 96 | 0.96 |
| పసిఫిక్ | 93 | 0.98 | 93 | 0.99 |
| దక్షిణ, పశ్చిమాసియా | 59 | 0.66 | 68 | 0.74 |
| లాటిన్ అమెరికా/కరీబియన్ | 90 | 0.98 | 94 | 0.99 |
| కరీబియన్ | 70 | 1.00 | 97 | 1.01 |
| లాటిన్ అమెరికా | 90 | 0.98 | 94 | 0.99 |
| ఉ. అమెరికా/ప. ఐరోపా | 99 | 1.00 | 100 | 1.00 |
| మధ్య/తూర్పు ఐరోపా | 97 | 0.97 | 98 | 0.98 |

*ఆధారం:* పూర్తి ఇఎఫ్ఎ నివేదికలో అధ్యాయం2 చూడండి

అన్ని ప్రాంతాలలో అక్షరాస్యత రేట్లు మెరుగైనప్పటికీ దక్షిణ మరియు పశ్చిమ ఆసియా (59%), ఉప-సహారా ఆఫ్రికా (61%), అరబ్ దేశాలు (66%), కరీబియన్ (70%)లలో అక్షరాస్యత రేట్లు మిగతా ప్రాంతాల కన్నా తక్కువగా ఉన్నాయి. 60% కన్నా తక్కువ అక్షరాస్యత రేట్లు గల 22 దేశాలలో 2015 అక్షరాస్యత లక్ష్యం సాధించడం చాలా కష్టం. 10 మిలియన్ల మంది నిరక్షరాస్య వయోజనులున్న 10 దేశాలలో సగం దేశాలు మాత్రమే 1990 నుండి తమ నిరక్షరాస్యుల సంఖ్యను తగ్గించాయి. అక్షరాస్యతలో లైంగిక తారతమ్యం 1990 నుండి మారకుండా ఉంది. దక్షిణ మరియు పశ్చిమ ఆసియాలో ప్రతి 100 మంది అక్షరాస్య పురుషులకు 66 మంది అక్షరాస్యులైన స్త్రీలు ఉన్నారు. అరబ్ దేశాలలో ఈ సంఖ్య 72గా, ఉప-సహారా ఆఫ్రికాలో 77గా ఉంది. 1999 నుండి అన్ని ప్రాంతాలలో యువతఅక్షరాస్యత రేట్లు (వయసు 15 నుండి 24) పెరగడం వలన ఉపసహారా ఆఫ్రికాలో మినహా అంతటా నిరక్షరాస్యులైన యువత సంఖ్య తగ్గింది.

## విద్యాప్రణాళికలు: బలహీన వర్గాలను నేర్చుకోవడం

ప్రపంచ విద్యా వేదికపై రూపొందించబడిన ఇఎఫ్ఎ అన్నిటినీ కలుపుకునిపోయే దృక్పథాన్ని అవలంబిస్తుంది. దీని అనేక లక్ష్యాలలో బలహీన, అణగారిణ వర్గాలపట్ల ప్రత్యేక దృష్టిసారింపు స్పష్టంగా కనబడుతుంది. తక్కువ డిమాండ్, వెనులుబాటు లేని కార్యక్రమాలు, నాణ్యత లోపం వలన పలువురు మినహాయించబడే చక్రం ఏర్పడుతుంది. ఈ చక్రాన్ని ఛేదించడానికి నాణ్యతను, వెసులుబాటును, విద్య ఆవశ్యకతను గణనీయంగా మెరుగుపరచి, కుటుంబంపై పాఠశాల వ్యయాలను తగ్గించాలి.

**ధనిక కుటుంబాల పిల్లలకంటే పేద, సాంస్కృతికంగా మినహాయింప బడిన కుటుంబాల పిల్లలు తక్కువగా రాణిస్తారు.**

**విద్యపై ప్రభుత్వ వ్యయం 1999 నుండి విశ్వవ్యాప్తంగా పెరిగింది**

పాఠశాలకు వెళ్లని పిల్లలు అత్యధిక సంఖ్యలో కలిగిఉన్న ఇరవై దేశాలతోపాటు నలభైఐదు దేశాల జాతీయ ఇఎఫ్ఎ ప్రణాళికలను విశ్లేషించినట్లయితే అవి అన్నీ బలహీన వర్గాలకు ప్రాధాన్యాన్ని ఇస్తాయని కనబడుతుంది. అనేక దేశాలు ఆడపిల్లలు, మారుమూలల గ్రామీణ ప్రాంతాలలో నివసించే వారిని ప్రాధాన్యత పూర్వక లక్షిత వర్గాలుగా కలిగి ఉన్నాయి. దక్షిణ అమెరికా దేశాలు జాతి, భాషాపరంగా అల్పసంఖ్యాక వర్గాలను ప్రత్యేకంగా పేర్కొన్నాయి. మరోపక్క అనాథలు, హెచ్ఐవి పాజిటివ్, లైంగికంగా అత్యాచారాలకు గురైన పిల్లలను ప్రత్యేక దృష్టిసారించవలసిన జాబితాలో అరుదుగా చేర్చారు. ట్యూషన్ ఫీజులను రద్దుచేయడం, విద్యాసామాగ్రిని, యూనిఫారాలను అందించడం ద్వారా బడికెళ్లి చదువుకునేందుకు అయ్యే ఖర్చును తగ్గించడానికి 22 దేశాలు చర్యలను ప్రణాళికీకరించాయి. 18 దేశాలు మహిళా ఉపాధ్యాయులను పెంచడం, పాఠశాలలను బాలికలకు సన్నిహితంగా ఉండేలా చేయడం వంటి చర్యలను ప్రణాళికీకరించాయి. 15 దేశాలు పాఠశాలల సంఖ్యను పెంచడం, సంచార పాఠశాలలు, గ్రామీణ పాఠశాలలు లేదా ఇతర పాఠశాలల సంఖ్యను పెంచడానికి ప్రాధాన్యాన్ని ఇచ్చాయి. మినహాయించబడిన యువత కొరకు విద్యాకార్యక్రమాలు ఎక్కువగా అమలుచేయబడుతున్నాయి. (ఇరవై అయిదు దేశాలు): ఉదాహరణకు చిన్నతనంలో బడిమానేసిన వారికి మరో అవకాశాన్ని ఇవ్వడం కోసం సెనిగల్, గ్వాటమాలా వృత్తివిద్యతో కలగలిపిన అక్షరాస్యత కోర్సులను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఎనిమిది దేశాలు ముఖ్యంగా దక్షిణ అమెరికా దేశాలు పాఠ్యాంశాలలో స్థానిక భాషలను ప్రవేశపెట్టే ప్రతిపాదనలను యోచిస్తున్నాయి. తల్లిదండ్రులు, సముదాయం లక్ష్యంగా చేపట్టిన సమాచార ఉద్యమాలు ఎనిమిది దేశాల ప్రణాళికలలో భాగంగా ఉన్నాయి.

మినహాయింపుకు అనేక కారణాలను, విద్యకుగల అనేక అడ్డంకులను ప్రభుత్వాలు ఎంతవరకు పరిష్కరిస్తాయనేది ఇఎఫ్ఎను దేశాలు ఎంత వరకు సాధించగలుగుతాయనేది నిర్ణయిస్తుంది. పట్టిక 1.2 ఈ అడ్డంకులను పరిష్కరించడంకోసం గల కొన్ని సాధారణ విధానాలు, కార్యక్రమాలను తెలియజేస్తుంది.

### పట్టిక 1.2 కలుపుకుపోవడాన్ని ప్రోత్సహించే విధానాలు

| విధాన లక్ష్యం | కార్యక్రమం ఉదాహరణ |
|---|---|
| బడికి వెళ్లి చదువుకునేందుకు అయ్యే ఖర్చును తగ్గించడం: తొంభైకి పైగా దేశాలలో ప్రత్యక్ష విద్యా ఖర్చులు ప్రాథమిక పాఠశాల విద్యను పొందడానికి అడ్డంకిగా ఉన్నాయి. | బురుండీ 2005లో ప్రాథమిక 500,000లో ప్రాథమిక విద్యా రుసుమును రద్దు చేసింది. అదనంగా 5 లక్షల మంది పిల్లలు పాఠశాల మొదటి రోజున తమ పేరు నమోదు చేయించుకున్నారు. |
| అనాథలకు హెచ్ఐవి/ఎయిడ్స్ ప్రభావం వలన భాధితులైన పిల్లలకు, ప్రతికూల పరిస్థితులలో సహకారం. హెచ్ఐవి/ఎయిడ్స్ వ్యాప్తి, | అత్యధికంగా గల స్వాజిలాండ్‌లలో ప్రభుత్వం 2004లో 7.5 మిలియన్ అమెరికన్ డాలర్లను ప్రాథమిక, సెకండరీ విద్య పొందుతున్న అనాథలు, ఇతర అణగారిన వర్గాలకు చెందిన పిల్లలకోసం కేటాయించింది. దాఖలు నిలకడగా కొనసాగింది. డ్రాపవుట్లు తగ్గాయి. |
| నగదు ప్రోత్సాహకాల ద్వారా బాల కార్మికులకు డిమాండ్ తగ్గించడం. | బ్రెజిల్‌లో **బోల్సా ఫెమిలియా** (ఇది వరలో బోల్సా ఎస్కోలా) కార్యక్రమం పాఠశాల హాజరీ వంటి షరతుల ఆధారంగా పేద కుటుంబాలకు ఆదాయ సహాయాన్ని అందిస్తుంది. ఈ కార్యక్రమం 5 మిలియన్ల మంది పిల్లలకు ప్రయోజనం అందిస్తోంది. |
| వెసులుబాటుతో కూడిన విద్యా ఏర్పాట్ల ద్వారా బాలకార్మికుల అవసరాన్ని తగ్గించడం. | భారతదేశంలో బాలకార్మికుల సంఖ్య అత్యధికంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ **బాలజ్యోతి** కార్యక్రమం కింద మురికి వాడలలో 250 పాఠశాలలు (31,000 విద్యార్థులు) నడుపుతున్నారు. ఈ కార్యక్రమం ప్రభుత్వం-ఎన్జీఓ సహకారానికి చక్కటి ఉదాహరణ |
| సెకండరీ పాఠశాలలో బాలికల హాజరీని పెంచడం ద్వారా లైంగిక సమానత్వం ఉండేలా చూడడం. | గాంయాలో **గర్ల్స్, స్కాలర్‌షిప్ ట్రస్ట్ ఫండ్** తక్కువ నమోదు గల పాఠశాలలో 1/3 మంది బాలికలకు ట్యూషన్, పుస్తకాలు పరీక్ష ఫీజుల కొరకు పూర్తి స్కాలర్‌షిప్ ఇస్తుంది. విజ్ఞాన శాస్త్రం, గణితం, టెక్నాలజీలలో ప్రతిభ కనబరచిన 10% మంది బాలికలకు స్కాలర్‌షిప్‌లు ఇస్తుంది. 16000 మంది బాలికలు ఈ ప్రయోజనం పొందుతున్నారు. |
| నియత పాఠశాల విద్యపొందలేకపోయిన యువతకు, వయోజనులకు అనియత విద్యావకాశాలను అందించడం. | హోండూరాస్‌లో **ఎడ్యుకెటొడోస్** కార్యక్రమం తొమ్మిది సంవత్సరాల కనీస విద్య పూర్తిచేయని విద్యార్థులు, వయోజనులను పరిగణనలోకి తీసుకుంటుంది. ఐదు లక్షల మంది విద్యార్థులు ప్రాథమిక పాఠశాల కార్యక్రమంలో దాఖలయ్యారు. సులువుగా చేరుకోగల విద్యాకేంద్రాలు, పనికివచ్చే పాఠ్యాంశాలు, వెసులుబాటుతో కూడిన పాఠ్యప్రణాళికలు, పటిష్టమైన సమాజ సహకారం ఈ కార్యక్రమంలో ముఖ్యాంశాలు. |
| వికలాంగుల విద్యావసరాలను తీర్చడం కొరకు కలుపుకుపోయే విద్యను అందించడం. | ఉరుగ్వేలో వైకల్యంగల పిల్లలను రెగ్యులర్ పాఠశాలలో కలుపుకుపోయేలా చేయడం కొరకు ప్రత్యేక ఇన్‌క్లూజివ్ విద్యా నిధిని ఏర్పాటు చేశారు. దాదాపు 39,000 మంది పిల్లలు దీని వలన ప్రయోజనం పొందారు. |

## విద్యపై దేశీయ వ్యయం: సమస్య అతి తీవ్రంగా ఉన్న దేశాలలో సరిపోవడంలేదు.

విద్యపై ప్రభుత్వ వ్యయం 1999 నుండి ప్రపంచ వ్యాప్తంగా పెరిగింది. డేటా కలిగి ఉన్న 106 దేశాలలో 2/3 వంతు దేశాలు స్థూల దేశీయోత్పత్తి (జిఎన్‌పి)తో పోలిస్తే విద్యపై ప్రభుత్వ వ్యయం వాటాను 1999-2004ల మధ్య పెంచాయి. దాదాపు 20 దేశాలలో 30% లేదా అంతకు మించిన పెరుగుదల నమోదైంది. ప్రపంచవ్యాప్తంగా పరిశీలిస్తే ఈ పోకడలో ప్రాంతీయ తేడాలు కనబడతాయి. జిఎన్‌పిలో శాతంగా చూస్తే 41 దేశాలలో విద్యపై వ్యయం తగ్గిపోయింది. ముఖ్యంగా దక్షిణ అమెరికా, దక్షిణ, పశ్చిమ ఆసియా (ప్రపంచంలో బడికి వెళ్ళని పిల్లల సంఖ్య అత్యధికంగా ఉన్న మూడు ప్రాంతాలలో దక్షిణ, పశ్చిమ ఆసియా ఒకటి) ఈ వ్యయం తగ్గిపోయింది. ఇఎఫ్ఎ సవాళ్లు తీవ్రంగా ఉన్న దేశాలలో విద్యపై వ్యయం తగినంతగా లేదు. ఉదాహరణకు నైగర్, పాకిస్తాన్ జిఎన్‌పిలో 3% కన్నా తక్కువగా విద్యపై ఖర్చుపెడుతున్నాయి. (చిత్రం 1.6)


ఒక ప్రభుత్వం ఇతర బడ్జెట్ వ్యయంతో పోలిస్తే విద్యకు ఎంత వాటా కేటాయిస్తుందనే అంశం ఆధారంగా కూడా ఆ ప్రభుత్వానికి ఇఎఫ్ఎ పట్ల గల చిత్తశుద్ధిని నిర్ణయించవచ్చు. 36 దేశాలలో 1999, 2004 డేటా అందుబాటులో ఉంది. వాటిలో 3/4 దేశాలలో మొత్తం ప్రభుత్వ వ్యయంలో విద్యావ్యయం వాటా పెరగడం ఆనందకరమైన విషయం. యునైటెడ్ రిపబ్లిక్ ఆఫ్ టాంజానియా ఉదాహరణ ఆసక్తికరమైన విషయాన్ని తెలుపుతుంది: 2001లో ప్రభుత్వం పాఠశాల రుసుము రద్దుచేయడం వలన ప్రాథమిక పాఠశాలలోదాఖలాలు భారీగా పెరిగాయి. విద్యపై ప్రభుత్వ వ్యయం 2000లో స్థూలదేశీయోత్పత్తి (జిడిపి)లో 2.1% ఉండగా అది 2004లో 4.3%కి పెరిగింది.

2004లో డేటా అందుబాటులో ఉన్న వాటిలో అనేక దేశాలు తమ మొత్తం విద్యాబడ్జెట్టులో 50% కన్నా తక్కువ సొమ్మును ప్రాథమిక స్థాయిపై ఖర్చు పెట్టాయి. జిఎన్‌పి శాతాన్ని బట్టి చూస్తే డేటా అందుబాటులోగల తొంభై దేశాలలో 3/4 దేశాలు తమ జాతీయాదాయంలో 2% కన్నా తక్కువను ప్రాథమిక విద్యపై ఖర్చు పెడుతున్నాయి. దక్షిణ, పశ్చిమ ఆసియాలోని మూడు దేశాలు, ఉప-సహారా ఆఫ్రికాలోని 16 దేశాలకు ఇది వర్తిస్తుంది. ఈ ప్రాంతాలు యుపిఇ సాధనకు ఇంకా సుదూరంగానే ఉన్నాయి.

సెకండరీ విద్య విస్తరించే కొద్దీ దానికి, ప్రాథమిక విద్యకు మధ్య నిధుల పోటీ కోసం పెరగవచ్చు. అనేక వర్ధమాన దేశాలు ఈ విషయంలో సరైన సంతులనం సాధించడం కొరకు ప్రయత్నిస్తున్నాయి. సరిపోను సెకండరీ విద్యావకాశాలు లేనట్లయితే ఇఎఫ్ఎ, మిల్లెనియం డెవలప్‌మెంట్ గోల్స్ ఆఫ్ యూనివర్సల్ కంప్లీషన్ ఆఫ్ గుడ్ క్వాలిటీ ప్రైమరీ ఎడ్యుకేషన్ సాధించడం కష్టమే. తరువాత సెకండరీ పాఠశాలకు వెళ్లి చదువుకుంటారన్న ఆశతోనే పలువురు తల్లిదండ్రులు, తమ పిల్లలను ప్రాథమిక పాఠశాలకు పంపుతారు.

యుపిఇ సాధించిన, సాధించడానికి చేరువలోఉన్న దేశాలు సెకండరీ విద్యపై అధిక ఖర్చు చేయడంవైపు మొగ్గు చూపడం స్పష్టంగా కనబడుతుంది. అయితే ప్రాథమిక విద్యను ఇంకా సార్వత్రికం చేయని బంగ్లాదేశ్, నేపాల్ వంటి దేశాలలో కూడా ప్రాథమిక విద్యపై వ్యయం వాటా 1999 నుండి తగ్గిపోయింది. కొరియా రిపబ్లిక్ నిరవధిక విద్యా వ్యవస్థలోని ఇతర స్థాయిలలో పెట్టుబడులను తగ్గించకుండా సెకండరీ విద్యను విస్తరించింది.

**చిత్రం 1.6 2004లో విద్యపై జిఎన్‌పి లో 3% కన్నా తక్కువ ఖర్చు చేసిన దేశాలు**




*ఆధారం:* పూర్తి ఇఎఫ్ఎ నివేదికలో అధ్యయనం 3 చూడండి.

నిరంతరాయ నిరవధిక ప్రభుత్వ వ్యయం, ప్రాథమిక విద్య అనంతరం పేద పిల్లలకు సహాయంగా లాటరీలవంటి చొరవలు, రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్‌లో ప్రైవేటు రంగాన్ని పాల్గొనేలా చేయడం కొరియా విద్యారంగం సాధించిన విజయాలలో ప్రముఖంగా చెప్పుకోదగినవి. బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా దేశాలు సెకండరీ విద్యను పొందే అవకాశాలను మెరుగుపరచడం కొరకు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యాలను అభివృద్ధి చేశాయి. బంగ్లాదేశ్‌లో ప్రోత్సాహక విధానాలు బలహీన వర్గాల కుటుంబాలకు ఆహారం, స్టయిపెండ్లు, పేద కుటుంబాలకు చెందిన బాలికలకు స్కాలర్‌షిప్పులు అందిస్తున్నాయి.


**బహుముఖ వ్యూహాలతో ప్రతికూలతలను సమర్థంగా ఎదుర్కొంటున్నారు**

సమస్యను ఎదుర్కోవడానికి బహుముఖ వ్యూహాలు పాటించడం వలన ఫలితాలు ఉంటాయి: ఆర్థిక ప్రోత్సాహకాలు ఉదాహరణకు: విద్య నాణ్యతను మెరుగుపరిచే ప్రయత్నాలతోపాటు ఆర్థిక ప్రోత్సాహకాలను అందచేయడం. నిర్దిష్ట వర్గాలను లక్ష్యంగా సాధించడానికి ప్రభుత్వం చురుకైన పాత్ర పోషించాలి. స్థానిక సముదాయాలతో కూటమిలు, పౌర సమాజం సృజనాత్మక సామర్థ్యం కలిగి ఉండాలి. తగినంత బడ్జెటరీ సహాయం అవసరం. ఉదాహరణకు భారతదేశం మధ్యాహ్న భోజన పథకాలకు బాలికా విద్యకు ప్రత్యేకంగా బడ్జెటు కేటాయించి వాటిని మొత్తం ప్రాథమిక విద్య కేటాయింపుకు విడిగా పెట్టింది. బలహీన వర్గాల పిల్లలు, యువత, వయోజనుల అవసరాలను జాగ్రత్తగా అంచనావేసి తీర్చాలి. అనేక దేశాలలో ప్రాథమిక పాఠశాలలో దాఖలులు పెరుగుతోన్న నేపథ్యంలో సమానత్వం, సామర్థ్యం, ప్రభావాలపరంగా పర్యవేక్షించగల చక్కటి నాణ్యత గల కార్యక్రమాలను అమలుచేయవలసిన ఆవశ్యకత మునుపటి కన్నా అధికమైంది. లక్షిత చొరవలను విద్యావ్యవస్థలో సంస్థాగతమైన సంస్కరణలను కలిపి చేపట్టడంవల్ల విద్య లబ్ధి, నాణ్యత పెరిగి, పిల్లలు బాగా నేర్చుకునేలా చేసే కార్యక్రమాలే విజయవంతమైన కార్యక్రమాలు.

# భాగం - II ఇ.ఎఫ్.ఎ కు అంతర్జాతీయ సహకారం: వాగ్దానాలను నెరవేర్చడం

- ప్రాథమిక విద్యకు విదేశీ సహాయం పెరుగుతోంది కానీ అది అవసరాలకు తగినంతగా లేదు.
- విద్యారంగానికి ఇచ్చే ద్వైపాక్షిక సహాయంలో ఐదుగురు దాతలే సింహ భాగాన్ని సమకూరుస్తున్నారు.
- దాతల ఉనికి అన్ని దేశాలలో ఒకే విధంగా లేదు.
- పంపిణీలో ప్రాంతీయ అసమానతలు ఉన్నాయి.
- విదేశీ సహాయ లోటు అంచనాలు పెరుగుతున్నాయి.
- ఫాస్ట్ ట్రాక్ ఇనిష్యేటివ్ వేగం పుంజుకుంది. కానీ అది ఇంకా గ్లోబల్ కాంపాక్ట్ కాలేదు.

'అందరికీ విద్యకు చిత్తశుద్ధితో కట్టుబడిన దేశాలేవీ ఆ ఆశయాన్ని సాధించేందుకు నిధుల కొరతను ఎదుర్కోవు' అని డకార్ ఫ్రేమ్ వర్క్ ఫర్ యాక్షన్ పేర్కొంది. 2000 నుండి ప్రాథమిక విద్యకు విదేశీ సహాయం పెరుగుతోంది, అదనపు మద్దతును కూడా హామీ ఇస్తున్నారు. కానీ సార్వత్రిక ప్రాథమిక విద్యను సాధించి బాల్యం ప్రారంభంలో సేవలను వయోజన అక్షరాస్యత కార్యక్రమాలను చేపట్టడానికి యేటా అవసరమైన 11 మిలియన్ల అమెరికన్ డాలర్ల కంటే ఇది చాలా తక్కువగా ఉంది.


© Francis Fanelli

వియత్నాంలోని హానాం రాష్ట్రంలోని ఒక పల్లెటూరి బడిలో పిల్లలు

## విద్యకు విదేశీ సహాయం: సరైన దిశలో సాగడం

*సంపూర్ణ సహాయం:* అధికారిక అభివృద్ధి సహాయం (ఒడిఏ) వాస్తవ స్థాయి 1990 మొదటి అర్థభాగంలో తగ్గిపోయినప్పటికీ 1995 నుండి 2000 మధ్య కాలంలో ఒడిఏ నిలకడ సాధించి, అప్పటినుండి విస్తరించాయి. మొత్తం సహాయాల సరఫరా 2000-2004[6] మధ్య కాలంలో యుఎస్ $57 బిలియన్ల నుండి యుఎస్ $72 బిలియన్లకు పెరిగింది. ద్వైపాక్షిక దాతలే ఈ మొత్తంలో 3/4 వంతు సహాయంగా అందజేశారు. తక్కువ ఆదాయంగలవిగా గుర్తించబడిన 72 దేశాలకు అందే సహాయం వాటా సుమారు 46% వద్ద స్థిరంగా ఉంటుంది. అయితే వాటిలో అతి పేద దేశాలుగా గుర్తింపబడిన 51 దేశాలకు ఇచ్చే సహాయం వాటా 26% నుంచి 32% నికి పెంచబడింది. రెండు సంవత్సరాలలో ఉప-సహారా ఆఫ్రికాకు మొత్తం సహాయంలో 1/3 వంతు లభించింది. ఇరాక్, దక్షిణ, పశ్చిమాసియాలు సహాయంలో భారీ పెంపుదల వలన లాభం పొందాయి. మొత్తం సహాయంలో రుణ సహాయం సుమారు 10% పెరిగింది. ఈ వాటా ఇంకా పెరుగుతూనే ఉంది. ఇది ఉప-సహారా ఆఫ్రికాలో ఉన్న అనేక అతిపేద దేశాలకు ఎంతో కీలకమైనది.

*విద్యకు విదేశీ సహాయం:* అన్ని వర్ధమాన దేశాలలోనూ విద్యకు అందే మొత్తం ప్రత్యక్ష సహాయం 85% పెరిగింది. 2000లో యు.ఎస్ $4.6 బిలియన్లుగా ఉన్న సహాయం 2004లో యు.ఎస్ $8.5 బిలియన్లకు చేరింది. తక్కువ ఆదాయ దేశాలలో సైతం అధిక పెరుగుదల జరిగింది. ఈ దేశాలలో రెట్టింపుకు పైగా అంటే యు.ఎస్. $2.5 బిలియన్ల నుండి యు.ఎస్. $5.5 బిలియన్లకు పెరిగి అది ప్రస్తుతం విద్యకు అందే విదేశీ సహాయంలో 2/3 వంతుగా ఉంది. (పట్టిక 2.1) నిర్దిష్ట రంగాలకు కేటాయించే పూర్తి విదేశీ సహాయ మొత్తంలో విద్యకు సహాయంగా లభించే వాటా 2000లో ఉన్న 10.6% నుండి 2004లో 13.6% నికి పెరిగింది.

*కనీస విద్యకు విదేశీ సహాయం:* మొత్తం విద్యకు పెరిగిన విదేశీ సహాయం వలన కనీస విద్య లాభపడింది. అన్ని వర్ధమాన దేశాలలో పరిశీలిస్తే కనీస విద్యకు విదేశీ సహాయం (స్థాయిని స్పష్టం చేయని విద్యకు విదేశీ సహాయంలో కొంత భాగంతో సహా) 2000లో ఉన్న యు.ఎస్. $2.1 బిలియన్ల నుండి 2004లో యు.ఎస్. $3.9 బిలియన్లకు పెరిగిందని అంచనాలు సూచిస్తున్నాయి. తక్కువ ఆదాయంగల దేశాలలో కనీస విద్యకు విదేశీ సహాయం యు.ఎస్. $1.4 బిలియన్ల నుండి యు.ఎస్. $3.0 బిలియన్లకు చేరింది. ఈ రెండు రకాల దేశాలలోనూ విద్యకు అందే విదేశీ సహాయం మొత్తంలో కనీస విద్య వాటా స్థిరంగా అంటే అన్ని వర్ధమాన దేశాలలో సగానికన్నా తక్కువగానూ, తక్కువ ఆదాయం గల దేశాలలో సగానికన్నా కొద్దిగా ఎక్కువగానూ ఉంది.

ఈ చిత్రాన్ని పూర్తిచేయాలంటే బడ్జెటరీ సహాయాన్ని కూడా విదేశీ సహాయం సమీకరణంలో చేర్చాలి. అటువంటి విదేశీ సహాయాన్ని ఒక నిర్దిష్ట ప్రాజెక్టు, కార్యక్రమం లేదా రంగానికి ప్రయోజనం కోసం కేటాయించడం కన్నా దానిని నేరుగా భాగస్వామ్య ప్రభుత్వపు జాతీయ ఖజానాకు మళ్ళిస్తున్నారు. 2004లో అన్ని వర్ధమాన దేశాలకు యు.ఎస్. $4.7 బిలియన్ల ప్రత్యక్ష బడ్జెటరీ సహాయం అందింది. ఈ సహాయంలో 20 శాతం విద్యకు అందిందని, అందులో సగం సహాయం కనీస విద్యకు లభించిందని అంచనా.

ఈ వనరులను అన్నింటినీ కలిపితే అన్ని వర్ధమాన దేశాలలో విద్యకు సహాయం 2004లో ఉన్న యు.ఎస్. $5.6 బిలియన్ల నుండి 2004లో యు.ఎస్. $9.5 బిలియన్లకు పెరిగిందని అంచనా. తక్కువ ఆదాయ దేశాలలో ఈ మొత్తం యు.ఎస్. $3.4 బిలియన్ల నుండి యు.ఎస్. $6.4 బిలియన్లకు పెరిగింది. 2004లో మొత్తం విదేశీ సహాయంలో కనీస విద్యకు అందిన సహాయం అన్ని వర్ధమాన దేశాలలో యు.ఎస్. $4.4 బిలియన్లుగాను, తక్కువ ఆదాయ దేశాలలో యు.ఎస్. $3.4 బిలియన్లుగానూ ఉంది.

ఇఎఫ్ఎ ఎజెండాపై దాత, గ్రహీత దేశాలు రెండూ అధిక దృష్టిసారిస్తున్నాయని ఈ పెరుగుదల పోకడలు తెలుపుతున్నాయి. విధానాలు కార్యక్రమాల గురించి దాతలతో చర్చించడం కోసం ఆధారంగా ఉండేందుకు పేదరికం తగ్గింపు వ్యూహ పత్రాలను (పిఆర్ఎస్పి)లను రూపొందించవలసిందిగా బహుపాక్షిక దాతలు 1990ల ఆఖరి నుండి ప్రభుత్వాలను ప్రోత్సాహించాయి. ఈ ప్రక్రియ ద్వారా కనీస విద్యకు అధిక ప్రాధాన్యత లభించింది. ఇలా ఉండగా, ద్వైపాక్షిక, ఇతర దాతలు ఇప్పుడు మిల్లెనియం అభివృద్ధి ఆశయాలపై దృష్టిసారించడం వలన ప్రాథమిక విద్యపై ఖర్చు పెంచాలన్న పిలుపు బలపడుతోంది.

ఈ పోకడలు ప్రోత్సాహకరంగా ఉన్నప్పటికీ, అన్ని వర్ధమాన దేశాలకు అందే మొత్తం విదేశీ సహాయంలో కనీస విద్య వాటా ఇంకా 4.8% గానే ఉంది. అంతేకాక, మధ్య-ఆదాయ వర్ధమాన దేశాలకు ఈ వాటాలో 1/5 వంతు సహాయం లభిస్తుంది. విద్యకు అందే ద్వైపాక్షిక సహాయంలో దాదాపు 50% తృతీయ స్థాయి విద్యకి కేటాయించబడుతోంది. దీనిలో అధిక సొమ్మును దాత దేశాలలోని సంస్థలకు స్కాలర్‌షిప్పులుగా ఇస్తున్నారు.

### *విద్యకు ద్వైపాక్షిక సహాయంలో సింహ భాగాన్ని ఐదు దాతదేశాలే సమకూరుస్తున్నాయి.*

దాత దేశాలన్నీ విద్యకు ఒకే విధమైన సహాయాన్ని అందించడంలేదు. 2004లో విద్యకు అందిన ద్వైపాక్షిక సహాయంలో 72% ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, యునైటెడ్‌కింగ్‌డం అమెరికాలు కలిసి సమకూర్చాయి. కనీస విద్యకు అందే సహాయంలో దాదాపు 2/3 వంతును నెదర్లాండ్స్, యునైటెడ్ కింగ్‌డమ్, అమెరికాలు అందించాయి. కనీస విద్యకు సహాయం గణనీయంగా పెరగాలంటే మరింత మంది దాతలు మరింతగా పాల్గొనాలి లేదా ప్రధాన దాతదేశాలు తమ విరాళాలను మరింత పెంచాలి లేదా రెండూ జరగాలి.

విద్యకు విదేశీ సహాయంలో అధిక సొమ్మును అతిపేద దేశాలకు కేటాయించాలని పదేపదే పేర్కొంటున్నప్పటికీ, ఒఈసిడి యొక్క డెవలప్‌మెంట్ అసిస్టెన్స్ కమిటీ (డిఎసి)కి చెందిన దాతలలో సగం సంస్థలు తాము విద్యకు అందించే విదేశీ సహాయంలో సగానికి పైగా సహాయాన్ని మధ్య ఆదాయ దేశాలకే అందిస్తున్నాయి.

బహుపాక్షిక దాతలు 2003-2004లో తాము అందించిన మొత్తం సహాయంలో 11.8% విద్యకు సహాయంగా కేటాయించారు. ఇందులో 52% కనీస విద్యకు కేటాయించబడింది. ప్రపంచబ్యాంకు యొక్క అంతర్జాతీయ అభివృద్ధి అసోసియేషన్ (ఐడిఎ) తరువాత యూరోపియన్ కమిషన్ అతి పెద్ద బహుపాక్షిక దాత, 2005 ప్రొవిజనల్ డేటా ప్రకారం విద్యకు పంపిణీలలో సగభాగం కనీస విద్యకు కేటాయించబడింది. ఉప-సహారా ఆఫ్రికా (30%) దక్షిణ, మధ్య ఆసియా (19%)లకు అధిక కేటాయింపులు జరుగుతాయని హామీ ఇవ్వబడింది.

**ఈ పోకడలు ప్రోత్సాహకరంగా ఉన్నప్పటికీ, అన్ని వర్ధమాన దేశాలకు అందే మొత్తం విదేశీ సహాయంలో కనీస విద్య వాటా ఇంకా 4.8% గానే ఉంది.**

6. విదేశీ సహాయం డేటా మొత్తం 2003 ధరల ప్రకారం.

**పట్టిక 2.1 2000, 2004లో ఆదాయ వర్గాన్ని బట్టి విద్య, కనీస విద్యకు మొత్తం ఒడిఎ అంచనాలు (2003 ధరలలో యు.ఎస్. $ బిలియన్లు)**

| విద్యారంగం | | | కనీస విద్య | | |
|---|---|---|---|---|---|
| | వర్ధమాన దేశాలు | తక్కువ ఆదాయ దేశాలు | | వర్ధమాన దేశాలు | తక్కువ ఆదాయ దేశాలు |
| 2000 | | | 2000 | | |
| ప్రత్యక్ష | 4.60 | 2.48 | ప్రత్యక్ష | 1.40 | 0.98 |
| | | | ''పేర్కొనని స్థాయి''నుండి | 0.68 | 0.38 |
| బడ్జెటరీ సహాయం నుండి | 1.00 | 0.93 | బడ్జెటరీ సహాయంనుండి | 0.50 | 0.47 |
| మొత్తం | 5.60 | 3.41 | మొత్తం | 2.59 | 1.83 |
| | | | | | |
| 2004 | | | 2004 | | |
| ప్రత్యక్ష | 8.55 | 5.53 | ప్రత్యక్ష | 3.32 | 2.70 |
| | | | ''పేర్కొనని స్థాయి''నుండి | 0.56 | 0.29 |
| బడ్జెటరీ సహాయం నుండి | 0.94 | 0.85 | బడ్జెటరీ సహాయంనుండి | 0.47 | 0.43 |
| మొత్తం | 9.49 | 6.83 | మొత్తం | 4.35 | 3.42 |
| 2000 నుండి మార్పు | 69.3% | 87.2% | 2000 నుండి మార్పు | 68.1% | 86.6% |

ఆధారం : పూర్తి ఇఎఫ్ఎ నివేదికలోని అధ్యాయం 4 చూడండి.

## విదేశీ సహాయం: ఎవరు లబ్ధి పొందుతున్నారు ?

సహాయాన్ని పొందే దేశాలవైపు దృష్టి మళ్లించడం వలన విదేశీ సహాయపు వర్ణచిత్రం స్పష్టమైన రూపుదాలుస్తుంది. దాతలు తమ వనరులను అసమానంగా పంపిణీ చేస్తాయి. విద్యకు అత్యధిక సహాయం పొందే 20 దేశాలలో కేవలం ఏడు మాత్రమే తక్కువ ఆదాయం గల దేశాలు. అతి పేద దేశాలకు విద్యకు సహాయం అందించే విషయంపై పెద్దగా దృష్టిసారించినట్లుగా కనబడం లేదు.

ప్రపంచంలోని 72 అతి పేద దేశాలలో దాతల ఉనికిలో అసమానతలు ఉన్నాయి. ఇథియోపియా, మాలీ, మొజాంబిక్, యునైటెడ్ రిపబ్లిక్ ఆఫ్ టాంజానియాలలో ఒక్కొక్క దానిలో విద్యారంగంలో పది నుండి పన్నెండు దాతలు ఉన్నారు. మరోవక్క ముప్పై ఆరు దేశాలలో గరిష్టంగా ఇద్దరు దాతలు ఉన్నారు. ఏ దేశాలకు సహాయం అందించవలసిన అవసరం అధికంగా ఉందనే దాని ఆధారంగా దాతలు అందించే సహాయాన్ని పొందడానికి సంబంధించి ఇది ముఖ్యమైన ప్రశ్నలు  లేవనెత్తుతోంది.

మొత్తం విదేశీ సహాయం కేటాయింపులో విద్యకు ఇచ్చే ప్రాధాన్యత అన్ని ప్రాంతాలలో ఒకే విధంగా లేదు. దక్షిణ, పశ్చిమ  ఆసియా, అరబ్ దేశాలు ఇతర ప్రాంతాలలోని దేశాలకన్నా విద్యారంగానికి అధిక వాటా పొందుతున్నాయి. (మొత్తం విదేశీ సహాయంలో 20% పైగా) ఉప-సహారా ఆఫ్రికాలోని 23 దేశాలలో మొత్తం విదేశీ సహాయంలో కేవలం 11% మాత్రమే విద్యకు సహాయంగా అందుతోంది. దక్షిణ, పశ్చిమ ఆసియాలోని దేశాలు విద్యకు అందే సహాయంలో 50% కనీస స్థాయికి అందిస్తుండగా, ఉప-సహారా ఆఫ్రికా, దక్షిణ అమెరికాలలో కేవలం 20% మాత్రమే కనీస స్థాయికి లభిస్తోంది. అరబ్ దేశాలు, తూర్పు ఆసియా, పసిఫిక్ ప్రాంతాలలో ఈ వాటా ఇంకా తక్కువగా ఉంది.

2005లో 100పైగా దాతలు, వర్ధమానదేశాలు సంతకాలు చేసిన డిక్లరేషన్ ఆన్ ఎయిడ్ ఎఫెక్టివ్‌నెస్ స్ఫూర్తిగా దేశాలు విద్యకు విదేశీ సహాయం ప్రభావాన్ని పెంపొందించే ప్రయత్నాలు చేస్తున్నాయి.

ప్రకటనకు అనుగుణంగా విద్యారంగానికి సహాయపడేందుకు ఉన్న ప్రధాన వాహనంగా ఫాస్ట్‌ట్రాక్ ఇనిషేటివ్ (ఎఫ్‌టిఐ) చూడబడుతోంది. అంతేకాక ప్రస్తుతం 20కి పైగా దేశాలు చేపడుతున్న పర్యవేక్షణ, సమీక్షా ప్రక్రియలో ప్రభుత్వ ప్రతినిధులతో పాటు క్షేత్రస్థాయిలో పనిచేసే అన్ని సంస్థలను సాధారణంగా పాల్గొనేలా చేస్తున్నారు. ముందుగా అంగీకరించిన ఆశయాలు ఉదాహరణకు విద్య లభ్యత, సమానత్వం, ప్రాథమిక విద్య నాణ్యతతో పోలుస్తూ విద్యారంగ పనితీరును అంచనావేయడం దీని ఆశయం.

## విద్యకు విదేశీ సహాయాన్ని పెంచడం

రానున్న సంవత్సరాలలో తమ సహాయ సరఫరాను గణనీయంగా పెంచడానికి అనేక అభివృద్ధిచెందిన దేశాల ప్రభుత్వాలు వాగ్దానం చేశాయి. 2005లో జరిగిన అనేక ప్రముఖ సమావేశాలు ఆశలను పెంచాయి. దాతలు తమ స్థూల జాతీయ ఆదాయంలో వాటాగా సహాయాన్ని పెంచడానికి, 2010 నాటికి యు.ఎస్ $50 బిలియన్ల మేర లేదా 60% సహాయం అందించడానికి వాగ్దానం చేశాయి. ఆఫ్రికా దేశాలకు మొత్తం సహాయాన్ని రెట్టింపు చేస్తామని కూడా దాతలు ప్రతిజ్ఞ చేశారు. అతి పేదదేశాలు అంతర్జాతీయ ద్రవ్య నిధి, ఐడిఎ, ఆఫ్రికా అభివృద్ధి నిధికి బకాయి పడిన రుణాలను చెల్లిస్తామని దాతలు పేర్కొన్నారు. రుణ విముక్తి వలన అధిక వనరులు సమకూరి 46 అతి పేద దేశాలు ప్రయోజనం పొందగలవు.

ఇటీవల, మార్చి 2006లో యునైటెడ్ కింగ్‌డమ్ ప్రభుత్వం ఇఎఫ్ఏ లక్ష్యాలను సాధించడంలో గల ఆర్థిక ఖాళీని పూరించేందుకు విద్య కొరకు రానున్న పదేళ్లలో 15 బిలియన్ల అమెరికన్ డాలర్ల సహాయాన్ని అందిస్తానని హామీ ఇచ్చింది. ఇతర దేశాలు కూడా తనను అనుకరించాలని కూడా ఆ దేశం విజ్ఞప్తి చేసింది. జూలై 2006లో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరిపిన సమావేశంలో జి 8 దేశాలు ప్రాథమిక విద్య సార్వత్రీకరణకోసం నిధులు అందజేస్తామని పునరుద్ఘాటించాయి. 2005లో ఆమోదించినట్లుగానే అవి ఎఫ్‌టిఐని మరోమారు సమర్థించాయి. (బాక్స్ 2.1)

2000-2003 మధ్య కాలంలో తాము పంపిణీచేసే దానికన్నా 50% అధికంగా అందిస్తామని రుణదాతలు హామీ ఇచ్చారు. దీర్ఘకాలిక, ఊహించదగిన ఆర్థిక సహాయాన్ని అందిస్తామన్న హామీలను ఇవ్వడానికి దాతలు అధిక ప్రయత్నాలు చేయాలి. సార్వత్రిక కనీస విద్యను సాధించే ఉద్దేశంతో దేశాలు కఠినమైన, తరచుగా ఖరీదైన విధాన నిర్ణయాలను తీసుకోవడం కొరకు ఈ రకమైన హామీలు వాటికి అవసరం.

దేశాలు తమ కందిన సహాయాన్ని సమర్థంగా ఉపయోగిస్తున్నాయన్న రుజువులు దాతలకు కనబడినప్పుడే వారు తాము చేసిన సహాయ వాగ్దానాలను ఎక్కువగా పాటించగలుగుతారు. ముఖ్యంగా కనీస విద్యారంగంలో వర్ధమాన దేశాలకు పంపిణీరేట్లు చాలా తక్కువగా ఉన్నాయి. విధానాలను రూపొందించి, అమలు చేయడంలో ప్రభుత్వ సామర్థ్యం పటిష్టంకావాలి. అదే సమయంలో కనీస విద్యలో సాంకేతిక సహకారానికి కేటాయించిన వాటా తగ్గిపోతోంది. ప్రత్యక్ష బడ్జెటరీ సహాయం దిశగా సాగుతోన్న పోకడను ఇది కొంతవరకు ప్రతిబింబించవచ్చు. సాంకేతిక సహాయం, కెపాసిటీ బిల్డింగ్‌లకు ప్రాధాన్యాన్ని తగ్గించాలని ఈ పోకడ పేర్కొంటోంది.

ఇఎఫ్ఎ లక్ష్యాలను సాధించడం కొరకు కావలసిన అదనపు సహాయం మొత్తాన్ని గత కొన్నేళ్లగా పలుమార్లు అంచనావేసి లెక్కించారు.

- తక్కువ ఆదాయ దేశాలన్నింటిలో 2001 నుండి 2015 నాటికి యుపిఇని సాధించడం కొరకు యేటా 9.7 బిలియన్ల అమెరికన్ డాలర్లు అవసరమని దానిలో 3.7 బిలియన్ల అమెరికన్ డాలర్లను వెలుపలి నుండి అందించాలని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది.

- 2002 ఇఎఫ్ఏ గ్లోబల్ మానిటరింగ్ రిపోర్ట్ ప్రపంచ బ్యాంకు అంచనా వేసిన దానికన్నా 3.1 బిలియన్ల అమెరికన్ డాలర్లు ఎక్కువ వాస్తవ వెలుపలి సహాయం అవసరమని సూచించింది. ప్రపంచ బ్యాంకు అంచనా వేసిన దేశీయ ఖర్చులో వార్షిక పెరుగుదల రేటు అత్యాశతో ఊహించినదని, కుటుంబాలపై విద్య ఖర్చును తగ్గించడం, హెచ్ఐవి/ ఎయిడ్స్‌ల ప్రభావం ఎదుర్కోవడం అంతర్యుద్ధాలు, అస్థిరత, ప్రకృతి వైపరీత్యాలు వంటివి ఎదుర్కొనే దేశాలలో పునరావాస వ్యవస్థల కొరకు అధిక వనరులు అవసరమవుతాయని ఇఎఫ్ఎ జిఎంఆర్ వాదించింది.

- తక్కువ ఆదాయ దేశాలలో కనీస విద్యకు సహాయ మొత్తం ఇంతవరకు అవసరమైన దానికన్నా చాలా తక్కువగా ఉంది. ఫలితంగా 2005 నుంచి 2015 వరకు ప్రతి సంవత్సరం 9 బిలియన్ల అమెరికన్ డాలర్లు అవసరం అవుతాయి. ఈ అంచనా కేవలం యుపిఇని సాధించడానికే. అక్షరాస్యత, బాల్యం ఆరంభంలో లక్ష్యాలను సాధించడం కోసం ఒకొక్క దేశానికి 1 బిలియన్ అమెరికన్ డాలర్లు కేటాయించడం ద్వారా బాహ్య సహాయ అవసరాలు యేటా 11 బిలియన్లు పెరుగుతాయి (2003 ధరల ప్రకారం)

దాతలు తమ వాగ్దానాలను నిలబెట్టుకుని 2010 నాటికి ఇచ్చే పూర్తి సహాయం మొత్తం 2004 నాడు లభించిన మొత్తాన్ని 60% పెంచితే, కనీస విద్యవాటా స్థిరంగా కొనసాగితే యేటా జరిగే మొత్తం కేటాయింపు 5.4 బిలియన్ల అమెరికన్ డాలర్లకు చేరుతుంది. ఇది అవసరమైన 11 బిలియన్ అమెరికన్ డాలర్లలో సగం కన్నా తక్కువ. ఇఎఫ్ఏ లక్ష్యాల దిశగా ప్రగతిని వేగిరపరచడంకోసం మొత్తం ఒడిఏలో కనీస విద్యవాటాను రెట్టింపు చేయాలి.

ఉన్నత స్థాయి విద్యల మధ్య సహాయం కొరకు పోటీ పెరిగే సూచనలు ఉన్నాయి. సెకండరీ, తృతీయ శ్రేణి విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల వంటి ఇతర రంగాలకు సహాయం కొరకు పోటీ పెరగవచ్చు. దాతలు కూడా తాము సహాయ కార్యక్రమాలు నిర్వహించే దేశాల సంఖ్యను తగ్గించుకునే ధోరణిలో ఉన్నాయి. అందువలన గ్లోబల్ ఫోకస్‌తో అంటే అవసరం అత్యధికంగా ఉన్న దేశాలకు సహాయాన్ని మళ్లించేటటువంటి మెరుగువరచిన ఎఫ్ఐటి ఉత్ప్రేరక నిధి వంటి యంత్రాంగాలను అభివృద్ధి చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రస్తుతం విద్యకు వాగ్దానాలు అవసరం. ఎందుకంటే, 2015 నాటికి యుపిఇ సాధించాలంటే ఆ సంవత్సరం ప్రాథమిక విద్య పూర్తి చేయవలసిన పిల్లలందరూ 2009 నాటికి బడిలో ఉండాలి. ఇటీవల యునైటెడ్ కింగ్‌డమ్ చేసిన ప్రతిజ్ఞ ప్రోత్సాహకరంగా ఉంది. కనీస విద్యకు సహాయాన్ని పెంచడం కోసం దాతలను ప్రోత్సహించేందుకు సాహసోపేతమైన నచ్చచెప్పే ప్రయత్నాలు జరగాలి. దాతలతో చర్చలు జరిపేటప్పుడు విద్యకు అధిక ప్రాధాన్యాన్ని ఇవ్వాలని, రుణ విముక్తి వలన లభించే ఆదాయంలో అధిక వాటాను విద్యకు కేటాయించాలని తక్కువ ఆదాయంగల దేశాల ప్రభుత్వాలకు నచ్చచెప్పాలి.

## బాక్స్ 2.1 ఫాస్ట్ ట్రాక్ ఇనిష్యేటివ్ : గ్లోబల్ కాంపాక్ట్‌ను ప్రోత్సహించడం

ఎఫ్‌టిఐ 2002లో ఏర్పాటుచేయబడింది. విశ్వసనీయమైన విద్యారంగ ప్రణాళికలు రూపొందించడం, సార్వత్రిక ప్రాథమిక విద్యను సాధించడం, విదేశీ ఆర్థిక సహాయాన్ని పెంచడం కొరకు ఒక గ్లోబల్ కాంపాక్ట్‌ను ప్రోత్సహించే ఉద్దేశంతో ఎఫ్‌టిఐని నెలకొల్పారు. 30 పైగా దాతలు పాల్గొనడంతో ఎఫ్ఐటి దాతృత్వ సంస్థల ప్రధాన సమన్వయ యంత్రాంగంగా మారింది. దానితోపాటు ఎఫ్‌టిఐ రెండు నిధుల ద్వారా కొన్ని ఆర్థిక వనరులు మళ్లించబడుతున్నాయి. ఉత్ప్రేరక నిధి తక్కువ మంది దాతలు గల దేశాలలో విద్యారంగ ప్రణాళికలకు మూడేళ్లవరకు సహాయం అందిస్తుంది. ఈ ప్రణాళికల చక్కటి పనితీరు మరికొంత మంది దాతలను ఆకర్షిస్తుందని ఈ నిధి ఆశిస్తుంది. అయితే ఇలా ఇంతవరకు జరుగలేదు. అందువలన నిధినందించే సమయాన్ని పొడిగించే విషయాన్ని పరిశీలిస్తున్నారు. విద్యాకార్యక్రమ అభివృద్ధి నిధి దేశాలకు తమ ప్రణాళిక రూపకల్పనలో వివిధ పద్ధతులలో సహాయపడడం కొరకు సాంకేతిక సహాయానికి పెట్టుబడి పెడ్తుంది.

2006 నివేదిక ప్రచురించినప్పటి నుంచి ఏడాది కాలంలో ఎఫ్‌టిఐ విద్యారంగ ప్రణాళికల అభివృద్ధి కొరకు 74 దేశాలకు సాంకేతిక సహాయం అందించింది. దాతలు 20 దేశాల ప్రణాళికలను ఆమోదించారు. మరో 12 దేశాల ప్రణాళికలు కూడా 2006 ఆఖరి వరకు ఆమోదం పొందనున్నాయి.

ఉత్ప్రేరక నిధి మొత్తాలు ఇంతకాలంగా స్వల్పంగా ఉన్నాయి. కొన్ని దేశాలు మాత్రమే దీనివలన ప్రయోజనం పొందాయి. ఆగస్ట్ 2006 నాటికి ఈ నిధిలోకి చేరిన మొత్తం దాతల చెల్లింపులు దాదాపు 230 బిలియన్ అమెరికన్ డాలర్లు. 2007 ఆఖరి వరకు మరో 450 బిలియన్ల అమెరికన్ డాలర్ల సహాయం హామీ ఇవ్వబడింది. నెదర్లాండ్స్, యూరోపియన్ కమిషన్, యునైటెడ్ కింగ్‌డమ్ ఈ వాగ్దానాలలో 85% చెల్లించవలసి ఉంటుంది. ఇప్పటి వరకు 11 దేశాలకు 96 బిలియన్ల అమెరికన్ డాలర్లను మాత్రమే పంపిణీ చేయడం జరిగింది. విద్యా కార్యక్రమ అభివృద్ధి నిధికి దాతల సంఖ్య గత ఏడాదిలో ఉన్న రెండు నుండి ఎనిమిదికి పెరిగింది. సహాయ వాగ్దానాలు 2005-2007లో 46 బిలియన్ల అమెరికన్ డాలర్లకు చేరాయి. దానిలో దాదాపు సగం ఇస్తానని నార్వే హామీ ఇచ్చింది.

చివరగా, గ్లోబల్ కాంపాక్ట్ వాస్తవరూపం దాల్చాలంటే దాతల మధ్య ఉన్నతస్థాయి నాయకత్వం అధికం కావాలి. ఎఫ్‌టిఐని మరింత పటిష్టపరిచే చర్యలతోపాటు సహాయాన్ని అధికంగా అవసరం ఉన్న దేశాలకు అందించడంతోపాటు సహాయం ఆశించిన రీతిలో ఉండేలా చేయడం కూడా ముఖ్యం.

**యేటా 11 బిలియన్ అమెరికన్ డాలర్ల విదేశీ నిధులు అవసరం.**

# భాగం - III
# బాల్యం ఆరంభంలో సంరక్షణ మరియు విద్య ఆవశ్యకత

పిల్లల హక్కులను గౌరవించడం.
పౌష్టికాహారం, ఆరోగ్యం, విద్య మధ్య సంబంధాలు
ప్రాథమిక పాఠశాలకు పిల్లలను సిద్ధం చేయడం.
ఆర్థిక ప్రయోజనాలు
ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవడం

**బాల్యం ప్రారంభదశలో మానవులు తమ మనుగడ, భావోద్వేగ భద్రత, మేధా వికాసానికి సంబంధబాంధవ్యాలపై అత్యధికంగా ఆధారపడతారు. పౌష్టికాహారం, సరైన సంరక్షణలో ఏ మాత్రం లోటుపాట్లున్నా అవి సరిదిద్దుకోలేని పర్యవసానాలకు దారితీస్తాయి. బాలల హక్కుల ఒప్పందం పిల్లల ప్రయోజనాలను, అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా కలిగిఉంది. చిన్న పిల్లల హక్కులను గౌరవించి, వారిని ప్రాథమిక పాఠశాలకు సిద్ధంచేసేందుకు బాల్యం ప్రారంభంలోని కార్యక్రమాలు ఒక ప్రధాన మార్గం. పేదరికాన్ని తొలగించి, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఈ కార్యక్రమాలు తక్కువ ఖర్చుతో కూడుకున్న వ్యూహాలను సమకూరుస్తాయి.**

## శిశువుకు హక్కులు ఉంటాయి

మానవ హక్కుల చట్టాలలో చిన్న పిల్లలకు అనేక చట్టాలు వర్తిస్తాయి. 1959 లో ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభ ఆమోదించిన పిల్లల హక్కుల ప్రకటనను న్యాయపరంగా నిర్భంధంగా అమలుచేయడం వీలుకాకపోయినప్పటికీ అది పిల్లల ఆరోగ్య సంరక్షణ, గృహ సౌకర్యం, సాంఘిక భద్రత, విద్య, నిర్లక్ష్యం, క్రూరత్వం, దోపిడిల నుండి రక్షణ వంటి అత్యంత ప్రాథమిక పిల్లల హక్కుల సూత్రాలను నొక్కిచెబుతుంది. 1989లో ఆమోదించిన పిల్లల హక్కుల అంగీకారం (సిఆర్‌సి) పిల్లల హక్కులరంగంలో నూతన అధ్యాయాన్ని ప్రారంభించింది. పిల్లల ప్రయోజనాలకు ఇది అధిక ప్రాధాన్యాన్ని ఇచ్చి వారి అభిప్రాయాలను గౌరవిస్తుంది. ప్రపంచంలో అత్యధిక దేశాలు ఆమోదించిన మానవ హక్కుల ఒప్పందమైన సిఆర్‌సి అంతర్జాతీయ ప్రమాణాలను దేశీయ చట్టాలుగా, ఆచరణలుగా మార్చేందుకు దేశాలను కట్టుబడేలా చేసింది.

సిఆర్‌సిలో అతి చిన్న పిల్లలకు వర్తించే నిర్ధిష్టమైన నిబంధనలు తక్కువగా ఉన్నప్పటికీ బాలల హక్కుల సంఘం అనే పర్యవేక్షణ సంఘం బాల్యం ప్రారంభ దశను తన ఎజెండాలో 2005లో చేర్చింది. పెంపకం, సంరక్షణ, మార్గదర్శకత్వాలకు సంబంధించి చిన్నారులకు ప్రత్యేక అవసరాలు ఉంటాయని ఈ సంఘం జనరల్ కామెంట్‌లో పేర్కొంది. పుట్టుక నుంచి 8 సంవత్సరాల వయసును బాల్యం ప్రారంభదశగా నిర్వచించే ఈ ఆచరణాత్మక డాక్యుమెంటు చిన్నారులకు సంరక్షణ, విద్యతోపాటు వారి తల్లిదండ్రులు, సంరక్షకులకు సహాయాన్ని అందించే సమగ్ర విధానాలను రూపొందించవలసిన బాధ్యతను సిఆర్‌సి సభ్యదేశాలకు గుర్తుచేస్తుంది. పిల్లల వ్యక్తిత్వాలు ప్రతిభలు, మానసిక శారీరక సామర్థ్యాలను పుట్టుక నుండి అభివృద్ధి చేయడానికి బాల్యం ప్రారంభంలో విద్యను పిల్లల హక్కులతో నేరుగా అనుసంధానించాలని ఈ డాక్యుమెంట్ చెబుతుంది.

పిల్లలకు హక్కులుంటాయనే విషయాన్ని గుర్తించడం వలన అంతర్జాతీయ ప్రమాణాలు ఏర్పడతాయి. లేనట్లయితే వీటిని గుర్తించడానికి దేశాలు ఒక్కొక్కటిగా అంగీకరించవు. శిశువు తరపున జోక్యం చేసుకోవడం కోసం రాజ్యాలకు అధికారం కల్పించడం ఇంకా వివాదాస్పదంగానే ఉంది. అయినప్పటికీ, దాదాపుగా సార్వత్రిక ఆమోదం పొందిన సిఆర్‌సికి బహు కొద్ది ఇతర అంతర్జాతీయ ఒప్పందాలకు గల హోదాను పొంది బాల్యంకోసం పటిష్టమైన విధాన ఎంజెడాల రూపకల్పనకు దోహదపడింది.



© EPA/KIM LUDBROOK/SIPA PRESS

*చక్కగా నేర్చుకోవాలంటే మంచి పౌష్టికాహారం అవసరం. జోహాన్సన్ బర్గ్, దక్షిణాఫ్రికాలో ఒక ప్రి-స్కూల్‌లో భోజనవేళ.*

## తొలి సంవత్సరాలలో అనుభవాల ప్రభావం

బాల్యం ప్రారంభదశ అత్యంత సున్నితమైన దశ. ఈ దశలో అనేక శారీరక, మానసిక, సామాజిక, భావోద్వేగ మార్పులు జరుగుతాయి. పోషకాహారలోపం, సంరక్షణ లోపం, దుర్వ్యవహారం చిన్న పిల్లలపై చెడుప్రభావం చూపుతాయి. వీటి పర్యవసానాలు తరచు పెద్దయ్యాక కనబడతాయి. జీవితపు తొలి సంవత్సరాలలో విష పదార్థాలకు గురికావడం, సరైన ప్రేరణ లేకపోవడం తీవ్రమైన దీర్ఘకాలిక పరిణామాలను కలిగి ఉంటాయి. బొత్తిగా సంరక్షణ లభించని, ప్రేమపూర్వక సంభాషణలు వినని పిల్లలు (కొన్ని అనాథాశ్రమాలలో వలె) అభివృద్ధి లోపాలతో బాధపడతారు. వాటిని తరువాత సరిదిద్దడం కష్టం.

బాల్యం ప్రారంభంలో చక్కటి కార్యక్రమాలు లభించడం వలన పిల్లల సంక్షేమం మెరుగవుతుంది. ఇంటిలో లభించే సంరక్షణకు అదనంగా ఇది పిల్లలు అభివృద్ధికి దోహదపడుతుంది.

## *విద్యకు ఆరోగ్యం, పోషకాహారం అవసరం*

ప్రతి సంవత్సరం 10 మిలియన్ల మంది ఐదేళ్లలోపు పిల్లలు మరణిస్తున్నారు. వారిలో సగం మంది నివారించగల, చికిత్సచేయగల ఐదు అంటువ్యాధుల కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా, ఇటీవలి సంవత్సరాలలో జన్మించిన ప్రతి 1000 మంది పిల్లలలో దాదాపు 86 మంది పిల్లలు 5 సంవత్సరాల వయసు పూర్తిచేయలేకపోయారు. ఉప-సహారా ఆఫ్రికా, దక్షిణ, పశ్చిమాసియాలలో శిశుమరణాల రేటు అత్యధికంగా ఉంది. (1000 సజీవ జననాలకు 100 పైగా)

పోషకాహార లోపం పాఠశాలలో పాల్గొనడం, ప్రతిభలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. పొట్టి పిల్లలు (తమ వయసుకన్నా పొట్టిగా ఉన్నవారు) పాఠశాలలో దాఖలయ్యే అవకాశాలు తక్కువగా ఉంటాయి. వారు ఆలస్యంగా తమ పేరు నమోదుచేసుకుని, ఆ తరువాత బడికి వెళ్లడం మానేసే అవకాశాలు అధికంగా ఉంటాయి. బాల్యంలో అత్యావశ్యక పోషక విలువల తీవ్రలోపం వలన భాష, చలనం, సామాజిక-భావోద్వేగ

**ఒక పక్క ఆరోగ్యం పౌష్టికాహారం మరోపక్క విద్య మధ్య అనుబంధాలను తెలుసుకోవడం వలన శిశు అభివృద్ధిపట్ల మరింత సంపూర్ణ దృక్పథం అలవడుతోంది.**

అభివృద్ధి దెబ్బతింటాయి. రక్షిత తాగునీటిని అందించడం, సరైన పారిశుధ్యం వలన శిశు, బాల మరణాల సంఖ్య నాటకీయంగా తగ్గిపోతుంది. హెచ్ఐవి/ఎయిడ్స్ చికిత్స సౌకర్యం అందుబాటులో ఉండడం చిన్న పిల్లల మనుగడ, అభివృద్ధికి చాలా ముఖ్యం (బాక్స్ 3.1) ఉప-సహారా ఆఫ్రికాలో సంఘటిత బాల్య కార్యక్రమాల అమలు పరిమితంగా ఉన్నందువల్ల పోషకాహార లోపంతో ముడిపడిన ఆరోగ్య సమస్యలను గుర్తించి, చికిత్సచేయడం మరింత కష్టంగా ఉంది.

దక్షిణ అమెరికా, కరీబియన్‌లలో బాల్యం ప్రారంభంలో కార్యక్రమాలు పిల్లలలో పోషకాహారలోపం, పొట్టితనం తగ్గిపోవడానికి పిల్లల, సంక్షేమానికి, వారు పాఠశాలకు సంసిద్ధమవడానికి తోడ్పడ్డాయి. మరణాలు తగ్గించడానికి రూపొందించే చర్యలు చిన్న పిల్లల సమగ్ర సంరక్షణ, విద్య కార్యక్రమాలను నెలకొల్పడం దిశలో తొలి అడుగు వంటివి. పోషకాహార లోపం గల పిల్లల అభిజ్ఞ ఫలితాలపై నాలుగు రకాల చొరవలు భారీ ప్రభావం చూపుతాయి. అవి: ఐరన్ సప్లిమెంట్లు, అదనపు ఆహారం, డీవార్మింగ్, మానసిక ప్రేరణ. భారతదేశంలోని ఢిల్లీలో డీవార్మింగ్, ఐరన్ సప్లిమెంట్లను ఇచ్చే ఒక కార్యక్రమం వలన ప్రి-స్కూల్‌లో హాజరు సంఖ్య పెరిగింది. పోషకాహారం పై మాత్రమే దృష్టిసారించే చొరవలకన్నా పౌష్టికాహారం, విద్యను కలగలిపిన చొరవలు విజయవంతమయ్యే అవకాశాలు అధికంగా ఉంటాయి. పోషకాహార ప్యాకేజీలు దీర్ఘకాలిక ప్రభావం కలిగి ఉంటాయని గ్వాటెమాలా, వియత్నాంలో అధ్యయనాలు తెలిపాయి. చిన్న పిల్లల ఆరోగ్యం, పోషకాహార సమస్యలను పరిష్కరించడం కోసం రూపొందించే కార్యక్రమాలలో విద్యను అంతర్గత భాగంగా పరిగణించాలి.

### బాక్స్ 3.1: హెచ్ఐవి/ఎయిడ్స్: చిన్న పిల్లలకు చికిత్స

ప్రతి రోజు హెచ్ఐవి సోకిన 1800 మంది పిల్లలు జన్మిస్తున్నారు. హెచ్ఐవి కలిగిన పిల్లలు మిగతా పిల్లలకంటే ఎక్కువగా బాల్యంలో సాధారణంగా వచ్చే వ్యాధులతో బాధపడతారు. వారిలో ఈ వ్యాధుల తీవ్రత కూడా అధికంగా ఉంటుంది. మందులకు కూడా వారు తక్కువగా ప్రతిస్పందిస్తారు. ఆరోగ్యంగా ఉన్న పిల్లలలో అరుదుగా మృత్యువుకు దారితీసే అనారోగ్యాలు హెచ్ఐవిగల పిల్లలలో అధిక మరణాలకు దారితీస్తాయి. యాంటీరెట్రోవైరల్ థెరపీ లభించనట్లయితే వ్యాధి త్వరగా ముదురుతుంది. హెచ్ఐవి సోకిన పిల్లలో 45% మంది 2 సంవత్సరాలు నిండకమునుపే చనిపోతున్నారు. పిల్లలపై హెచ్ఐవి ప్రభావాన్ని తగ్గించడం కోసం త్వరగా ఈ వ్యాధిని గుర్తించడం అవసరం. మంచి పోషకాహారం, సరైన రోగ నిరోధక టీకాలు, బాల్యంలో సాధారణంగా వచ్చే ఇన్‌ఫెక్షన్లకు మందులతో చికిత్స చాలా ముఖ్యం.

హెచ్ఐవి ఇన్‌ఫెక్షన్ గల పిల్లలు ప్రి-స్కూల్‌లో చదువులో వెనుకబడుతారని, వారి భాషానైపుణ్యాలు సరిగ్గా ఉండవని, దృష్టి చలన సమస్యలు కలిగి ఉంటారని ఉన్నతాదాయ దేశాలలో పరిశోధనలు వెల్లడించాయి. యాంటీ రెట్రోవైరల్‌థెరపీ వలన హెచ్ఐవి/ఎయిడ్స్ సోకిన పిల్లలలో మానసిక, సామాజిక-భావోద్వేగ అభివృద్ధి మెరుగవుతుంది. బాల్యం ప్రారంభంలో కార్యక్రమాలు ఇటువంటి చికిత్సకు ఒక మార్గం అందించి, వ్యాధి వలన కలిగే భావోద్వేగ, ఇతర పరిణామాలకు పరిహారం అందించే ప్రయత్నాలు చేస్తాయి.

ఎయిడ్స్ సోకిన కుటుంబాలకు చెందిన పిల్లలు వివక్షకు గురవుతారు. బాల్యం ప్రారంభ కార్యక్రమాలలో పాల్గొనడంపై అనాథ జీవితం ప్రభావం ఏ విధంగా ఉంటుందనే దానిపై ఎక్కువ సమాచారంలేదు. ప్రాథమిక పాఠశాలకన్నా ఈ కార్యక్రమాలకు యూజర్ ఫీజులు ఉంటాయి కనుక తల్లిదండ్రుల మృతి ప్రభావం చిన్న పిల్లల హాజరీపై అధికంగా ఉండవచ్చు.

### *ప్రాథమిక పాఠశాలకు వెళ్లగలిగే వీలు, ప్రాథమిక పాఠశాలలో ప్రగతిని మెరుగుపరచడం*

ఇసిసిఇ కార్యక్రమాలు పిల్లల శారీరక సంక్షేమం, మానసిక, భాషా నైపుణ్యాలు, సామాజిక-భావోద్వేగ అభివృద్ధిని పెంపొందిస్తాయి. ప్రాథమిక పాఠశాల విద్యలోనూ, ఆ తదనంతరం కూడా పిల్లల పార్టిసిపేషన్‌పై ఇటువంటి కార్యక్రమాల ప్రభావాన్ని చక్కగా డాక్యుమెంటు చేశారు. ఉదాహరణకు యునైటెడ్ కింగ్‌డమ్‌లో ప్రి-స్కూల్ అనుభవం ప్రాథమిక పాఠశాలలో మూడేళ్లపాటు పిల్లలలో మేధో వికాసం, స్వతంత్ర ప్రవృత్తి ఏకాగ్రత, సామాజిక కలవిడితనాలను మెరుగుపరిచిందని తేలింది.

బాల్యం ఆరంభంలో కార్యక్రమాలలో పాల్గొనడం, ప్రాథమిక పాఠశాలలో దాఖలు, కనీసం మూడు నాలుగేళ్లపాటు మెరుగైన ఫలితాల మధ్య సంబంధం ఉన్నాయని అనేక వర్ధమానదేశాలలో జరిపిన కార్యక్రమాల అధ్యయనాలు వెల్లడించాయి. ముఖ్యంగా ఈ సంబంధాలు బలహీన వర్గాలకు చెందిన పిల్లలలో అధికంగా కనబడ్డాయి. నేపాల్‌లోని ఒక పేద జిల్లాలో బాల్యం ప్రారంభంలో కార్యక్రమాలకు హాజరైన పిల్లలలో 95% మంది ప్రాథమిక పాఠశాలకు వెళ్లగా, ఈ కార్యక్రమాలకు హాజరుకాని పిల్లలలో కేవలం 75% మందే ప్రాథమిక పాఠశాలలో చేరారు. గ్రేడ్ 1 ఆఖరున ఈ కార్యక్రమాలలో పాల్గొన్న వారికి చెప్పుకోదగినంత ఎక్కువ మార్కులు వచ్చాయి. ప్రిస్కూల్ పిల్లలు, తల్లులకు మద్దతుకోసం ఇస్తాన్‌బుల్‌లోని తక్కువ ఆదాయ ప్రాంతాలలో అమలుచేసిన ది టర్కిష్ ఎర్లీ ఎన్‌రిచ్‌మెంట్ ప్రాజెక్టులో పాల్గొన్న పిల్లలలో 86% మంది పిల్లలు ఏడేళ్ల తరువాత కూడా ఇంకా బడికివెళ్తున్నారు. ఈ ప్రాజెక్టులో పాల్గొనని వారిలో 67% మంది మాత్రమే చదువును కొనసాగిస్తున్నారు. ఆఫ్రికా దేశాలలో ప్రి-ప్రైమరీ ఎన్‌రోల్‌మెంట్ నిష్పత్తి ఎక్కువగా ఉంటే ప్రాథమిక పాఠశాల పూర్తిచేసే రేటు ఎక్కువగా, ప్రైమరీ రిపిటీషన్‌రేటు తక్కువగా ఉంటోంది.

### *ఆర్థికపరంగా ఆవశ్యకం*

ఆరోగ్యం, పోషకాహారం, విద్యా ఫలితాలపై సానుకూల ప్రభావాలను చూపుతున్న కారణంగా, బాల్యం ప్రారంభంలో కార్యక్రమాలను మంచి మానవ పెట్టుబడిగా భావించవచ్చు. దీనిపై పరిశోధన ముఖ్యంగా వర్ధమానదేశాలలో దీని ప్రభావంపై పరిశోధన పరిమితంగా ఉన్నప్పటికీ ఇసిసిఇ కార్యక్రమాల పెట్టుబడులకు సానుకూల ఫలితాలే లభించాయి. నిజానికి ఇవి ఇతర విద్యా కార్యక్రమాల కన్నా మెరుగైన ఫలితాలనే ఇచ్చాయి. పెద్ద పిల్లలు, యువజనులు, వయోజనులు లక్ష్యంగా అమలుచేస్తున్న కార్యక్రమాల కన్నా ఇసిసిఇ కార్యక్రమాలు దీర్ఘకాలిక ఫలితాలను ఇస్తున్నాయి. అంతేకాక, ఇసిసిఇ కార్యక్రమాలలో నేర్చుకున్న నైపుణ్యాలు భవిష్యత్తులో చదువుకు పునాదిగా ఉంటున్నాయి.

బాల్యం ఆరంభంలో కార్యక్రమాల ప్రయోజనాలను తెలుపడానికి, అమెరికాలో లాంగిట్యూడినల్ హై/స్కోప్ పెర్రీ ప్రి-స్కూల్ ప్రోగ్రాంను రుజువుగా పేర్కొంటారు. పాఠశాల వైఫల్యం కలిగి ఉంటారని అంచనా వేసిన తక్కువ ఆదాయ ఆఫ్రికన్-అమెరికన్ పిల్లలు లక్ష్యంగా 1962-1967 మధ్య ఈ కార్యక్రమం అమలుచేయబడింది.
ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిని 3 నుంచి 11 సంవత్సరాల వరకు ప్రతి సంవత్సరం, 40 సంవత్సరాల వరకు అనేకసార్లు గమనించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం వలన 5 సంవత్సరాల వయసులో ఐక్యు పెరిగింది. హై స్కూలు నుంచి ఎక్కువ మంది పాసయ్యారు.

40 సంవత్సరాల వయసులో ఎక్కువ ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. ఈ కార్యక్రమం 17:1 ప్రయోజనం/ఖర్చు నిష్పత్తిని కనబరిచిందని సమగ్ర విశ్లేషణ సూచిస్తోంది.

వర్ధమాన దేశాల నుండి రుజువులు నెమ్మదిగా లభిస్తున్నాయి. ఢిల్లీలో ఒక ప్రి-స్కూలు ప్రోగ్రాం వలన రమారమి పాఠశాలలో పాల్గొనేసంఖ్య బాలికల విషయంలో 7.7% పాయింట్లు, బాలుర విషయంలో 3.2 శాతం పాయింట్లు పెరిగింది. ఈ కార్యక్రమాన్ని పొందుతున్న శిశువుకు అయ్యే ఖర్చు కేవలం 1.70 అమెరికన్ డాలర్లు కాగా, దీని వలన జీవితకాల వేతనాల ప్రస్తుత నికర విలువ 29 అమెరికన్ డాలర్లు ఉంటుంది. బొలీవియాలో ఒక గృహాధార కార్యక్రమం ప్రయోజనం/ఖర్చు నిష్పత్తులు 2.4: 1-3.1:1 మధ్య ఉన్నాయి. ప్రమాదానికి గురయ్యే అవకాశం గల పిల్లలకు అధిక నిష్పత్తులు వర్తిస్తున్నాయి. కొలంబియా, ఈజిప్టులలోనూ ఈ విధమైన నిష్పత్తులే లభించాయి. అన్ని కేసులలోనూ ఇసిసిఇ కార్యక్రమాల ప్రభావం ధనిక కుటుంబాలకు చెందిన పిల్లలకన్నా పేద కుటుంబాలకు చెందిన పిల్లలపైనే అధికంగా ఉంది. ఈ కార్యక్రమాలలో పాల్గొన్న వారిలో ప్రాథమిక పాఠశాలలకు వెళ్లడం మానేసే వారి సంఖ్య, మళ్లీ మళ్లీ అదే తరగతి చదివే వారి సంఖ్య తక్కువగా ఉంటోంది.

### *సామాజిక అసమానతను తగ్గించడం*

చిన్న పిల్లలకోసం కార్యక్రమాలు ఉండాలనే వారు ఈ కార్యక్రమాల వలన సామాజిక అసమానతలు తగ్గుతాయని అంటారు. ఇసిసిఇ కార్యక్రమాలు పేదరికం, లైంగిక, జాతి, కుల, మత వివక్ష వంటి వాటిని సరిదిద్దుతాయని ఇటీవలి పరిశోధన ధృవీకరించింది. 'పేదరికంపై యుద్ధం'లో భాగంగా 1964లో అమెరికాలో ప్రారంభించిన హెడ్‌స్టార్ట్ అనే పబ్లిక్ ప్రాజెక్టు లక్షిత కార్యక్రమాల ద్వారా కుటుంబ, సామాజికపరంగా అణగారిన వర్గాలకు పరిహారం చెల్లించవచ్చనే అభిప్రాయంతో అమలుచేయబడింది. హై/స్కోప్ పెర్రీ ప్రోగ్రాం బలహీన వర్గాలకోసం సమాన అవకాశాల వేదికను సృష్టించడంలో సఫలమైంది. కేప్ వెర్డె, ఈజిప్టు, గినీ, జమైకా, నేపాల్‌వంటి విభిన్న ప్రదేశాలలో పరిశోధనలు ఇసిసిఇ కార్యక్రమాల వలన అధిక ప్రయోజనం పొందుతున్నవారు బలహీన వర్గాల పిల్లలే అని తెలియజెప్పుతున్నాయి. బాల్యం ప్రారంభంలో కార్యక్రమాలు లైంగిక అసమానతలను కూడా తగ్గిస్తాయి.

ఈ కార్యక్రమాలలో పాల్గొనే బాలికలు సరైన వయసులో పాఠశాలలకు వెళ్లడం ప్రారంభించి, ప్రాథమిక విద్యను ముగించే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఇసిసిఇ కార్యక్రమాలలో పాల్గొనడం బాలురకన్నా బాలికల ఆరోగ్యంపై అధిక ప్రభావం చూపుతుంది.

బాల్యం ప్రారంభంలో చక్కటి నాణ్యతగల సంరక్షణ, సహకారం పిల్లలందరికీ ముఖ్యంగా పేద, అణగారిన వర్గాల పిల్లలకు పరిహారంగా అందించడం ముఖ్యం. నోబుల్ గ్రహీత జేమ్స్ హెక్‌మేన్ అన్నట్లుగా "ఇది సమానత్వాన్ని, సామాజిక న్యాయాన్ని ప్రోత్సహిస్తూ అదే సమయంలో ఆర్థిక వ్యవస్థలో సమాజంలో ఉత్పాదకతను పెంపొందించే అరుదైన ప్రభుత్వ విధాన కార్యక్రమం. బలహీన వర్గాలకు చెందిన చిన్న పిల్లలపై పెట్టుబడిపెట్టడమే ఈ విధానం''.



బాగ్దాద్, ఇరాక్‌లో కొడుకు నెత్తుకుని గర్వంగా నిలబడ్డ తండ్రి.

# భాగం - IV బాల్యంలో ప్రారంభంలో సంరక్షణ మరియు విద్యల వ్యాప్తి

చిన్న పిల్లల సంరక్షణ, విద్య కోసం అన్ని సమాజాలు ఏర్పాట్లను కలిగి ఉన్నాయి. అయితే, ప్రస్తుత సామాజిక, ఆర్థిక పోకడలు-వలస, పట్టణీకరణ, కార్మిక మార్కెట్లో మహిళలు పాల్గొనడం వంటి వాటితో సహా-కుటుంబ స్వభావాలలో మార్పులు తెస్తున్నాయి. బాల్యం ప్రారంభంలో మరింత సంఘటితమైన సంరక్షణ, విద్యలకు డిమాండ్ పెంచుతున్నాయి. నేడు కేవలం కొద్ది దేశాలలోనే ఈ కార్యక్రమాలు దాదాపుగా పూర్తిగా అందుబాటులో ఉన్నాయి. అనేక వర్థమాన దేశాలలో బాల్యం ప్రారంభంలో కార్యక్రమాలు జనాభాలో కేవలం కొద్ది భాగానికే అది కూడా పట్టణ, ధనిక కుటుంబాలకే అందుబాటులో ఉన్నాయి. ఈ భాగం బాల్యం ప్రారంభంలో సేవల గురించి పరిశీలించి ఇసిసిఇ కార్యక్రమాల వలన ప్రపంచవ్యాప్తంగా పిల్లలు ఎంతవరకు ప్రయోజనం పొందుతున్నారనేది అంచనా వేస్తుంది.

కార్మిక మార్కెట్లలోకి మహిళల అధిక ప్రవేశం.
మూడేళ్లలోపు పిల్లల కొరకు పరిమితమైన ప్రభుత్వ సౌకర్యాలు
వర్థమాన ప్రపంచమంతటా పెరుగుతోన్న ప్రి-ప్రైమరీ ఎన్‌రోల్‌మెంట్
దాదాపుగా సాధించిన లైంగిక సమానత్వం
అసమానతలను వేలెత్తి చూపే ఇంటింటికీ సర్వేలు
బాల్యం ప్రారంభంలో అందించే సేవలలో మహిళా సిబ్బంది

## గతాన్ని పరిశీలిస్తే: పనిచేసే తల్లులకు సహాయం, సంఘటిత శిశు సంరక్షణలో పెరుగుదల

చిన్న పిల్లలకు సంరక్షణ అందించే లాంఛన పూర్వక ఏర్పాట్లు పద్దెనిమిదవ శతాబ్దంలోనే అందుబాటులో ఉన్నాయి. ఐరోపాలో విభిన్న రకాల బాల్యం ప్రారంభంలో సంరక్షణ అందించే సంస్థలు క్రమేణా నెలకొల్పబడ్డాయి. వాటిలో కొన్ని నేడు ప్రముఖ విద్యావేత్తలుగా గుర్తింపుపొందిన ఫ్రోబెల్, మాంటిస్సోరీ వంటివారు నెలకొల్పినవి. ఈ సంస్థలలో కొన్ని పేద కార్మిక తల్లులు, నిర్లక్ష్యానికి గురైన పిల్లల అవసరాలను తీర్చగా, మరికొన్ని మధ్య తరగతి పిల్లలకు చక్కటి ప్రి-స్కూలు విద్యను అందించాయి. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత కార్మిక శక్తిలో మహిళల సంఖ్య పెరగడంతో చిన్న పిల్లలకు చక్కటి నాణ్యతతో, అందుబాటు ధరలలో అందించే సంరక్షణకు డిమాండ్ పెరగనారంభమైంది. ఇరవైయ్యవ శతాబ్దం చివరి నాటికి ఐరోపా అంతటా ప్రభుత్వ నర్సరీ పాఠశాల తన ఆధిపత్యాన్ని నెలకొల్పింది.

వర్థమాన దేశాలలో, లాంఛన పూర్వకంగా బాల్యం ప్రారంభంలో సంరక్షణనందించే సేవలు ఇటీవలి సంవత్సరాలలో ప్రారంభమయ్యాయి. వాటిలో వైవిధ్యం గణనీయంగా ఉంది. వ్యవసాయం, అనియత రంగాలలో మహిళలు నిర్వహించే సాంప్రదాయ పాత్ర వలన శిశు సంరక్షణ, పెంపకంకోసం బంధువులు, అనియత సామాజిక ఏర్పాట్లపై ఆధారపడడం జరిగింది. అయితే 1950ల నుండి వర్థమాన దేశాలలో మహిళలు కార్మిక మార్కెట్లో అధిక సంఖ్యలో ప్రవేశించడం వలన పరిస్థితి మారిపోయింది. 2005లో కార్మిక శక్తిలో పాల్గొనే మహిళల రేట్లు తూర్పు ఆసియా, ఆగ్నేయాసియా, ఉప-సహారా ఆఫ్రికాలలో 55% గానూ, దక్షిణ అమెరికా, కరీబియన్ దేశాలలో 50% గానూ ఉన్నాయి. దక్షిణాసియాలో (35%), అరబ్ దేశాలలో (28%) ఈ రేట్లు తక్కువగా ఉన్నప్పటికీ గత దశాబ్దాలతో పోలిస్తే ఈ సంఖ్య బాగా పెరిగింది. మొత్తం మీద కుటుంబ ఆదాయం, వ్యయాలపై మహిళల నియంత్రణ పెరగడం వలన కుటుంబ నిర్ణయాలలో పిల్లల సంక్షేమంపట్ల తీసుకొనే నిర్ణయాలకు ప్రాధాన్యత పెరగడానికి, బాల్యం ఆరంభంలో అందించే సేవలలో బాలికలను బాలురతో సమానంగా ప్రయోజనాలు పొందడానికి అవకాశాలు మెరుగయ్యాయి.

అధికంగా అభివృద్ధి చెందిన దేశాలలో పారిశ్రామిక, సేవారంగంలో మహిళలు చేసే పనికి ప్రి-స్కూల్ కార్యక్రమాలలో అధిక ఎన్‌రోల్‌మెంట్‌కు మధ్య గట్టి సంబంధముంది. వర్థమాన దేశాలలో ఉద్యోగ పోకడలు, ప్రి-ప్రైమరీ విద్యకు మధ్యగల సంబంధం బలహీనంగా ఉంది. అయితే వలస, పట్టణీకరణ, హెచ్ఐవి/ఎయిడ్స్ మహమ్మారి బంధువులు, న్యూక్లియార్ కుటుంబాలకు మధ్య బంధాలను బలహీనపరుస్తున్నాయి.

ఫలితంగా ప్రస్తుతం ఉన్న ఏర్పాట్లు శిశు సంరక్షణ అవసరాలను తీర్చలేకపోతున్నాయి. సింగిల్‌పేరెంట్ కుటుంబాలు ముఖ్యంగా మహిళ నేతృత్వంలోని కుటుంబాల సంఖ్య యూరోపియన్ యూనియన్, దక్షిణ అమెరికాలలో పెరిగిపోతోంది. ఫలితంగా శిశు సంరక్షణపై వీటి ప్రభావం పెరిగిపోతోంది.

శిశు సంరక్షణకు మద్దతునందించే ప్రభుత్వ విధానాలు పందొమ్మిదవ శతాబ్దం తుదిలో ప్రారంభమయ్యాయి. 1970ల నాటికి దాదాపుగా ఒఇసిడి దేశాలన్నీ వేతనాలతో కూడిన ప్రసవ సెలవు, కొన్ని దేశాలు తల్లిదండ్రులకు సెలవు (ముఖ్యంగా నోర్డిక్ దేశాలు) అంటే తల్లికో లేక తండ్రికో లేదా అరుదైన సందర్భాలలో తల్లిదండ్రులిద్దరికీ సెలవునివ్వడం ప్రారంభించాయి. సుమారు 100 వర్ధమాన దేశాలు ఏదో ఒక రూపంలో ప్రసవ సెలవును ఇస్తున్నట్లు తెలిపాయి. అయితే చాలా దేశాలలో ఇవి కొన్ని రంగాలలోని కార్మికులకే పరిమితమయ్యాయి, వీటి అమలు ప్రక్రియలో చిత్తశుద్ధి కొరవడింది.

## ఇఎఫ్ఏ మొదటి లక్ష్యం దిశలో ప్రగతి పర్యవేక్షణ

**738 మిలియన్ల మంది పిల్లలు అంటే ప్రపంచ జనాభాలో 11% - 0-5 సంవత్సరాల వయసులో ఉన్నారు. 2020 నాటికి వారి సంఖ్య 776 మిలియన్లు చేరుతుందని అంచనా. ఈ పెరుగుదలకు ఉప-సహారా ఆఫ్రికా, అరబ్ దేశాలలో పెరుగుదలే కారణం.**

ఇసిసిఇ కార్యక్రమాల రూపురేఖలు, సంస్థల స్వరూపాలు, నిధులు అందించే పద్ధతులలో ఎంతో వైవిధ్యం ఉండడంవలన వాటిని పర్యవేక్షించడం ఒక పెద్ద సవాలుగా ఉంది. అలాగే, బాల్యం ప్రారంభంలో అమలుచేయవలసిన కార్యక్రమాలపై ఏ విధమైన పరిమాణాత్మక లక్ష్యాలు లేకపోవడం వలన వీటి ప్రగతిని కొలవడం కష్టం. పర్యవేక్షణ జరపడంలో ఎదురయ్యే ఇబ్బందులలో ఈ కిందివి ఉన్నాయి. మూడు సంవత్సరాలలోపు పిల్లల కార్యక్రమాల గురించి ఆధారపడదగిన గణాంక వివరాలు లేకపోవడం, ఆరోగ్యం శారీరక అభివృద్ధి, విద్య, తల్లిదండ్రులకు మద్దతు వంటి కార్యక్రమాలపై పరిమిత సమాచారం, ప్రి-ప్రైమరీ విద్యకోసం దాఖలైన విద్యార్థుల వివరాలలో విద్యాశాఖ కింద ఉన్న సంస్థల వివరాలే ఉంటాయి కానీ ఇతర మంత్రిత్వశాఖలు, ప్రైవేటు బృందాలు లేదా స్థానిక సముదాయాలు నిర్వహించే కార్యక్రమాలలో లేకపోవడం వలన పిల్లల సంఖ్యలో తగ్గుదల పాల్గొనేందుకు మామూలుగా అనేక దేశాలు 3-5 లేదా 3-6 సంవత్సరాల వయసును ఉపయోగిస్తాయి. దీని వలన బాల్యం ప్రారంభంలో చేరే పిల్లల సంఖ్యలో గణనీయమైన తేడాలు ఉంటాయి. ప్రగతిని సమీక్షించేదుకు ఈ నివేదిక అనేక వనరులనుండి సమాచారాన్ని స్వీకరించింది.

వర్ధమాన దేశాలలో మూడు సంవత్సరాలలోపు పిల్లల సంరక్షణ, విద్యలను తల్లిదండ్రుల బాధ్యతగానో లేదా ప్రైవేటు సంస్థలు, ప్రభుత్వేతర సంస్థల బాధ్యతగానో భావిస్తారు. ప్రపంచంలోని సగం దేశాలలో మాత్రమే చిన్న పిల్లలకోసం ఒకటో రెండో కార్యక్రమాలు కనబడతాయి. అవి సాధారణంగా ఈ వయసు పిల్లలకు రోజులో కొంతకాలంపాటు సంరక్షణ కల్పిస్తాయి. కొన్నిసార్లు వారికి వైద్య, విద్య కార్యక్రమాలు కూడా లభిస్తాయి. ఇసిసిఇని సమగ్రంగా పర్యవేక్షించాలంటే మూడు సంవత్సరాలలోపు పిల్లలకోసం అమలు చేస్తున్న కార్యక్రమాలపై అధిక సమాచారం కావాలి.



*బుడాపెస్ట్, హంగరీలో 1948లో ప్రభుత్వం నడిపే కిండర్ గార్డెన్‌లో దృశ్యం.*

© David Seymour / Magnum Photos


### ప్రి-ప్రైమరీ విద్య: ఎన్‌రోల్‌మెంట్‌లో భారీ పెరుగుదల

పిల్లలకు సంరక్షణతోపాటు, ప్రయోజనపూరితంగా, ప్రణాళికాబద్ధంగా నియత విద్యా సంస్థలలోనూ, అనియత వాతావరణంలోనూ చేపట్టే విద్యా కార్యాక్రమాలతో కూడిన అన్ని కార్యక్రమాలను ప్రి-ప్రైమరీ విద్యగా (ఐఎస్‌సిఇడి స్థాయి-0) ఇంటర్నేషనల్ స్టాండర్డ్ క్లాసిఫికేషన్ ఆఫ్ ఎడ్యుకేషన్ నిర్వహిస్తుంది. సాధారణంగా, మూడు సంవత్సరాలలోపు పిల్లలకంటే ఆ వయసు దాటిన పిల్లల కార్యక్రమాలలో ప్రభుత్వాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. 70% దేశాలలో మూడేళ్ల వయసు ప్రి-ప్రైమరీ విద్యకు అధికార ప్రారంభ వయసుగా ఉంది.

1970 మధ్యకాలంలో 44 మిలియన్లు ఈ సంఖ్య 2004 నాటికి 124 మిలియన్లకు చేరింది. ప్రతిదేశంలో వయసుతో నిమిత్తం లేకుండా అధికారిక వయోపరిధి (సాధారణంగా 3-5) ఉన్న జనాభాలో నమోదు చేసుకున్న వారి శాతాన్ని ప్రి-ప్రైమరీ స్కూల దాఖలు నిష్పత్తి (జిఇఆర్‌లు) తెలుపుతాయి. 1975-2004 మధ్య విశ్వ జిఇఆర్ 17% నుండి 37% అంటే రెండింతలకుపైగా పెరిగింది. ధనిక, మార్పు చెందుతున్న దేశాలలో ఈ నిష్పత్తి 1970లో 40% ఉండగా, అది 2004లో 73% నికి చేరింది. వర్ధమాన దేశాలలో ప్రి-ప్రైమరీ విద్య వ్యాప్తి అప్పుడు, ఇప్పుడు అతి తక్కువ స్థాయిలోనే ఉంది: 1975లో సగటున పదిమందిలో ఒకరికంటే తక్కువ పిల్లలు ప్రి-ప్రైమరీ సంస్థలలో నమోదయ్యేవారు; 2004 నాటికి వ్యాప్తి పెరిగి ప్రతి ముగ్గురిలో దాదాపు ఒకరు (32%) నమోదవుతున్నారు. 1991-2004 సంవత్సరాలకు తులనాత్మక గణాంక వివరాలు లభించిన 81 దేశాలలో 4/5 వంతు దేశాలలో ప్రి-ప్రైమరీ విద్యవ్యాప్తి పెరిగింది.

**ప్రపంచ వ్యాప్తంగా ప్రి-ప్రైమరీ విద్యలో నమోదైన విద్యార్థుల సంఖ్య గత మూడు దశాబ్దాలలో మూడురెట్లు పెరిగింది.**

**చిత్రం 4.1 ప్రి-ప్రైమరీ స్థూల దాఖలు నిష్పత్తులలో ప్రాంతీయ పోకడలు; 1970/71 నుండి 2003/04**




గమనిక : నూతన వర్గీకరణ కారణంగా తెగిపోయిన గీత డేటా శ్రేణిలో ఖాళీని సూచిస్తుంది.
*ఆధారం:* పూర్తి ఇఎఫ్ఎ నివేదికలో అధ్యాయం 6 చూడండి.

**అనేక ప్రాంతాలు ప్రి-ప్రైమరీ విద్యలో లైంగిక సమానత్వాన్ని సాధించే దిశలో సాగుతున్నాయి**

1970ల నుండి పోకడలలో ప్రాంతీయ తేడాలు స్పష్టంగా కనబడతాయి. దక్షిణ అమెరికా, కరీబియన్ దేశాలలో అత్యధిక పెరుగుదల కనబడుతుంది. ఈ దేశాలలో 3/4 వంతు దేశాలు ప్రస్తుతం 75% ప్రి-ప్రైమరీ జిఇఆర్ కలిగి ఉండగా, ఉప-సహారా ఆఫ్రికాలో 1970ల నుండి పెరుగుదల నిలకడగా ఉన్నప్పటికీ సగం దేశాలలో నిష్పత్తులు 10% కన్నా తక్కువగా ఉన్నాయి. అరబ్ దేశాలలో 1980ల నుండి దాఖలు నిష్పత్తి గణనీయంగా ఉంది. ఆసియా అంతటా జిఇఆర్‌లు చెప్పుకోదగినంతగా విస్తరించాయి. దక్షిణ, పశ్చిమాసియా దేశాలలో అనేక దేశాలు ఇప్పుడు తమ పిల్లలలో 1/3, 1/2 వంతు మందిని ప్రి-ప్రైమరీ విద్యలో దాఖలు చేసుకుంటున్నాయి. (చిత్రం 4.1)

1999 నుండి, ప్రి-ప్రైమరీ దాఖలు ఉప-సహారా ఆఫ్రికా (దాఖలైన వారి సంఖ్య 43.5% పెరిగింది) కరీబియన్ (43.4%), దక్షిణ, పశ్చిమాసియా (40.5%)లో బాగా పెరిగాయి. ఉప-సహారా ఆఫ్రికాలో ప్రి-ప్రైమరీ విద్యకోసం దాఖలైన వారి సంఖ్య భారీగా పెరిగినప్పటికీ జనాభా పెరుగుదల కొనసాగడంవల్ల ఆ ప్రాంతపు నగటు జిఇఆర్ పెరగలేదు.

1999-2004 మధ్య కాలంలో నగటు జిఇఆర్ వర్ధమాన, అభివృద్ధి చెందిన దేశాలలో ఓ మోస్తరు పెరుగగా, మార్పు చెందుతున్న దేశాలలో ఈ పెరుగుదల స్పష్టంగా కనబడింది. (18 పర్సంటేజి పాయింట్లు) తూర్పు ఆసియాలో ప్రి-ప్రైమరీ విద్యకోసం దాఖలయ్యే చిన్న పిల్లలసంఖ్య 10% తగ్గింది. చైనాలో దాఖలు పోకడలలో వచ్చిన మార్పులు ఈ తగ్గుదలకు ప్రధాన కారణమయ్యాయి (చైనాలో 1976లో 6.2 మిలియన్లలో ఉన్న దాఖలాలు 1999లో 24 మిలియన్లకు పెరిగి 0-5 ఏళ్లలోపు జనాభా తగ్గడం వలన 2004లో దాఖలాల సంఖ్య 20 మిలియన్లకు తగ్గింది) ప్రపంచంలో ప్రి-ప్రైమరీ విద్యకోసం నమోదయ్యే పిల్లలలో 48% బాలికలు. 1999 నుండి ఈ శాతంలో మార్పు లేదు.

ఒకే ప్రాంతంలో ఉన్న దేశాల మధ్య గణనీయమైన తేడాలు ఉన్నాయి; సాధారణంగా అవి జాతీయ అభివృద్ధి స్థాయిలకు సంబంధించినవి (ఉదా; ఉప-సహారా ఆఫ్రికా ప్రాంతీయ నగటు కేవలం 10% కాగా, మారిషస్, సేషల్స్ జిఇఆర్ 100% దరిదాపుల్లో ఉంది; తూర్పు ఆసియాలో జిఇఆర్ 10% కన్నా తక్కువగా ఉంది. కొరియా రిపబ్లిక్, మలేషియా, థాయ్‌లాండ్ దాదాపుగా సార్వత్రిక దాఖలు నిష్పత్తి కలిగి ఉన్నాయి). మధ్య ఆసియా 1990లో తగ్గుదల తరువాత కొంత కోలుకున్నప్పటికీ ఏ దేశంలోనూ సగం మందికి పైగా పిల్లలు నమోదు కావడంలేదు. ఉత్తర అమెరికా, పశ్చిమ ఐరోపాలలో అన్ని దేశాలు 60% పైగా జిఇఆర్ కలిగి ఉన్నాయి. వాటిలో సగం దేశాలలో ఈ నిష్పత్తి 100% గా ఉంది.

30% కన్నా తక్కువ జిఇఆర్ కలిగిన 52 దేశాలలో అనేక దేశాలు ఉప-సహారా ఆఫ్రికా, అరబ్ దేశాలలో ఉన్నాయి. మొత్తం మీద వాటి ఇటీవలి ప్రగతి నెమ్మదిగా ఉంది. సాధారణంగా 5 పర్సంటేజ్ పాయింట్ల కన్నా తక్కువ. 2004లో 30% నికి పైగా జిఇఆర్ కలిగి ఉన్న 86 దేశాలలో 66 దేశాలలో 1999 నుండి ఈ నిష్పత్తి పెరిగింది. బ్రెజిల్, క్యూబా, ఈక్వెడార్, మెక్సికో, జమైకా వేగంగా పురోగమించాయి. (10 పర్సంటేజ్ పాయింట్లకు పైగా) మార్పు చెందుతున్న అనేక దేశాలు తాము కోల్పోయిన స్థాయికి తిరిగి నిలదొక్కుకోవడం ప్రారంభించాయి.

మొదటి లక్ష్యానికి పరిమాణాత్మక ఆశయంలేనప్పటికీ అనేక దేశాలు 2010 లేదా 2015 జాతీయ ప్రణాళికలలో కనీసం 3 పైబడిన పిల్లలకోసం తమ సొంత ఆశయాలను నిర్దేశించుకున్నాయి. తులనాత్మకంగా అధిక ప్రి-ప్రైమరీ దాఖలను లక్ష్యంగా నిర్దేశించుకున్నాయి. ప్రస్తుతం 50% పైగా జిఇఆర్ కలిగిన చిలీ, మెక్సికో ఈ విధమైన లక్ష్యం పెట్టుకున్నాయి. 40% కన్నాతక్కువ జిఇఆర్ కలిగిన భారత్, ఖజకిస్తాన్, పెరాగ్వే, కూడా సార్వత్రిక ప్రి-ప్రైమరీ విద్యను లక్ష్యంగా పెట్టున్నాయి. గత పెరుగుదల రేట్లను బట్టి చూస్తే అదనపు ప్రయత్నాలను గణనీయంగా చేపట్టితే మినహా ఈ జాతీయ లక్ష్యాలను సాధించడం సాధ్యంకాదు.


అనేక ప్రాంతాలు మొత్తంమీద స్త్రీ, పురుష జిఇఆర్‌ల మధ్య 0.97 నిష్పత్తితో, ప్రి-ప్రైమరీ విద్యలో లైంగిక సమానత్వం సాధించే దిశగా సాగుతున్నాయి. అధిక తారతమ్యాలు గల ప్రాంతాలలో ముఖ్యంగా అరబ్ దేశాలలో సైతం గణనీయమైన ప్రగతి కనబడింది. అరబ్ దేశాలలో లైంగిక సమానత్వ సూచిక 1999లో 0.76 ఉండగా 2004లో అది 0.87కు చేరింది. దక్షిణ, పశ్చిమాసియాలు కూడా 1999-2004 మధ్య కాలంలో లైంగిక సమానత్వం దిశలో ముందుకు నడిచాయి. కరీబియన్ దేశాలు, అనేక పసిఫిక్ ద్వీపాలలో బాలికలపట్ల కొద్దిగా పక్షపాతం కనబడుతుంది. ఈ దేశాలలో చాలా వాటిలో ప్రైమరీ, సెకండరీ స్థాయిలలో బాలికలపట్ల పక్షపాతం చూపే లైంగిక అసమానతలు ఉన్నాయి. అతి తక్కువ జిపిఐ గల దేశాలు: ఆఫ్ఘనిస్తాన్, మొరాకో, పాకిస్తాన్, యెమెన్.

### *ఇసిసిఇని అందుకునే వీలు పరిమితంగా గల బృందాలను గృహ సర్వేలు వెల్లడించాయి*

ప్రి-స్కూలుపై లభించే అడ్మినిస్ట్రేటివ్ డేటా కన్నా నేరుగా ఇంటర్వ్యూల ఆధారంగా జరిపే గృహ సర్వేలు ద్వారా బాల్యం ప్రారంభంలో కార్యక్రమాలపై సమగ్ర చిత్రం దర్శనిమిస్తుంది. సర్వే డేటా లభించిన 53 దేశాలలో అనేక దేశాలలో లైంగిక తేడా చాలా స్వల్పంగా ఉంది.

దీనికి భిన్నంగా పట్టణ-గ్రామీణ తేడాలు అధికంగా ఉన్నాయి (జమైకాలో మినహా), అంతేకాక, గ్రామీణ పిల్లలు ఎల్లప్పుడు పట్టణ

**చిత్రం 4.2 సంరక్షణ, విద్య కార్యక్రమాలలో పాల్గొన్న 3, 4 సంవత్సరాల వయసుగల పిల్లల హాజరు రేట్లలో గృహ సంపదలో తేడాలు**




*ఆధారం: పూర్తి ఇఎఫ్ఏ నివేదికలో అధ్యాయం 6 చూడండి.*

పిల్లల కంటే వెనుకబడి ఉన్నారు. అనేక దేశాలలో బాల్యం ప్రారంభంలో కార్యక్రమాలను పొందుతున్న పట్టణ పిల్లల కంటే గ్రామీణ పిల్లలు 10 నుండి 30 వర్సంటేజి పాయింట్లు తక్కువగా ఉన్నారు. కొన్ని ప్రాంతాలను మినహాయిస్తే పేద కుటుంబాలకు చెందిన పిల్లల కన్నా ధనిక కుటుంబాలకు చెందిన పిల్లల ఇసిసిఇ హాజరు రేట్లు ఎక్కువగా ఉన్నాయి. (చిత్రం 4.2)సెకండరీ విద్యాస్థాయిగల తల్లికి గల పిల్లలు ఇసిసిఇ కార్యక్రమాలకు హాజరయ్యే అవకాశం అధికంగా ఉంది. జనన సర్టిఫికెట్లులేని పిల్లలు, కొంతవరకు వాక్సినేషన్ రికార్డులు లేని పిల్లలు ఇసిసిఇ కార్యక్రమాలకు తక్కువగా హాజరవుతున్నారు. పొట్టిగా ఉండి బాధపడేవారు ఇతర పిల్లలకన్నా ఇసిసిఇ కార్యక్రమాలకు తక్కువగా హాజరవుతున్నారు.

## ఇసిసిఇ సిబ్బంది

వర్థమాన దేశాలలో ప్రి-ప్రైమరీ ఉపాధ్యాయుల విద్యార్హతలలో ఎంతో వైవిధ్యం ఉంది. వారు లోయర్ సెకండరీ స్థాయి నుంచి తృతీయశ్రేణి వరకు అర్హతలు కలిగి ఉన్నారు. అధికారికంగా పేర్కొన్న అర్హతలను తరచు పట్టించుకోవడంలేదు. ప్రి-ప్రైమరీ ఉపాధ్యాయులకు ఇచ్చే శిక్షణ కూడా చాలా తక్కువ. ఇది అన్ని దేశాల్లోనూ ప్రైమరీ ఉపాధ్యాయుల కంటే తక్కువగానే ఉంది. లెసోతో, ఉగాండాతో సహా కొన్ని దేశాలు ఈ మధ్యనే ప్రీ-ప్రైమరీ ఉపాధ్యాయులకు శిక్షణ కోర్సులు రూపొందించాయి.

అత్యధిక పారిశ్రామిక దేశాలలో ఉద్యోగాలకు అవసరమైన ప్రవేశ అర్హతలలో తృతీయ శ్రేణి విద్యతోపాటు నిర్దిష్ట శిక్షణ ఉన్నాయి. బాల్యం ప్రారంభంలో అందించే సంరక్షణ, విద్య సౌకర్యాలు సాధారణంగా వేరువేరుగా ఉంటాయి కాబట్టి సిబ్బంది నియామకం కూడా వేరుగా ఉంటుంది. ఉన్నత శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, శిక్షణ పొందని పిల్లల సంరక్షక కార్యకర్తలతో కలిసి పనిచేస్తారు. సంరక్షణ కార్యకర్తలలో పలువురు పార్ట్‌టైమ్ ఉద్యోగులుగాగానీ లేదా స్వచ్ఛందంగాగానీ పనిచేస్తున్నారు.

ప్రి-ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులలో దాదాపు అందరు మహిళలే. సాంప్రదాయక తల్లిపెంపకం బాధ్యత పొడిగింపే ఇసిసిఇ అనే అభిప్రాయం ఉండడాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. ఒఇసిడి దేశాలలో ప్రి-ప్రైమరీ టీచర్లలో 20% కి పైగా 50 ఏళ్ల పైబడినవారే. తక్కువ, మధ్య ఆదాయ దేశాలలో ప్రి-ప్రైమరీ విద్య ఇప్పుడిప్పుడే విస్తరించడం వల్ల ప్రైమరీ స్థాయికంటే ఎక్కువ శాతం యువ ఉపాధ్యాయులు ఈ పాఠశాలలలో పనిచేస్తున్నారు.

వివరాలు అందుబాటులో ఉన్న (ప్రధానంగా మధ్య ఆదాయ) అత్యధిక దేశాలలో ప్రి-ప్రైమరీ ఉపాధ్యాయుల వేతనాలు దాదాపు సమానంగా ఉన్నాయి. అయితే, ప్రి-ప్రైమరీ ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది, నియత సంస్థలు, అనియత వ్యవస్థలో పనిచేసే సిబ్బంది వేతనాల మధ్య అసమానతలు ఉన్నాయి. కొన్ని దేశాలు విద్య, సంరక్షణ ఉద్యోగుల వేతనాల మధ్య తేడాను తొలగించేందుకు ఇసిసిఇలో జాతీయ కనీస వేతన పద్ధతిని ప్రవేశ పెట్టాయి.

**కొన్ని దేశాలు ఇసిసిఇలో జాతీయ కనీస వేతనాన్ని ప్రవేశపెట్టి విద్యకు, సంరక్షణ కార్యకర్తలకు మధ్య గల అంతరాన్నిపూడ్చే దిశగా సాగుతున్నాయి**

అనేక దేశాలు ప్రి-ప్రైమరీ ఉపాధ్యాయుల నియామకానికి అవసరమయ్యే అర్హతలో భాగంగా శిక్షణా కార్యక్రమాలను రూపొందిస్తున్నాయి, పునశ్చరిస్తున్నాయి లేదా మెరుగుపరుస్తున్నాయి. ఈజిప్టులోని ఎన్నో విశ్వవిద్యాలయాలు కిండర్ గార్డెన్ ఉపాధ్యాయులకోసం ప్రి-సర్వీస్, ఇన్-సర్వీస్ శిక్షణ కార్యక్రమాలను రూపొందించాయి. మిగతా దేశాలు ఈ మధ్యనే ప్రి-స్కూల్ టీచర్లకోసం తమ మొదటి కార్యక్రమాన్ని రూపొందించాయి. ప్రి-సర్వీస్ ట్రెయినింగ్‌ను అనేక దేశాలు సమర్థిస్తున్నాయి. మొరాకోలోని ప్రతి రాష్ట్రం ఉపాధ్యాయులు తమ చదువు కొనసాగించడానికి, బోధనా పద్ధతులను మెరుగుపరచడానికి ఉపయోగపడేలా ప్రి-స్కూల్ రిసోర్స్ సెంటర్లను నెలకొల్పాయి. ట్రినిడాడ్, టొబాగోలోని సర్వోస్ శిక్షణ కేంద్రం ఇతర కరీబియన్ ద్వీపాలకు ఇన్-సర్వీస్ శిక్షణ అందిస్తోంది. బాల్యం తొలినాళ్లలో తల్లిదండ్రులకు మద్దతునివ్వడం కూడా ఎంతో ఉపయోగపడుతుంది. ఏ ఒక్క బాల్యకార్యక్రమ నమూనాను కూడా అన్ని దేశాలలో సార్వత్రికంగా అమలుచేయడం కష్టం. వివిధ దేశాలలో పిల్లలను పెంచే పద్ధతులలో ఎంతో వైవిధ్యం ఉంటుంది. బాల్యం ప్రారంభంకోసం కార్యక్రమాలను రూపొందించేటప్పుడు ఈ వైవిధ్యాన్ని గుర్తించి ఆయా దేశాలకు, ఆయా సామాజిక వర్గాలకు వర్తించేలా వాటిని రూపొందించాలి.

# భాగం - V
# చిన్న పిల్లలకోసం నాణ్యమైన కార్యక్రమాలు రూపొందించడం

- సాంస్కృతిక వైవిధ్యాన్ని గౌరవించడం
- తల్లిదండ్రులతో పనిచేయడం
- మాతృభాషలో ప్రారంభించడం
- స్టీరియో టైపులులేని లైంగిక సమానత్వం
- కలగలుపుకుపోయే దృక్పథాలు
- పాఠశాల సంసిద్ధత

బాల్యం ప్రారంభంలో కార్యక్రమాలు తల్లిదండ్రులు ఇతర సంరక్షకుల ప్రయత్నాలకు సహాయపడతాయి. ఈ కార్యక్రమాలు ప్రభావ పూరితంగా ఉండాలంటే అవి సంస్కృతిని పరిగణనలోకి తీసుకుని, భాషా వైవిధ్యాన్ని గౌరవించే విధంగా ఉండాలి. ప్రత్యేక అవసరాలు గల వారి అవసరాలు తీర్చగల లేదా అత్యవసర పరిస్థితిలో పనిచేయగల సామర్థ్యాన్ని ఈ కార్యక్రమాలు కలిగిఉండాలి. పుట్టుక నుండి ప్రాథమిక పాఠశాలలో చేరేవరకు పిల్లలకు మద్దతునిచ్చే కార్యక్రమాలలో కొన్ని ప్రభావపూరితమైన అంశాలను ఈ భాగం సమీక్షిస్తుంది.



తౌబాబ్ డయాలోవ్, సెనిగల్‌లోని ఒక మత్స్యకారుల గ్రామంలో పిల్లల దృష్టిని ఆకట్టుకుంటున్న కిండర్ గార్డెన్ టీచర్ ఈ గ్రామంలో నివసించే వారంతా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారే

చిన్న పిల్లల కొరకు కార్యక్రమాలను రూపొందించడం ఎంతో క్లిష్టమైన విషయం. విద్యాకార్యక్రమాలను ఆరోగ్యం, పౌష్టికాహారం, సాంఘిక సేవలతో మేళవించి పిల్లల సంపూర్ణ అభివృద్ధిని సాధించేలా ఈ కార్యక్రమాలు ఉండాలి. విభిన్న పరిస్థితుల నుండి వచ్చే చిన్న పిల్లల అవసరాలకు తగినట్లుగా బోధనా పద్ధతులను రూపొందించాలి. పిల్లల తొలి సంవత్సరాలలో తల్లిదండ్రులకు కూడా సహాయం అందించడం వలన ఫలితముంటుంది. బాల్యం ప్రారంభంలో అమలుచేసే ఏ కార్యక్రమం నమూనాను కూడా అన్ని దేశాలలో ఒకే విధంగా అమలుచేయలేం. మొదట, తల్లిదండ్రులు పిల్లలను పెంచే పద్ధతులు ప్రపంచంలో వేర్వేరుగా ఉంటాయి. బాల్యం ప్రారంభ కార్యక్రమాలు ఈ తేడాలను గుర్తించి అవి ఆయా దేశాలలో పరిస్థితులకు వాటిని రూపొందించిన పిల్లల వయసులకు అనుగుణంగా ఉండేలా చూడడం ముఖ్యం.



© EPA/NIC BOTHMA/SIPA

## తల్లిదండ్రుల కార్యక్రమాలు: ఇంట్లోనే ప్రారంభం

తల్లిదండ్రులే (లేదా ఇతర సంరక్షకులు) పిల్లల మొదటి ఉపాధ్యాయులు అందుకే ఇల్లే తొలి సంరక్షణ కేంద్రం. పిల్లల మేధా వికాసం, సాంఘిక, భావోద్వేగ వికాసాలపై ఇంటి వాతావరణం అతిపెద్ద ప్రభావం చూపుతుంది. ఏకాగ్రత, జ్ఞాపక శక్తి, ప్రణాళికీకరణలవంటి మేధాసంబంధమైన వికాసానికి పుస్తకాలు, బొమ్మలేసే సామాగ్రి లభ్యత ఎంతగానో తోడ్పడుతుంది. ఇంటి వాతావరణాన్ని మెరుగుపరచడంకోసం తల్లిదండ్రులతో కలిసి పనిచేయడమే అత్యుత్తమ మార్గం.

తల్లిదండ్రుల కార్యక్రమాలలో ఎంతో వైవిధ్యం ఉంటుంది. కాబట్టి వాటిని పర్యవేక్షించడం కష్టం. ఇంటిని సందర్శించే కార్యక్రమాలు తల్లిదండ్రులకు నేరుగా మద్దతును అందిస్తాయి. అయితే ఈ పద్ధతి ఎంతో ఖర్చుతో కూడుకున్నది కాబట్టి ప్రమాదాలను ఎదుర్కొనే అవకాశమున్న కుటుంబాలవంటి లక్ష్యిత బృందాలకే వీటని పరిమితం చేయడం మంచిది. ఉదాహరణకు డబ్లిన్‌లో అమలయ్యే కమ్యూనిటీ మదర్స్ ప్రోగ్రాం లక్ష్యిత గ్రూపులలో సింగిల్ మరియు/లేదా టీనేజ్ తల్లిదండ్రులు, శరణార్థులు, శరణుకోరేవారు, వెనుకబడిన ప్రాంతాలలో నివసించేవారు ఉన్నారు. నర్సుల ద్వారా శిక్షణపొందిన వాలంటీర్లను కమ్యూనిటీ మదర్స్ అంటారు. వారు నెలకొకసారి తల్లిదండ్రులను సందర్శించి, ఆరోగ్య సంరక్షణ, పోషకాహారం, మొత్తం మీద అభివృద్ధిపై దృష్టిసారించి ప్రత్యేకంగా రూపొందించిన శిశు అభివృద్ధి కార్యక్రమం అమలు చేస్తారు. దీని వలన తల్లులు, పిల్లలలో ఆత్మ వికాసం, కలివిడితనం, పెరిగిందని, పిల్లలు చదువుకునే ప్రక్రియకు మద్దతు పెరిగిందని సమీక్షలు చూపుతున్నాయి. ప్రొఫెషనల్స్‌తో తల్లిదండ్రుల బృందాలను రూపొందించడం కూడా పిల్లల సంరక్షణ, విద్యపై సమాచారాన్ని పంచుకునే మరో సాధారణ మార్గం.

ఇంటి ద్వారా లేదా సముదాయ ఆధారిత శిశుసంరక్షణ ద్వారా చిన్న పిల్లలు వారి కుటుంబాలకు మద్దతు అందివడంలో స్థానిక సముదాయాలు కూడా కీలకపాత్ర పోషిస్తాయి. ఉదాహరణకు కొలంబియాలో హోగేర్స్ కమ్యూనిటేరియోస్ ప్రధాన సంక్షేమ కార్యక్రమంగా మారింది. ఈ కార్యక్రమం పుట్టుక నుంచి 6 ఏళ్ల వయసుగల ఒక మిలియన్ మందికిపైగా పిల్లలకు ప్రయోజనం చేకూరుస్తోంది. పేద కుటుంబాలలో పోషకాహారాన్ని మెరుగుపరిచే ఉద్దేశంతో తొలుత రూపొందించిన ఈ కార్యక్రమంలో ఇప్పుడు పిల్లల సంరక్షణ కూడా భాగమైంది. అర్హులైన కుటుంబాలు కమ్యూనిటీ మదర్‌ను ఎంచుకుంటాయి. ఆమె తన ఇంట్లో 15 మంది వరకు పిల్లలను ఉంచుకుంటుంది. ఈ కార్యక్రమం అతి పేద పిల్లలను చేరి వారికి రోజు భోజనం అందించడం ద్వారా వారి శారీరక పెరుగుదలకు తోడ్పడుతుంది. ఈ కార్యక్రమంలో గతంలో పాల్గొన్న 13 నుండి 17 సంవత్సరాల వయసు పిల్లలు పాఠశాలకు వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వాని చదివిన తరగతినే మళ్లీ చదివే అవకాశాలు తగ్గిపోతాయి.

## బోధనా పద్ధతి, పాఠ్యాంశ ప్రణాళిక: విద్యకు ప్రాథమిక వేదికను సిద్ధం చేయడం

ఇసిసిఇ సాధారణంగా 3 నుండి 6 సంవత్సరాల వయో పరిధిగల పిల్లలకు సెంటర్ ఆధారిత సేవలు అందిస్తుంది. ఈ అనుభవాన్ని సానుకూలంగా మార్చడం చాలా ముఖ్యం. అందుకోసం పిల్లల వయసు, సాంస్కృతిక వాతావరణానికి తగిన ఆచరణలు ఉండేలా చూడాలి. మాతృభాషలో బోధన అత్యంత ప్రభావపూరితమైన మార్గం. అదే సమయంలో సంఘటిత విద్యలో ఎదురయ్యే తొలి అనుభవం సాంప్రదాయ స్త్రీ, పురుష పాత్రలను సవాలుచేసే

అవకాశాన్ని ఇస్తుంది. వివరగా కార్యక్రమాలు కలగలుపుకుపోయేవిగా ఉండి, సాయుధ సంఘర్షణల వంటి పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి. (బాక్స్ 5.1)

ధనిక, వర్ధమాన దేశాలలో జరిపిన పరిశోధనలో నాణ్యతను మెరుగుపరిచేందుకు తీసుకున్న చర్యలన్నీ పిల్లల అభివృద్ధికి తోడ్పడినట్లు తెలుస్తుంది. తరగతి పరిమాణం, ఉద్యోగి-పిల్లల నిష్పత్తివంటి వ్యవస్థాపరమైన అంశాలు బాల్యం ప్రారంభంలోని వాతావరణంలో కీలక అంశాలు అయినప్పటికీ పిల్లల సంక్షేమంపై అతి ముఖ్యమైన ప్రభావాన్ని చూపేది ఉద్యోగులు, పిల్లల మధ్య సంబంధాలేనని, పరిశోధన రుజువు చేసింది.

నాలుగు సంవత్సరాల వయసులో పిల్లలకు ఎదురైన అనుభవం ఏడు సంవత్సరాలకు చేరినప్పుడు వారి అభివృద్ధిపై ఏ విధంగా ప్రభావం చూపుతుందనే దానిపై 17 దేశాలలో ఐఇఎ[7] ప్రి-ప్రైమరీ ప్రాజెక్టు పరిశోధన జరిపింది. ప్రాజెక్టులో పిల్లల ఆసక్తి ఆధారంగా ముందస్తుగా ప్రణాళికీకరించని కార్యకలాపాలలో పాల్గొన్న పిల్లలు ఏడేళ్ల వయసులో తమ తోటి వయసు అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానం నైపుణ్యాలను పెంచేందుకు నిర్వహించిన కార్యకలాపాలలో పాల్గొన్న పిల్లలకంటే భాషా పరిజ్ఞానంలో ఎక్కువ మార్కులు సంపాదించారు. పిల్లలు-పేదరికం బాషాభివృద్ధి ప్రభావం చూపుతుంది. సిబ్బంది మధ్య సంభాషణల ఫ్రీక్వెన్సీ, పిల్లల కార్యక్రమాలలో పెద్దలు పాల్గొనడం, ఉపాధ్యాయుల విద్యాస్థాయి వంటివికూడా ఆ తరువాతి సంవత్సరాలలో పిల్లల భాషా పరిజ్ఞానం అభివృద్ధిపై ప్రభావం చూపాయి.

**పేదరికం భాషాభివృద్ధిని దెబ్బతీస్తుంది**

### *లింగం: స్టీరియోటైపులను సవాలుచేయడం:*

ఏవి పురుష లక్షణాలు, ఏవి స్త్రీల లక్షణాలనే దానిపై బాల్యం ప్రారంభంలోనే అభిప్రాయాలు ఏర్పడతాయి. అనేకసార్లు ఈ వయసు వారికి బోధించే పాఠ్యాంశాలలో లైంగిక సమానత్వం కనబడదు. స్త్రీ, పురుష పాత్రల మధ్య తేడాలను పుస్తకాలు స్పష్టం చేస్తాయి. ఆటలాడేటప్పుడు పిల్లలను తరచుగా సాంప్రదాయ పాత్రలను పోషించమనడం జరుగుతుంది. అలాగే, బాలబాలికలు వినేటప్పుడు, ప్రశ్నలు అడినప్పుడు తమతో సంభాషించేటప్పుడు ఉపాధ్యాయులు వేర్వేరుగా ప్రతిస్పందిస్తారు.

లింగ ఆధార పాత్రలను ప్రశ్నించే విధంగా బాల్యం ప్రారంభపు కార్యక్రమాలు రూపొందించవచ్చు. బోధనా పద్ధతులు, పాఠ్యాంశాలు, ఆటసామాగ్రితో విభిన్న విలువలను ప్రోత్సహించవచ్చు. ప్రి-స్కూల్‌లో లైంగిక సమానత్వాన్ని పెంపొందించే పద్ధతులపై చర్చను ప్రోత్సహించేందుకు స్వీడన్ ఒక ప్రతినిధి బృందాన్ని నెలకొల్పి ప్రత్యామ్నాయ బోధనా పద్ధతులను అభివృద్ధి పరిచేందుకు ముందుకొచ్చిన ప్రి-స్కూల్ సిబ్బందికి నిధులను కూడా అందించింది. టీచర్లు తమ సొంత ఆచరణ వ్యవహారాలలో కూడా లైంగిక సమాన దృక్పథాన్ని కనబరిచేలా శిక్షణ వారిని ఒత్తిడి చేయాలి. బాల్యం ప్రారంభ కార్యక్రమాలలో మరింత మంది పురుషులు పనిచేసేలా ప్రోత్సహించడం కూడా స్త్రీలు మాత్రమే సంరక్షులనే అభిప్రాయాన్ని సవాలు చేయడానికి తోడ్పడుతుంది. తమ పిల్లల పెంపకంలో తండ్రులు మరింతగా పాల్గొనేలా చేస్తుంది.

7. ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ ది ఎవాల్యుయేషన్ ఆఫ్ ఎడ్యుకేషనల్ అఛీవ్‌మెంట్

### బాక్స్ 5.1 : అత్యవసర పరిస్థితులలో నివసించే పిల్లలు: మృదువుగా మానసిక గాయాలను మాన్పడం

ఆఫ్రికా, ఆసియాలలో జరిగే ఆరు సంఘర్షణలలో ఐదు పౌర జనాభాపై నాటకీయ పరిణామాలను కనబరుస్తాయి. ఈ ఘర్షణల వలన తమ తమ దేశాలలోనే 24 మిలియన్ల ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఈ ఘర్షణలు నెమ్మదిగా తక్కువ తీవ్రత గల అంతర్యుద్ధాలుగా మారడం వలన సైన్యాలు తరచు బాలసైనికులపై ఆధారపడే ప్రైవేటు బలగాలను వాడుతున్నాయి. ఈ పిల్లల జీవితాలను సుస్థిరపరచడంకోసం విద్య అవసరం.

ఉత్తర ఇథియోపియాలో అంతర్జాతీయ సహాయ కమిటీ చొరవతో షిమెల్బా శరణార్థుల శిబిరంలో పిల్లల మానసిక గాయాలను మాన్పడాన్ని, వారి సంక్షేమాన్ని ప్రోత్సహిస్తుంది: శిబిరంలోని ఒక ప్రత్యేక ఆవరణలోని స్కూలుకు వెళ్లే వయసురాని పిల్లల కొరకు 'పిల్లల గ్రామాన్ని' హీలింగ్ క్లాస్‌రూం ఇనిషియేటివ్ ప్రారంభించింది. ఫీడింగ్ సెంటర్లు రోజు భోజనం సమకూరుస్తాయి. చిన్న పిల్లలను ఆకట్టుకునేలా తరగతి గదులను అలంకరిస్తారు. పిల్లల ఆసక్తి ప్రకారం చిత్రలేఖనం, సంగీతం, అక్షరాస్యతకు ముందు పాఠాలు నేర్పుతారు. అదే సమయంలో తల్లులకు వృత్తి విద్యాశిక్షణ, వయోజన విద్య అందిస్తారు.

అనేక ఉప-సహారా ఆఫ్రికా దేశాలలో యునిసెఫ్ ఆధ్వర్యంలో నడిచే బాలల సన్నిహిత ప్రాంగణాలలో తల్లీ పిల్లలకు భద్రతాభావాన్ని కల్పించి, సంరక్షణను అందిస్తారు. లైబీరియాలో చిన్న పిల్లలకు తల్లిపాలిచ్చే వాతావరణాన్ని తల్లులకు కల్పిస్తారు. అదేవిధంగా, బాల్య అభివృద్ధి తరగతులలో పరిశుభ్రత, పౌష్టికాహారం, ఆటపాటల ప్రాముఖ్యం వంటి అంశాలను నేర్పుతారు. ఇదేకాక, ఆరోగ్యం, పౌష్టికాహారం, విద్య, నీరు, శుభ్రత, పారిశుధ్యం, చిన్నపిల్లల రక్షణ వంటి సేవలు కూడా అందిస్తారు.

### *చిన్నతనంలో భాషా వికాసానికి తోడ్పాటు*

పిల్లల భాషా వికాసం, చదవగలగడం, పాఠశాలలో బాగా నేర్చుకోవడంవంటి అంశాలపై ప్రారంభదశలో పిల్లలకు పుస్తకాలు చదివి వినిపించడం, ఇంట్లో లభించే పుస్తకాల సంఖ్య వంటి అంశాలు ప్రభావం చూపుతాయని ఎన్నో పరిశోధనలు పదే పదే రుజువు చేశాయి. యునైటెడ్‌కింగ్‌డమ్‌లో ప్రాథమిక పాఠశాలలో పిల్లలు చదవడం నేర్చుకోవడంలో విజయవంతులు కావడానికి ప్రి-స్కూల్ సంవత్సరాలలో వారికి పుస్తకాలతోగల అనుభవం అత్యధిక ప్రభావం చూపించగల అంశం. భాషా వికాసాన్ని పేదరికం కూడా ప్రభావితం చేస్తుంది. అమెరికాలో నాలుగేళ్ల వయసులో పిల్లలు వినే పదాలు వారు ప్రభుత్వం సంక్షేమంపై జీవించే కుటుంబాలకు చెందినవారు లేక కార్మిక వర్గానికి చెందినవారా లేక వృత్తిపరమైన నిపుణుల కుటుంబాలకు చెందినవారా అన్నదానిపై ఆధారపడి వైవిధ్యం కనబరుస్తుంది. మూడేళ్ల వయస్సులో వృత్తినిపుణుల కుటుంబాలకు చెందిన పిల్లలకు ప్రభుత్వ సంక్షేమంతో జీవించే తల్లిదండ్రుల పిల్లలకంటే ఎక్కువ పదాలు తెలుస్తాయి. వివిధ సాంఘిక, ఆర్థిక నేపథ్యాల నుండి ముఖ్యంగా అతిపేద వర్గాల నుండి వచ్చే పిల్లలను బాల్యం ప్రారంభంలోనే భాషా సమృద్ధ వాతావరణాలకు గురిచేయాల్సిన అవశ్యకతను ఇది బలపరుస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మంది పిల్లలు బహుభాషా సమాజాలలో పెరుగుతున్నప్పటికీ, ప్రి-స్కూలు మరియు ప్రాథమిక పాఠశాలల్లో అధికార భాషలోనే విద్యాబోధన జరగడం పరిపాటి. అయితే, ప్రి-స్కూలు నుండి ప్రాథమిక తరగతులలో కొన్ని తరగతుల వరకు అంటే 6-8

సంవత్సరాలపాటు మాతృభాషలో విద్యాభ్యాసం చేసిన పిల్లలు అధికార భాషలో చదువుకున్న వారికంటే బాగా రాణిస్తారు.

ద్విభాషా నమూనాలు చాలా అరుదుగా కనబడతాయి. కొందరు అవి ఖర్చుతో కూడుకున్నవని, వాటిని అమలు చేయడం కష్టతరమని, సామాజిక-రాజకీయ విబేధాలను ప్రోత్సహిస్తాయని అంటారు. అయితే, కాంబోడియా, మలేషియా, మయాన్మార్, పపువాన్యూగినీ, వియత్నాంతోపాటు అనేక దేశాలు బాల్యం ప్రారంభంలో ద్విభాషా కార్యక్రమాలను ప్రభావపూరితంగా రూపొందించి ప్రాథమిక విద్యలో అమలుచేస్తున్నాయి. ప్రపంచంలోనే అత్యంత భాషా వైవిధ్యంగల దేశమైన పపువా నూగినీలో 1970లో తల్లిదండ్రులు, స్థానిక ప్రభుత్వాలు, ఎన్జీఓలతో కలిసి రెండు సంవత్సరాల ప్రి-స్కూల్ కోర్సును స్థానిక భాషలలో రూపొందించారు. 1995లో నియత విద్యావ్యవస్థలోని పాఠశాలలను ప్రాథమిక స్థాయిలోని మొదటి మూడేళ్లు స్థానిక భాషలను వాడి క్రమంగా ఇంగ్లీషుకు మారేలా ప్రభుత్వం ప్రోత్సహించింది. నేడు 350పైగా భాషలను ఆ దేశ విద్యావ్యవస్థలో ఉపయోగిస్తున్నారు.

రెండు భాషలలో కథలు చెప్పడం, ఇతర కార్యకలాపాలను నిర్వహించడం ద్వారా పిల్లల అక్షరాస్యత నైపుణ్యం అభివృద్ధి చేయవచ్చు. అది మరో భాషకు బదిలీ కూడా చేయవచ్చు. బహుభాషా ప్రవీణులైన ఉపాధ్యాయులను నియమించడం కూడా  చక్కటి వ్యూహం. కొత్తగా వలనవచ్చిన తల్లిదండ్రులు, వారి పిల్లలు ఉన్న ప్రాంతాలలోని ప్రి-స్కూళ్లలో ఐరోపా దేశాలు భాషా సహాయకులను నియమిస్తున్నాయి. భాషాపరమైన అల్పసంఖ్యాక వర్గాలకు చెందిన పిల్లల తలిదండ్రులకు అక్కడ లభ్యమయ్యే వివిధ అవకాశాలను గురించి తెలియజేయాలి. మాతృభాష, సంస్కృతిని రక్షించుకోవలసిన ఆవశ్యకతను వారికి తెలియజేయాలి.

## *కలుపుకుపోయే దృక్పధాలు: ప్రత్యేక అవసరాలు, అత్యవసర పరిస్థితులు*

బాల్యంలో అంధత్వం, వినికిడి సమస్యవంటి ఇంద్రియ సమస్యలు అధికంగా ఉండడంవలన ప్రత్యేక అవసరాలు గల పిల్లలో 85% వర్ధమాన దేశాలలోనే ఉన్నారు. ఇంద్రియ సంబంధమైన, ఇతర వైకల్యాలకు సరైన పరీక్షలు జరిపినట్లయితే చిన్న పిల్లలకు వారికి కావలసిన ప్రత్యేక అవసరాలను కల్పించే వీలుంటుంది. ఈ విధమైన ప్రత్యేక అవసరాలుగల పిల్లలో కొందరు ప్రధాన స్రవంతి పాఠశాలలోకి వెళ్లేలా బాల్యం ప్రారంభంలోని కార్యక్రమాలు వీలు కల్పిస్తాయి. బాల్యం ప్రారంభ విద్యలో చిలీ కలుపుకుపోయే దృక్పథాన్ని పాటిస్తుంది. నర్సరీ స్కూళ్ల సిబ్బందికి శిక్షణ, ఉపాధ్యాయులకు సెలసరి బుల్లెటిన్లు, చక్రాల కుర్చీలకు వినికిడి యంత్రాలకు నిధుల ద్వారా చిన్న పిల్లల ప్రత్యేక అవసరాలను తీర్చి వారిని మామూలు పిల్లల కేంద్రాలలోనే చదువుకునేలా చేస్తున్నారు. అంతర్జాతీయ పిల్లల హక్కుల కట్టుబాట్లకు లోబడి అనేక ఒఇసిడి దేశాలు కూడా కలుపుకుపోయే దృక్పథాన్ని ప్రోత్సహిస్తున్నాయి.

## ప్రాథమిక పాఠశాలకు మార్పును సుగమంచేయడం

మంచి నాణ్యమైన ఇసిసిఇనే సర్వంకాదు. ఇఎఫ్ఎ లక్ష్యాలు గుర్తించిన విధంగా తదుపరి విద్యకు అది ముఖ్యమైన పునాది. పిల్లలను శారీరక, సాంఘిక, మేధావికాసాలపరంగా ప్రాథమిక పాఠశాలకు సంసిద్ధం చేయడమేకాక, ప్రాథమిక పాఠశాలలో కూడా ఉన్నతమైన విద్యా సౌకర్యాలు కల్పించేలా చేయడం ఎంతో ముఖ్యం. ఇసిసిఇని ప్రాథమిక విద్యతో మేళవించడం దీనికి ఒక మార్గం.

పిల్లల స్కూలు వ్యవహారాలలో తల్లిదండ్రులను ఉత్సాహంగా భాగస్వాములను చేయడం ద్వారా కంటిన్యుటీని సాధించవచ్చు.

వివిధ భాగాలుగా ప్రారంభ విద్యను విడదీయకుండా ఉండడం, పిల్లల మార్పుకు వీలుకల్పించడం ఈ విధమైన మేళవింపు వెనుకగల ఉద్దేశం. ఇసిసిఇలోని ఆరోగ్యం, సంరక్షణ, విద్య అంశాల మధ్య బలమైన సంబంధాలను నెలకొల్పి వీలైనంతవరకు ఒకే పాలనా వ్యవస్థ అంటే సాధారణంగా విద్యామంత్రిత్వశాఖకే ఇసిసిఇ, ప్రాథమిక బాధ్యతలను అప్పగించడం ఈ దృక్పథంలో భాగం విద్యా వాతావరణంలో మార్పు పిల్లలకు తెలియకుండా అవే పరిస్థితులను కొనసాగించే వీలు దీనివలన కలుగుతుంది. అయితే బాల్యం ప్రారంభ కార్యక్రమాలలో ఆరోగ్యం, సంరక్షణ, సంక్షేమాలతో కూడిన విశాలమైన, సంపూర్ణమైన దృక్పథాన్ని కాదని విద్య లక్ష్యాలపైనే అవసరానికి మించి ప్రాధాన్యాన్ని ఇచ్చే ప్రమాదం దీనిలో ఉంటుంది.

ఇసిసిఇ, ప్రాథమిక పాఠశాల విద్యను ఏకీకృతం చేయడం వలన కలిగే రెండవ లాభం పాఠ్య ప్రణాళికలో కొనసాగింపు. ప్రి-స్కూల్, ప్రాథమిక పాఠశాలలో కొన్ని దేశాలు ఏకీకృత పాఠ్యప్రణాళిక ఉంటుంది. మధ్య, తూర్పు ఐరోపాలోని 30 దేశాలలో స్టెప్ బై స్టెప్ దృక్పథాన్ని పాటిస్తూ, ప్రాథమిక విద్యలో మొదటి నాలుగు తరగతులకు పరీక్షలు నిర్వహించకుండా పిల్లలకు తమ సొంత వేగంతో అభివృద్ధిచెందే అవకాశం కల్పిస్తున్నాయి. జమైకాలో ప్రి-ప్రైమరీ నుండి ప్రైమరీకి మార్పు కూడా ఈ సూత్రాన్నే పాటిస్తుంది. భారతదేశంలో బోధ్ శిక్షా సమితి, కొలంబియాకు చెందిన ఎస్కుయేలా న్యూవా అనే సంస్థలు విద్యార్థుల విభిన్న సామర్థ్యాలు, ఆసక్తులకు తగినట్లుగా వెసులుబాటు కలిగిన పాఠ్యప్రణాళికను, మల్టీగ్రేడ్ తరగతి గదులను వాడుతున్నాయి.

పాకిస్తాన్‌లో పేద గ్రామీణ సమాజాలకు చెందిన తల్లిదండ్రులు స్థానిక పాటలు, కథలు పిల్లలకు నేర్పడంలో సహాయపడతారు. ఫ్రాన్స్‌లో కమ్యూనిటీ మధ్యవర్తులు, తక్కువ ఆదాయంగల ప్రజలు జీవించే ప్రాంతాలలో తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మధ్య సంబంధాలను మెరుగుపరచడంలో సహాయపడతారు. ప్రి-స్కూలు వెళ్లే సౌకర్యంలేని పిల్లలను తాము చేరబోయే ప్రాథమిక పాఠశాలకు ముందుగా తీసుకెళ్లి, అక్కడి వాతావరణానికి అలవాటుచేయడం ద్వారా మార్పును సులభం చేయవచ్చు లేదా స్కూలు ప్రారంభానికి కొన్ని నెలల ముందు చిన్న చిన్న విద్యార్థి బృందాలకు ప్రణాళికీకరించిన ఆటపాటల కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా కూడా దీనిని సాధించవచ్చు.

# భాగం - VI పటిష్టమైన ఇసిసిఇ విధానాలను ప్రోత్సహించడం

పిల్లలు తమ ప్రారంభ సంవత్సరాలలో చక్కటి నాణ్యమైన సంరక్షణ, విద్యావకాశాల ప్రయోజనాన్ని పొందాలంటే ప్రభుత్వాలు ఇతర భాగస్వాములతో కలిసి పటిష్టమైన విధానాలను రూపొందించి అమలుచేయాలి. మూడు కీలకాంశాలపై దృష్టి సారించాలి: పాలన, నాణ్యత, నిధుల సరఫరా-అలాగే ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనే వారిపై ప్రత్యేక శ్రద్ధ, అంతర్జాతీయ దాతృత్వ సంస్థలతో భాగస్వామ్యం కూడా అవసరం.


మెక్సికోలోని చియాపాస్‌లో రోడ్డుపై

© Miquel DEWEVER-PLANA / AGENCE VU



- అనుకూలమైన విధాన వాతావరణాలను సృష్టించడం
- జాతీయ బాల్యం ప్రారంభదశ విధానాలను రూపొందించడం
- అన్ని పరిస్థితులలో నాణ్యతను నియంత్రించడం
- ప్రైవేటు భాగస్వాములను పాల్గొనేలా చేయడం
- అత్యంత అణగారిన, ప్రతికూల పరిస్థితులలో ఉన్నవారిని చేరుకోవడం
- నిధులందించే వ్యూహాలు రూపొందించడం
- అంతర్జాతీయ దాతృత్వ సంస్థలతో భాగస్వామ్యం

## ఆశాజనక సంకేతాలు

వర్ధమాన దేశాలు ఇఎఫ్ఎ లక్ష్యాలన్నింటిలో బాల్యం ప్రారంభదశలో విధానాలపై పరిమిత దృష్టి సారించి, ప్రాథమిక విద్య, లైంగిక సమానత్వాలపై అధిక దృష్టి పెట్టాయి. 8 ఏళ్ల మరియు అంతకంటే చిన్న వయసు పిల్లల ఆరోగ్యం, విద్య, పౌష్టికాహారంతో కూడిన సంపూర్ణ దృక్పథాలను కొన్ని దేశాలు మాత్రమే పాటిస్తున్నాయని 45 దేశాల విధాన పత్రాల సమీక్ష తెలిపింది. జాతీయ ఇసిసిఇ విధానం కొరవడినట్లయితే అణగారిన, ప్రతికూల పరిస్థితులలో ఉన్న, వికలాంగ పిల్లలకు నిజంగా ఒక చక్కటి అవకాశం లోపించినట్లే. ఇసిసిఇ సాధారణంగా 3 మరియు ఆపై వయసుగల పిల్లలపై దృష్టిసారిస్తుంది కాబట్టి చిన్న పిల్లలకు కూడా అవకాశాలు చేజారినట్లే.

అయితే కొన్ని ఆశాజనక సంకేతాలు కనబడుతున్నాయి. ఇసిసిఇ వలన కలిగే ప్రయోజనాలతోపాటు విద్యావ్యవస్థ ప్రారంభ దశలో ముఖ్యమైన భాగంగా దానిని గుర్తిస్తూ ఎన్నో పరిశోధనలు జరిగాయి. అదేవిధంగా, అంతర్జాతీయ ఇసిసిఇ నెట్‌వర్క్‌లు బలపడి దానికి అనుకూలమైన విధాన రూపకల్పనకు తోడ్పడుతున్నాయి. ఆరోగ్యం, పౌష్టికాహారం, విద్య, నీరు, పరిశుభ్రత, పారిశుద్ధ్యం, చిన్న పిల్లలకు చట్టపరమైన రక్షణ వంటి అంశాలనన్నింటినీ కూడగలుపుతూ జాతీయ ఇసిసిఇ సమగ్ర విధానాలను ప్రభుత్వాలు రూపొందిస్తున్నాయి. జాతీయ విజన్ ప్రకటనలో వివిధ రంగాల బాధ్యతలు, నిధులు సమకూర్చే కట్టుబాట్లు స్పష్టం చేయవచ్చు. ఈ విధానాలను ఏ విధంగా అమలు చేయాలో తెలిపేందుకు చట్టాలు రూపొందించాలి.

## *ఇసిసిఇకి రాజకీయ మద్దతు కూడగట్టడమెలా?*

రోజురోజుకు ఇసిసిఇ పెరుగుతున్న ప్రాధాన్యతను అనేక కారణాలు ఉన్నాయి.

- ***ఉన్నత స్థాయి రాజకీయ మద్దతు*** వలన ఇసిసిఇ ఎజెండాలోకి చేరవచ్చు. ఇటీవలి సంవత్సరాలలో చిలీ, జమైకా, జోర్డాన్, సెనెగల్, థాయ్‌లాండ్, వియత్నాం వంటి దేశాలలో రాజకీయ నాయకులు బాల్యం ప్రారంభదశలో కార్యక్రమాలను జాతీయ ప్రాధాన్యంగల అంశాలుగా గుర్తించడంవలన కొత్త జాతీయ విధానాలు రూపొందించబడి ఈ రంగానికి కేటాయింపులు పెరిగి నాణ్యతపై దృష్టిసారించారు.
- ***భాగస్వాములు పాల్గొనడం*** వల్ల, యాజమాన్య భావన ఏకాభిప్రాయం ఏర్పడతాయి (ఉదా ఘనా) తల్లిదండ్రులు ఈ కార్యక్రమాలలో పాల్గొనేలా చేయడంవల్ల ఇసిసిఇ కార్యక్రమాలకు స్థానిక సముదాయపు మద్దతు సమకూరుతుంది.
- అంతర్జాతీయ సంస్థలు, దాతృత్వ సంస్థలు, ఎన్జీఓలతో ***ప్రభుత్వం భాగస్వామ్యం*** నెలకొల్పడం వలన వివిధ ప్రాజెక్టులకు గణనీయమైన రీతిలో సీడ్‌మనీ, సాంకేతిక సహాయం లభిస్తాయి.
- **ఇసిసిఇ విధానాలను ఇతర జాతీయ, ఆయా రంగాల అభివృద్ధి విధానాలతో వ్యూహాత్మకంగా జోడించడం** వలన ఇసిసిఇ కోసం అధిక వనరులు సమకూరుతాయి. అలాగే ఇసిసిఇ ఏకీకరణ జరుగుతుంది. ఘనా, ఉగాండా, జాంబియా తమ బాల్యం ప్రారంభ కార్యక్రమాలను పిఆర్ఎస్పీలతో జోడించాయి.
- **సవివరమైన కార్యాచరణ ప్రణాళిక** రూపొందించడం వలన ఇసిసిఇ విధానాన్ని అమలుచేయడంలో వివిధ బాధ్యతలను పంచుకోవడం, నిధుల కేటాయింపు, కాల పరిమితులను నిర్ణయించడం వీలవుతుంది.
- మిడియా ప్రచారం ద్వారా ఇసిసి పట్ల ప్రజల దృష్టిని ఆకర్షించవచ్చు. తద్వారా ప్రజలలో శిశు సంరక్షణపై అవగాహన పెంచవచ్చు. ఉదాహరణకు, నవ జాతశిశువులపట్ల తీసుకోవలసిన జాగ్రత్త, తల్లిపాల ప్రాముఖ్యత, పిల్లలకు చదివి వినిపించడం వలన లాభాలు, తండ్రుల పాత్ర వంటి అంశాలపై జ్ఞానాన్ని ప్రజలకు పంచవచ్చు.

ఎవరు నేతృత్వం స్వీకరించాలి? ఇసిసిఇలో అనేక రంగాలు, కార్యక్రమాలు, భాగస్వాములు ఉండడం వలన సమన్వయం తరచు సమస్యగా మారుతుంది

## పాలనా సమస్యలు

***ఎవరు నేతృత్వం స్వీకరిస్తారు?*** ఇసిసిఇలో బహుళ రంగాలు, కార్యక్రమాలు, భాగస్వాములు ఉండడం వలన సమన్వయం తరచుగా సమస్యగా మారుతుంది. అనేక దేశాలు ముఖ్యంగా ఐరోపా, లాటిన్ అమెరికాలలోని దేశాలు విద్యా వ్యవస్థలో భాగంగా ఒకటి లేదా రెండు సంవత్సరాల ప్రి-ప్రైమరీ విద్యను అందిస్తాయి. అయితే ఇతర రకాల ఇసిసిఇ ముఖ్యంగా 3 ఏళ్ల లోపు పిల్లల కొరకు కార్యక్రమాలు ఆరోగ్యం, సాంఘిక సంక్షేమం, పిల్లలు, మహిళా వ్యవహారాలు మొదలైన మంత్రిత్వశాఖల ఆధ్వర్యంలోకి వస్తాయి. బహుళ భాగస్వాములు ఉండడం వలన విభిన్న రంగాలలో నైపుణ్యాలు గల ఏజెన్సీలు ఒక్క చోటికి తీసుకురాబడతాయి. ఇది మంత్రిత్వశాఖల మధ్య ఘర్షణకు దారితీయవచ్చు. కొన్ని దేశాలలో ఏ ఒక్క పాలనా సంస్థ కూడా ఇసిసిఇ ప్రధాన బాధ్యత స్వీకరించడం లేదు. దానితో అది నిర్లక్ష్యానికి గురయ్యే అవకాశం ఉంది.

**కనీస ఆమోదిత ప్రమాణాలు పిల్లలందరికీ లభించేలా ప్రభుత్వాలు చూడాలి**

సమాచారం 172 దేశాలలో లభిస్తోన్న దాదాపు 60% వాటిలో మంత్రిత్వశాఖలే -సాధారణంగా విద్యామంత్రిత్వశాఖే 3 ఏళ్ల వయసుకుపైగా పిల్లలు లక్ష్యంగా గల కార్యక్రమాలను పర్యవేక్షించడం లేదా సమన్వయపరచడం చేస్తోంది. 30% దేశాలలో ఈ విధిని జాతీయ సంస్థ లేదా దిగువ స్థాయి సంస్థల వంటి అధికార సంస్థలతో పంచుకుంటోంది. మిగిలిన 10% దేశాలలో బాల్యం ప్రారంభ దశలో కార్యక్రమాలు ప్రభుత్వేతర సంస్థల పర్యవేక్షణలో నడుస్తున్నాయి.

బాల్యం ప్రారంభదశలో పాలనా బాధ్యత అత్యధిక దేశాలలో వయోగ్రూపును బట్టి విభజింపబడినా, 1980ల ఆఖరి నుండి అనేక దేశాలు (బ్రెజిల్, చిలీ, జమైకా, ఖజకిస్తాన్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, స్పెయిన్, వియత్నాంతోపాటు) పిల్లల పుట్టుకనుండి వ్యవహారాల పర్యవేక్షణకు విద్యామంత్రిత్వశాఖనే ప్రధాన మంత్రిత్వశాఖగా గుర్తించాయి. బాల్యం ప్రారంభదశలో వ్యవహారాలను విద్యామంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఉంచడం వలన చిన్న పిల్లల చదువు, ప్రైమరీ స్కూలుకు వారి మార్పుపై అధిక దృష్టి సారించడం సులువవుతుంది. అయితే, తరచుగా ప్రి-స్కూలు విద్య నిర్బంధితమైనది కాకపోవడంవల్ల దానిపై దృష్టిసారింపు, నిధులకోసం విద్యాశాఖ అధికారుల మధ్య పోరాడవలసి రావచ్చు. మరొక ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే ఇసిసిఇని మరింత లాంఛన పూర్వకంగా, పాఠశాలవలె తీర్చిదిద్దాలన్న ఒత్తిడి రావచ్చు.

ఎవరు నేతృత్వం వహిస్తారన్న దానితో ప్రమేయం లేకుండా, పాల్గొనే సంస్థలు, రంగాల మధ్య సమన్వయం అవసరం. వనరులు, ప్రమాణాలు, నియంత్రణలు, శిక్షణ, సిబ్బందిని కలిపి ఒక సామాన్య దృక్పథాన్ని సాధించేందుకు సమన్వయ యంత్రాంగం ఒక వేదికను సమకూరుస్తుంది.

సమన్వయ పరిచే సంస్థలు చాలా తరచుగా సిబ్బంది కొరతను కలిగిఉండి, కేవలం సలహా సంస్థలుగా పనిచేస్తూ తమ సామర్థ్యాన్ని చిన్నపిల్లలకోసం ఎజెండాను ముందుకు నడిపించడానికే పరిమితం చేస్తాయి. ఈ విషయంలో దక్షిణాఫ్రికా భిన్నంగా ఉంది. దాని జాతీయ సమన్వయ సంఘంలో అనేక మంత్రిత్వశాఖలు, శిక్షణా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, ఎన్జీఓల ప్రతినిధులు ఉన్నారు. 5 ఏళ్ల 6 ఏళ్ల వయసుగల అందరు పిల్లలకోసం ప్రి-ప్రైమరీ కార్యక్రమాలను రూపొందించడంలో ఇది కీలకపాత్ర పోషించింది.

ఇసిసిఇ సేవలు, వనరులు సముదాయాల అవసరాలకు, పరిస్థితులకు అనుగుణంగా ఉండేలా దానిని వికేంద్రీకరించాలన్న వాదనలు తరచుగా చేస్తుంటారు. ఆచరణలో ఇది విధాన అమలు, అందుబాటు, నాణ్యతలలో అసమానతలకు దారితీయవచ్చు. మార్పుచెందుతున్న అనేక దేశాలలో 1990లలో వికేంద్రీకరణ వలన వట్టణ ధనిక, గ్రామీణ పేద సముదాయాల మధ్య అసమానతలు తలెత్తి కిండర్‌గార్టెన్ల అమలు నాణ్యత, దెబ్బతిన్నాయి.

అప్పటి నుండి వికేంద్రీకరణతోపాటు కేంద్ర ప్రభుత్వ నిఘా, నియంత్రణ ఉండాలని గుర్తించడం జరిగింది. ఉదాహరణకు స్వీడన్‌లో 1990లలో ఫీజు డిరెగ్యులేషన్ వల్ల భారీ తేడాలు తలెత్తడంతో ప్రి-స్కూళ్లకు గరిష్ఠ ఫీజును, కొత్త పాఠ్యాంశ ప్రణాళిక ఫ్రేమ్‌వర్క్‌ను ప్రవేశపెట్టారు.

### *ప్రధాన భాగస్వాములుగా ప్రైవేటు పాత్రధారులు*

సముదాయ ఆధారిత గ్రూపులు, ఎన్జీఓలు. విశ్వాసం ఆధారిత సంస్థలు, లాభాపేక్షగల సంస్థలవంటి ప్రభుత్వేతర భాగస్వాములు అనేక దేశాలలో ఇసిసిఇలో భారీ పాత్ర పోషిస్తున్నాయి. విశ్వాసం ఆధారిత సంస్థలు ఐరోపా, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, అరబ్బు దేశాలలోని కొన్ని ప్రాంతాలలో చురుగ్గా పనిచేస్తున్నాయి.

డేటా కలిగి ఉన్న 154 దేశాలలో సగం దేశాలలో మొత్తం దాఖలులో ప్రైవేటు సంస్థలలో దాఖలు 1/3 కన్నా తక్కువగా ఉంది. 2/3 వంతు దేశాలలో ప్రైవేటురంగంలో దాఖలు మొత్తం ఎన్‌రోల్‌మెంట్‌లో 2/3 వంతులేదా అంతకుమించి ఉంది. ఉప-సహారా ఆఫ్రికా, అరబ్ దేశాలు, కరీబియన్, తూర్పు ఆసియాలలో ప్రైవేటు రంగం ఎక్కువగా కనబడుతుంది. అనేక ఐరోపా దేశాలలో ఇసిసిఇ అభివృద్ధిలో ప్రభుత్వ కేటాయింపు అంతర్భాగంగా ఉంది. మార్పు చెందుతున్న అనేక దేశాలలో ప్రభుత్వం వెనక్కి తగ్గినచోటు ప్రైవేటు రంగం అడుగుపెట్టి వినూత్న పద్ధతులతోపాటు అందుబాటులో అసమానతలకు కూడా దారితీసింది.

లాభాపేక్షగల పాత్రధారుల పాత్ర వివాదాస్పదంగా ఉంది. దీనిని సమర్థించేవారు ఇవి పోటీని పెంచి, తల్లిదండ్రులకు ప్రత్యామ్నాయం అందిస్తాయని అంటారు. విమర్శకులు ప్రభుత్వ వ్యవస్థకు వెలుపల పనిచేసే ప్రైవేటుగా సేవలందించేవారు అధిక ఫీజులు, ప్రవేశార్హతల ద్వారా తరచుగా పేద పిల్లలను మినహాయిస్తారని అంటుంటారు. టు-ట్రాక్-సిస్టం వల్ల ఒక ప్రమాదం ఉంది. తక్కువ ఆదాయంగల తల్లిదండ్రులు తక్కువ ఖర్చుతో కూడిన, నాణ్యతలేని ప్రభుత్వ ప్రత్యామ్నాయాలను ఆశ్రయిస్తారు. దీనిని నివారించడంకోసం ప్రభుత్వాలు మరింత ప్రొయాక్టివ్ పాత్ర పోషించి, నియంత్రణ నాణ్యత హామీ, పర్యవేక్షణ, సమానత్వాలను ప్రోత్సహించడంకోసం అందురు ఆమోదించిన ఫ్రేమ్‌వర్క్ రూపొందించాలి.

## నాణ్యతను మెరుగుపరచడం

కార్యక్రమాలను అందించే వారందరికీ-ప్రైవేటు లేదా, ప్రభుత్వ రంగాలకు ఈ నిబంధనలు వర్తించాలి. అనేక ప్రభుత్వాలు తరగతి పరిమాణం, సిబ్బంది-పిల్లల నిష్పత్తి, సామాగ్రి లభ్యత, సిబ్బంది

శిక్షణవంటి సులువుగా కొలవగల నాణ్యతా సూచికలను ఉపయోగించి ఇసిసిఇ కార్యక్రమాలను నియంత్రిస్తున్నాయి. దానితోపాటుగా సంరక్షుడు-శిశువు సంబంధాలు, కుటుంబాలను కలుపుకుపోవడం, సాంస్కృతిక వైవిధ్యం, ప్రత్యేక అవసరాలు గల పిల్లల పట్ల ప్రతిస్పందన కూడా ముఖ్యం.

ఐదు దక్షిణ అమెరికా దేశాలు ఇసిసిఇ కొరకు జాతీయ నాణ్యతా ప్రమాణాలు రూపొందించాయి. ఏడు కరీబియన్ దేశాలు నేర్చుకునే వాతావరణం, సంరక్షకుడు-శిశువు సంభాషణలను కొలిచే ఒక సాధారణ పరికరాన్ని ఉపయోగించి కార్యక్రమాన్ని సమీక్షించాయి. కొన్ని దేశాలలో పిల్లలు ఏం తెలుసుకోవాలి, వారేం చేయగలరు అనే దానిపై జాతి ఆకాంక్షల ఆధారంగా బాల్యంలో నేర్చుకోవడం, అభివృద్ధిపై ప్రమాణాలను కలిగిఉన్నాయి. ప్రమాణాలను శ్రద్ధగా రూపొందించి జాగ్రత్తగా ఉపయోగించాలి. జాతీయస్థాయిలో రూపొందించడం వలన అవి సాంస్కృతిక, భాషాపరమైన, ఇతర రకాల వైవిధ్యాన్ని పరిగణలోనికి తీసుకోకపోవచ్చు. దుర్వినియోగం చేసినట్లయితే అవి పిల్లలను వివక్షకు గురిచేయవచ్చు. వారిపై ఫెయిల్యూర్‌లుగా, స్కూలుకు వెళ్లడానికి సిద్ధంగా లేనివారిగా ముద్రగావేయవచ్చు.

### *సిబ్బంది విధానాల ద్వారా నాణ్యతను ప్రోత్సహించడం*

పిల్లలు తమ సంరక్షకులు, టీచర్లతో ఏ విధంగా ఇంటర్‌యాక్ట్ అవుతున్నారనేది విద్య నాణ్యతను పెద్ద ఎత్తున నిర్దేశిస్తుంది. అనేక పారిశ్రామిక దేశాలు పుట్టుక నుండి పాఠశాల ప్రవేశం వరకు ఇసిసిఇ కార్యక్రమాల సమీకృత వ్యవస్థను ఏర్పాటుచేసే దిశగా సాగుతున్నాయి. ఇందుకోసం సిబ్బంది అర్హతలు, శిక్షణను పునర్వ్యవస్థీకరించి, విద్య, ఇసిసిఇ సంరక్షణాంశాల మధ్య గల అంతరాన్ని పూడ్చడానికి అవి కృషిచేస్తున్నాయి. ఉదాహరణకు సింగపూర్‌లో శిశు సంరక్షణ, ప్రి-స్కూల్ సిబ్బంది ప్రస్తుతం ఒకే రకమైన శిక్షణ, గుర్తింపు పొందుతున్నారు.

కీలక సమస్యఏమిటంటే, ఎక్కువ సంఖ్యలో ఇసిసిఇ సిబ్బందిని చేర్చుకొని, అట్టేపెట్టుకోవడం. ఎక్కువ మంది అభ్యర్థులను ఈ రంగంలోకి రప్పించేందుకు కొన్ని దేశాలు ఉన్నత విద్య మరియు అధ్యాపకుల శిక్షణలోకి పట్టువిడుపులుగల కొత్త ప్రవేశ మార్గాలను అభివృద్ధి పరుస్తున్నాయి. కొన్ని కరేబియన్ దీవులు, సామర్థ్యత ఆధారమైన క్రెడిట్ ఇస్తున్నాయి. ఉదాహరణకి ఎర్లీ చైల్డ్ డెవలప్మెంట్ వర్చువల్ యూనివర్సిటీ అన్నది ఆఫ్రికా మరియు మధ్యప్రాంతంలో ఈ రంగంలో నాయకత్వపు మరియు అభివృద్ధి అవసరాలను తీర్చడంలో సహాయపడేందుకు ఉద్దేశించిన శిక్షణ మరియు సామర్థ్యపు పెంపుదల ముందు చొరవ. సర్వీస్‌లో ఉన్న ప్రారంభ బాల్యపు సిబ్బంది అయిన విద్యార్థులకు, ప్రపంచం అంతటికి చెందిన అధ్యాపక సభ్యులు బోధించి, ప్రతిదేశంలోను, లేదా ప్రాంతంలోను సలహాలిచ్చి నడిపించే వారితో (మెంటర్స్) కలిసి పనిచేస్తారు.

బాల్యం ప్రారంభదశలో కార్యక్రమాల నుండి ప్రాథమిక పాఠశాలకు మార్పును సులభతరం చేయడం కోసం రెండుస్థాయిల మధ్య ప్రొఫెషనల్ కంటిన్యుటీ ఉండేలా అనేక దేశాలు చర్యలు ప్రవేశపెడుతున్నాయి. వీటిలో సమిష్టి శిక్షణ (ఫ్రాన్స్, ఐర్లాండ్, జమైకా, యునైటెడ్ కింగ్‌డమ్), యాక్టివ్ లర్నింగ్ దృక్పధాలకు ప్రాధాన్యత, ఇసిసిఇ, ప్రైమరీ స్కూలు టీచర్లకు సమానమైన ప్రొఫెషనల్ హోదా ఉన్నాయి.

## సరిపోను నిధులు లభించేలా చూడడం

ఇసిసిఇని విస్తరించి, మెరుగుపరచడంకోసం ప్రభుత్వ, ప్రైవేటు నిధులను అదనంగా సమీకరించి, వాటిని మరింత సమర్థవంతమైన నిధులందించే యంత్రాంగాల ద్వారా కేటాయించాలి. పరిస్థితులలో వైవిధ్యం కారణంగా, ఇసిసిఇ విస్తరణ, మెరుగుపరచుటకు అయ్యే ఖర్చులు విశ్వ అంచనాల ప్రకారం కాకుండా ఆయా దేశాన్ని బట్టి ఉన్నట్లయితే విధానాలకు అనుగుణంగా ఉంటాయి. డేటా కలిగిన 79 దేశాలలో 65 దేశాలు 2004లో విద్యకు చేసిన వ్యయంలో 10% కంటే తక్కువ ఖర్చును ఇసిసిఇకి కేటాయించాయి. 65 దేశాలలో సగానికి పైగా దేశాలు 5% కన్నా తక్కువ కేటాయించాయి. 10% నికి పైగా కేటాయించిన 14 దేశాలలో చాలా దేశాలు ఐరోపాలో ఉన్నాయి.

జిఎన్‌పిలో వాటాగా, ప్రైమరీ విద్యపై ప్రభుత్వ వ్యయం 0.4% ఉన్న ఉత్తర అమెరికా, పశ్చిమ ఐరోపా, 0.2% ఉన్న దక్షిణ అమెరికాలతో పోలిస్తే మధ్య, తూర్పు ఐరోపాలో (0.5%) అత్యధికంగా ఉంది. ఉత్తర అమెరికా, మొత్తం పశ్చిమ ఐరోపాలు ప్రాథమిక విద్య మొత్తం ఖర్చులో దాదాపు 26% ప్రి-ప్రైమరీ కార్యక్రమాలపై ఖర్చు చేస్తున్నాయి. ఫ్రాన్స్, జర్మనీలలో ఈ వాటా కాస్త ఎక్కువగా 60% గా ఉంది. దక్షిణ అమెరికా, కరీబియన్ దేశాలలో ప్రైమరీ విద్య వ్యయంలో 14% ప్రి-ప్రైమరీ కార్యక్రమాలపై ఖర్చు పెడుతున్నారు. ఈ దేశాలలో ఈ వ్యయంలో చాలా తేడాలు ఉన్నాయి.

మొత్తం విద్యపై చేసే ఖర్చులో ప్రి-ప్రైమరీ విద్యకు తక్కువ వాటా దానికన్నా ముఖ్యంగా కేటాయించడం వలన ఒక్కొక్క శిశువుపై ఖర్చు తక్కువుగా ఉండడంతోపాటు ఎన్‌రోల్‌మెంట్ నిష్పత్తులు తగ్గిపోతాయి. డేటా కలిగిన అన్ని దేశాలలో ఇది ప్రైమరీ స్థాయిలో ఒకొక్క శిశువుపై చేసే ప్రభుత్వ ఖర్చులో 85% ఉంది. అయితే, ప్రి-ప్రైమరీ విద్య మొత్తం ఖర్చును మధ్య, తూర్పు ఐరోపాలోని సోషలిస్టు దేశాలలోవలె ప్రభుత్వమే భరించినప్పుడు యూనిట్ ఖర్చులు ప్రైమరీ విద్య కన్నా ప్రి-ప్రైమరీ విద్య ఖర్చు 25% ఎక్కువగా ఉంది ఉత్తర అమెరికా, పశ్చిమ ఐరోపా, దక్షిణ అమెరికా, కరీబియనవలో ప్రీ-ప్రైమరీ విద్యకు విద్యార్థికి సగటు ప్రభుత్వ వ్యయం ప్రైమరీకి అయ్యే ఖర్చులో 70% ఉంది. (ఫ్రాన్స్, జర్మనీ, గ్రీస్‌లలో ఇది 90% ఉంది.)

ఇసిసిఇకి నిధులు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలనుండి లభిస్తున్నాయి. ప్రభుత్వ నిధులను తరచుగా ఒక స్థాయికన్నా ఎక్కువ ప్రభుత్వాలు సమకూరుస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు నిధుల తులనాత్మక వాటాలలో గణనీయమైన తేడాలుంటాయి. ఉదాహరణకు ఒఇసిడి దేశాలలో తల్లిదండ్రుల వాటా అమెరికాలో మొత్తంలో 60% ఉండగా, స్వీడన్, ఫ్రాన్స్‌లలో 20% ఉంది. వర్ధమాన దేశాలలో ఈ తేడాలు అధికంగా ఉన్నాయి. ఇండోనేషియాలో ఇసిసిఇని ప్రధానంగా కుటుంబ బాధ్యతగా పరిగణిస్తారు. అందుకే అక్కడ ప్రభుత్వ నిధులు మొత్తం వ్యయంలో 5% మించవు. ఈ నిధులను ప్రైవేటుగా నడిచే పట్టణ శిశు సంరక్షణ కేంద్రాలకు రాయితీగా ఇస్తారు. క్యూబాలో ప్రభుత్వం 100% నిధులు అందిస్తుంది.

చిలీ, అమెరికా, తైవాన్ (చైనా) ఇసిసిఇ కార్యక్రమాలకు నేరుగా నిధులందించేందుకు ప్రత్యామ్నాయ పద్ధతిని పాటిస్తున్నాయి. ఈ దేశాలలో ప్రభుత్వాలు ఇచ్చే వనరులతో (వోచర్లు) తల్లిదండ్రులు

**ఇసిసిఇని విస్తరించడం, మెరుగుపరచడం కోసం అదనపు ప్రభుత్వ, ప్రైవేటు నిధులు సేకరించాలి**

వివిధ సేవలందించే వారి దగ్గర నుంచి సేవలు కొనుగోలుచేస్తున్నారు. ఫ్రాన్స్‌లో ఆర్థిక, సాంఘిక భద్రతా వ్యవస్థలు కుటుంబాల శిశు సంరక్షణ ఖర్చులను తీరుస్తున్నాయి.

## అణగారిన, ప్రతికూల పరిస్థితులలో ఉన్న పిల్లలను లక్ష్యంగా చేసుకోవడం

ఇసిసిఇ కార్యక్రమాలు అణగారిన, ప్రతికూల పరిస్థితులలో ఉన్న పిల్లలకు అత్యధికంగా ప్రయోజనం చేకూరుస్తాయి. అయితే ఈ పిల్లలకు ఈ సేవలు అందే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. దేశాలవద్ద నిధులు పరిమితంగా ఉన్నప్పుడు అత్యధికంగా అవసరమైన వారికి చేరేలా వాటిని ఎలా కేటాయించాలి? లక్ష్యాలను చేరుకునేందుకు రెండు రకాల పద్ధతులను ఉపయోగిస్తారు: భౌగోళికం, ఆదాయాన్నిబట్టి. దీనికి తోడు కలుపుకుపోయే విధానాలు వికలాంగులు, భాషా, జాతిపరమైన అల్ప సంఖ్యాకులవంటి ప్రత్యేక వర్గాలను లక్ష్యంగా కలిగి ఉంటాయి.

దాతలు తాము ప్రాథమిక విద్యకు ఇచ్చే సహాయంలో 10% కన్నా తక్కువను ప్రి-ప్రైమరీ స్థాయికి ఇస్తున్నారు

భారతదేశపు సమీకృత శిశు అభివృద్ధి సేవలలో భౌగోళిక లక్ష్య పద్ధతిని పాటిస్తున్నారు. ఇది మారుమూల గ్రామీణ ప్రాంతాలు, పట్టణ మురికి వాడలు, గిరిజన ప్రాంతాలపై దృష్టిసారిస్తూ 23 మిలియన్ల మందికి పైగా పిల్లలను చేరుకుంది. పౌష్టికాహారం, రోగనిరోధక టీకాలు, హెల్త్ చెకప్‌లు, రెఫరల్ సేవలు, 6 ఏళ్లలోపు పిల్లలకు విద్య, గర్భిణి, పాలిచ్చే తల్లులకు సమీకృత ప్యాకేజీద్వారా చిన్న పిల్లల మనుగడ, పెరుగుదల, అభివృద్ధిలపై సానుకూల ప్రభావం చూపుతోంది. వియత్నాం మారుమూల కొండప్రాంతాలపై దృష్టిసారించింది. కెన్యా పాస్టోరలిస్ట్ (పశుపాలన ద్వారా జీవించేవారు) సముదాయాలను లక్ష్యంగా కలిగి ఉంది. (బాక్స్ 6.1). ఆదాయాలను ఆధారంగా లక్ష్యాలను చేసుకోవడం ఎక్కువగా వాడుకలో ఉంది. దీనిలో అర్హతలను పరిమితంచేయడం, పేదలకు ఎన్‌రోల్‌మెంట్‌కు సబ్సిడీ ఇవ్వడం, వోచర్లను అందించడం వంటివి ఉన్నాయి.

### బాక్స్ 6.1 : కెన్యాలో పాస్టొరలిస్ట్ సముదాయాలలో శిశు సంరక్షణ

సార్వత్రిక ఉచిత ప్రైమరీ విద్యా విధానం అనే జాతీయ విధానం కెన్యాలో ఉత్తరాన నివసించే పాస్టొరలిస్ట్ సముదాయాలను ఒక చోట స్థిరపడేలా ఒత్తిడి సృష్టించింది. లోయిపి-స్థానిక భాషలో దీనికి అర్థం నీడ-ఒకప్పుడు అమ్మమ్మలు, నానమ్మలు పిల్లలను ఒకచోట చూసుకుంటూ వారికి సాంప్రదాయాలను, నైపుణ్యాలను నోటిమాట ద్వారా చెప్పేవారు. 1997 నుండి అనేక మంది పాస్టొరలిస్ట్ ప్రజలు 2 నండి 5 సంవత్సరాల పిల్లల సంరక్షణకోసం చందాలు వేసుకుని నిధులు సమకూర్చారు. ప్రొఫెషనల్ మార్గదర్శకత్వం, ఆర్థిక సహాయం ద్వారా పిల్లలకు సంరక్షణ అందించేందుకు చేపట్టిన లోయిపి కార్యక్రమం ఇప్పుడు 5200 మందికి అందుబాటులో ఉంది. పిల్లల పెంపకంలో సాంప్రదాయ పద్ధతులలో వెళ్లాలనుకున్న ఈ కార్యక్రమం వారికి ఆరోగ్యం, పౌష్టికాహార సేవలను అందించి ఆదాయకల్పనకు తోడ్పడుతూ, ఆడపిల్లలకు సున్తీవంటి ప్రమాదకర ఆచారం గురించి సమాచారం అందిస్తుంది. ఈ కార్యక్రమం నిర్వహణకు స్థలాలు, ఆటసామాగ్రిని సముదాయాలు సమకూరుస్తున్నాయి. ఈ కార్యక్రమం ఫలితంగా రోగనిరోధక టీకా కార్యక్రమాలు ఎక్కువ మంది ఉపయోగించుకుంటున్నారు. పిల్లలకు మెరుగైన పౌష్టికాహారం లభిస్తోంది. ప్రైమరీ స్కూలు మార్పుపై కూడా ఇది సానుకూల ప్రభావం చూపుతోందని ప్రి-స్కూల్ టీచర్లు అంటున్నారు.

ఇతర ప్రభుత్వ సేవల మాదిరిగానే ఇసిసిఇ లక్ష్యిత దృక్పథాలు కూడా తగినంత రాజకీయ మద్దతు కూడగట్టుకోకపోయే ప్రమాదం ఉంది. లక్ష్యంగా చేసుకునే పద్ధతి వలన పిల్లలలో వర్గాలు ఏర్పడవచ్చు, కార్యక్రమాలలో బలహీన వర్గాల పిల్లల సంఖ్యే అధికంగా ఉండవచ్చు. ఖచ్చితమైన లక్ష్యాలను చేరే ప్రయత్నం చేయడం కష్టమైనది. పిల్లలందరికీ సేవలందిస్తున్నప్పటికీ, బలహీన వర్గాల సముదాయాలపై అధిక వనరులను కేంద్రీకరించే ప్రభుత్వ ఆధ్వర్యంలోని లక్ష్యిత కార్యక్రమాలను అనేక అభివృద్ధిచెందిన దేశాలు చేపట్టాయి. అత్యధిక మంది పిల్లలు ఇసిసిఇ సేవల నుండి మినహాయింపబడడం వలన ఈ దృక్పథం వర్ధమానదేశాలలో అనేక దేశాలకు ఎక్కువగా వర్తించదు. దశలవారీ దృక్పథం ఎక్కువ ఆచరణాత్మకం కావచ్చు. దేశాలు జాతీయ ఇసిసిఇ విధానాన్ని పిల్లలందరికీ అన్ని రకాల పరిస్థితులకు సరిపోయేలా రూపొందించి ఆచరణలో ప్రారంభంలో మాత్రం అత్యధిక ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనే వారిపై ప్రభుత్వ వనరులను కేంద్రీకరించాలి.

## బాల్యం ప్రారంభ కార్యక్రమాలకోసం విదేశీ సహాయ విధానాలు

అభివృద్ధి రంగంలో విదేశీ విరాళాలు ఇచ్చేవారు ఇసిసిఇకి ప్రాధాన్యాన్ని ఇవ్వడంలేదు. అరవై ఎనిమిది దాతలపై సర్వేజరపగా ప్రతిస్పందించిన 17 సంస్థలలో నాలుగు మాత్రమే ఇసిసిఇని సంపూర్ణ సహాయ వ్యూహంలో ఒక ప్రత్యేకాంశంగా గుర్తించాయి; ఇతర సంస్థలు బాల్యం ప్రారంభ దశను అటు విద్యారంగంలోనో లేక ఆరోగ్యరంగ వ్యూహాలలోనో భాగంగా చూశాయి. మూడు నుండి ప్రాథమిక పాఠశాల వయసుగల పిల్లలకు వర్తించే కేంద్రం ఆధారిత ఇసిసిఇ కార్యక్రమాలకు దాతలు ప్రాధాన్యత ఇస్తూ, కొంత తక్కువ ప్రాధాన్యతను తల్లిదండ్రులు, సంరక్షకుల మద్దతుకు ఇస్తున్నాయి. యూనిసెఫ్, యుఎస్ ఎయిడ్ మాత్రమే అనియత ఇసిసిఇ కార్యక్రమాలకు సహకారం అందించాయి. ఈ సర్వేలో చేరిన అంశాలు దాతలందరికీ వర్తించనప్పటికీ, విరాళాలు ఇవ్వడంలో ఉన్న ప్రాధాన్యతలు దేశాల అవసరాలకు సరిపోయేలా లేవు. కేంద్రాల పద్ధతికంటే తక్కువ లాంఛనమైన, తక్కువ ఖర్చుతో కూడిన సౌకర్యాలు ఎక్కువమంది పిల్లలను చేరగలుగుతాయి.

ప్రధాన అంతర్జాతీయ సహాయ డేటాలో ప్రాథమిక విద్య నుండి బాల్యం ప్రారంభదశను విడదీయడం కష్టం. అంతేకాక, ఇసిసిఇలోని కొన్ని అంశాలను ఇతర రంగాలతో జోడించారు. ఉదాహరణకు, ఆరోగ్యరంగం. తక్కువ ఆదాయంగల దేశాలు ఇసిసిఇకోసం మధ్యస్థాయి ఆదాయదేశాలకంటే తక్కువ అంతర్జాతీయ సహాయాన్ని పొందుతున్నాయి. ఆస్ట్రేలియా, గ్రీసు, స్పెయిన్‌లను మినహాయిస్తే ఇతర దాతలు ప్రి-ప్రైమరీ స్థాయికి ప్రాథమిక స్థాయికి ఇచ్చే సహాయంలో కేవలం 10% కేటాయిస్తున్నారు. అత్యధిక దాతలు 2% కన్నా తక్కువ విరాళాలు ఇస్తున్నారు. అత్యధిక దాతలు విద్యారంగానికి ఇచ్చే మొత్తం సహాయంలో 0.5% కన్నా తక్కువ సహాయాన్ని ఇసిసిఇకి ఇస్తున్నారు.

అంతర్జాతీయంగా అధిక రాజకీయ మద్దతు, వర్ధమాన దేశాల నిబద్దతలో పెరుగుదల, ఇసిసిఇ ప్రయోజనాలపై జరిగిన పరిశోధనల ఫలితాలను ఎక్కువగా ప్రచారం చేయడం ద్వారా ఇసిసిఇకి విరాళాలు ఇచ్చే సంస్థల కట్టుబాటును పెంచవచ్చు. అదే విధంగా, ఇసిసిఇ విధానాలను విద్యా, ఆరోగ్య రంగ ప్రణాళికలు, పేదరిక నిర్మూలన వ్యూహాలతో సమ్మేళనం చేయడం వలన కూడా అధిక విరాళాలు పొందవచ్చు.

# ముగింపు

ఇఎఫ్ఎ సమగ్ర చిత్రం మిశ్రమంగా ఉంది. డకార్ తరువాత గణనీయమైన ప్రగతి సాధించబడింది. ముఖ్యంగా, బాలికలతో సహా ప్రాథమిక విద్య లభ్యతలో ప్రగతి కనబడింది. అయితే మిగతా ఇఎఎఫ్ఎ ఎజెండా వెనుకబడి ఉంది. యుపిఇ లక్ష్యాన్ని కూడా ప్రస్తుత పోకడలను బట్టి గడువులోపు సాధించడం దుర్లభమే. ముఖ్యంగా, వయోజన అక్షరాస్యతను మెరుగుపరచడంపై ప్రాథమిక పాఠశాలలో చేరకముందు పిల్లలకోసం నడిపే కార్యక్రమాలపై అతి తక్కువగా దృష్టిపెడ్తున్నారు.

**తొమ్మిది రంగాలకు అత్యవసరంగా విధాన ప్రాధాన్యాన్ని ఇవ్వాలి:**

1. *డకార్ సమగ్ర దృక్పథాన్ని పునరుద్ధరించడం* దేశీయ అంతర్జాతీయ ఎజెండాలలో యుపిఇ చేరింది. కానీ ప్రభుత్వాలు ఇసిసిఇ, వయోజన అక్షరాస్యతలపైబాధ్యతలను స్వీకరించడం లేదు. ప్రతి ఐదుగురు వయోజనులలో ఒకరు కనీస అక్షరాస్యత నైపుణ్యాలు కూడా కలిగలేరు. యుపిఇని సాధించాలంటే ప్రాథమిక విద్యను పూర్తి చేసేందుకు ప్రోత్సాహకంగా సెకండరీ స్థాయిలో క్రింది తరగతుల లభ్యతను గణనీయంగా విస్తరించాలి.

2. *సత్వర చర్యలు చేపట్టడం* **2015**కు ఇంకా కేవలం తొమ్మిది సంవత్సరాలే ఉన్నాయి. సరైన వయసున్న పిల్లలందరినీ ప్రాథమిక పాఠశాలలో చేర్చడానికి ఇంకా మూడు సంవత్సరాలు మాత్రమే ఉన్నాయి. అత్యధిక ప్రతికూల పరిస్థితులనుండి, ప్రమాదకరమైన పరిస్థితుల నుండి వచ్చే పిల్లలందరికీ విద్యను అందించి, వయోజన విద్యాకార్యక్రమాలను విస్తరింపజేసి, యుద్ధాలు, ఘర్షణపరిస్థితులలో, ఇప్పుడు ఘర్షణలు ముగిసిన పరిస్థితులలో ఉన్న పిల్లలకు విద్యావకాశాలు కల్పించడం ప్రాధాన్యాలుగా స్వీకరించాలి.

3. *సమానత్వం, అందరినీ కలుపుపోవడానికి ప్రాధాన్యత.* చాలా ఎక్కువ దేశాలలో పేద కుటుంబాలనుండి వచ్చే పిల్లలు ఇసిసిఇ కార్యక్రమాలు, ప్రాథమిక పాఠశాలలలో చేరడానికి ఫీజులు ప్రధాన అడ్డంకిగా ఉన్నాయి. ఎక్కువ మంది పిల్లలు బడికి వెళ్లడంలేదు. ఎక్కువమంది ప్రాథమిక స్థాయిలో చివరి తరగతి చదువక ముందే బడిమానేస్తున్నారు లేదా వారు క్రమంగా హాజరుకావడంలేదు. విభిన్న ప్రాంతాలు, జనాభా బృందాలకు తగిన దృక్పథాలను విద్యావిధానం అభివృద్ధి పరచాలి. సాంస్కృతిక, భాషాపరమైన భిన్నత్వాన్ని గౌరవించి, ప్రత్యేక అవసరాలుగల విద్యార్థులను గుర్తించి అన్ని పరిస్థితులలో లైంగిక సమానత్వాన్ని సాధించి, ప్రజలు జీవించే ప్రదేశాలకు దగ్గరగా పాఠశాలలను, కార్యక్రమాలను తీసుకెళ్లడం కలుపుకుపోయే విధానంలో భాగం.

4. *ప్రభుత్వ ఖర్చును పెంచడం, లక్ష్యాలపై మెరుగ్గా కేంద్రీకరించడం* ఎన్నో ప్రభుత్వాలు ప్రాథమిక విద్యపై ముఖ్యంగా ఇసిసిఇ అక్షరాస్యతపై సరిపోను నిధులు ఖర్చుపెట్టడంలేదు. 2006 నివేదిక సమర్పించిన తరువాత 41 దేశాలలో విద్యారంగంపై ఖర్చు జిఎన్‌పిలో శాతంగా చూసినట్లయితే పెరిగింది. గ్రామీణ ప్రాంతాలలో ఉపాధ్యాయులు, ఇఎఫ్ఎ అందరికీ నిజంగా వర్తించేలా చేయడంవంటి తప్పనిసరి అవసరాలపై ఆర్థిక వనరులను కేంద్రీకరించాలి.

5. *విదేశీ సహాయాన్ని పెంచి, దాని ఆవశ్యకత ఎక్కడ అధికంగా ఉంటే అక్కడ కేటాయించాలి.* తక్కువ ఆదాయాలు గల దేశాలకు అందే విదేశీ సహాయం కనీసం రెట్టింపు కావాలి. అలాగే ఇసిసిఇ, అక్షరాస్యతలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. ఫాస్ట్ ట్రాక్ ఇనిష్యేటివ్‌కు అధిక నిధులు కేటాయించి తద్వారా ఎక్కువ కాలంపాటు విశ్వసనీయంగా ప్రాథమిక విద్యా ఆశయాలను విస్తృతపరిచి ఇఎఫ్ఎ లక్ష్యాలన్నింటినీ చేర్చుకోవాలి.

6. *ఇసిసిఇని దేశీయ, అంతర్జాతీయ ఎజెండాలలో పైస్థాయికి చేర్చడం* ఉన్నతస్థాయి రాజకీయ మద్దతు, పిల్లల వర్తమాన సంక్షేమానికి, భవిష్యత్ అభివృద్ధికి ఇసిసిఇ ఎంతో అవసరమని గుర్తించడం ముఖ్యం. పుట్టుక నుండి ఎనిమిది సంవత్సరాల వయసు వరకు గల పిల్లలకోసం ఇసిసిఇపై జాతీయ విధాన ప్రణాళికలు అభివృద్ధి

**2015కు ఇంకా కేవలం తొమ్మిది సంవత్సరాలే ఉన్నాయి. సరైన వయసున్న పిల్లలందరినీ ప్రాథమిక పాఠశాలలో చేర్చడానికి ఇంకా మూడు సంవత్సరాలు మాత్రమే ఉన్నాయి.**

## ఇఎఫ్ఎకోసం మరింత సమగ్ర దృక్పథం, మరింత నిరంతరాయ ప్రయత్నాలు అవసరం

చేయాలి. అలాగే ఏదైనా ఒక మంత్రిత్వశాఖ లేదా ఏజెన్సీని ఈ రంగంలో పనులన్నింటికీ బాధ్యత వహించేలా చేయాలి. ఈ విధానం లక్ష్యాలను, నిధుల లభ్యతను స్పష్టం చేసి, నిబంధనలను, నాణ్యతా పర్యవేక్షణలకు ఏర్పాట్లు చేయాలి. ఏ ఒక్క అంశంపైనో కేంద్రీకరించే కార్యక్రమాల కంటే పౌష్టికాహారం, ఆరోగ్యం, సంరక్షణ, విద్యలతో కూడుకున్న సమగ్ర కార్యక్రమాలు ఎంతో ప్రభావపూరితంగా ఉంటాయి. ఎన్నో దేశాలలో ఇసిసిఇ రంగంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న ప్రైవేటు రంగంతో ప్రభావపూరితమైన భాగస్వామ్యాలను అభివృద్ధి చేయాలి. అదే సమయంలో లభ్యత, నాణ్యతలలో అసమానతలు, లోపాలు లేకుండా జాగ్రత్త వహించాలి.

7. *ఇసిసిఇ కొరకు ప్రభుత్వ వ్యయం పెంచడం, దానిని అవసరమున్నవారికి చేర్చడం* జాతీయ విధానాలు పిల్లలందరికీ వర్తించేలా ఉన్నప్పటికీ కొన్ని సందర్భాలలో ప్రభుత్వ నిధులు అత్యంత ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న పిల్లలకోసం కేటాయించాలి. ప్రభుత్వ వనరుల కేటాయింపుపై కీలక పత్రాలలో (జాతీయ బడ్జెటులు, రంగ ప్రణాళికలు, పిఎస్ఆర్‌పిలు) ఇసిసిఇని చేర్చడం ముఖ్యం. బాల్యం ప్రారంభదశలో సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వడంలో ఇతర దాతలు యూనిసెఫ్‌ను అనుసరించాలి.

8. *ఇసిసిఇ సిబ్బంది పనితీరును మెరుగుపరచడం, ముఖ్యంగా వారి అర్హతలు, శిక్షణ, పని పరిస్థితులను ప్రోత్సహించడం* సంరక్షకులు, టీచర్లతో పిల్లలు కలిసిపోవడం అనేవి ఇసిసిఇ కార్యక్రమాల నాణ్యతను నిర్ణయించే అంశాలలో అత్యంత ముఖ్యమైనది. ఇసిసిఇ సిబ్బందికి సాధారణంగా సరైన శిక్షణ, వేతనాలు లభించడంలేదు. అన్ని రకాల ఇసిసిఇ సిబ్బందికి నాణ్యతా ప్రమాణాలు అవసరం. ఈ కార్యక్రమాలు ప్రభావపూరితంగా ఉండాలంటే సిబ్బందికి తగినంత ప్రణాళికబద్ధమైన పరిస్థితులు అందించాలి. (ఉదా: సరైన పిల్లలు/సిబ్బంది నిష్పత్తులు, గ్రూపుసైజులు, తగిన సామాగ్రి)

9. *ఇసిసిఇ పర్యవేక్షణను మెరుగుపరచడం.* ఇసిసిఇపై మరింత వివరంగా సమాచారం సేకరించడంలో సహాయపడేందుకు దేశాలకు సాంకేతిక నైపుణ్యాన్ని అందించాలి. ముఖ్యంగా 3 ఏళ్లలోపు పిల్లల కొరకు కార్యక్రమాలకు, ప్రి-ప్రైమరీ విద్యపై జాతీయ వ్యయాలకు సంబంధించి సాంకేతిక నైపుణ్యాలు అందించాలి. దేశాలు, అంతర్జాతీయ సముదాయం సమిష్టి చర్యకోసం చేతులు కలిపితే ఏం సాధించవచ్చు అనేది డకార్ తరువాత ఇఎఫ్ఎ దిశలో సాధించిన గణనీయమైన ప్రగతి తెలియజెప్పుతుంది. అయినప్పటికీ ఇఎఫ్ఎ కోసం మరింత సమగ్ర దృక్పథం మరింత నిరంతర ప్రయత్నాలు అవసరం. ఆసక్తి తగ్గకుండా మనం చూడాలి.

ఇఎఫ్ఎకు అందరికీ విద్యేకాని కొందరికే విద్య కాదు. ఇఎఫ్ఎ అంటే ఆరు లక్ష్యాలు, కేవలం ప్రైమరీ పాఠశాలకు సంబంధించిన లక్ష్యమొక్కటే కాదు. దీనర్థం ప్రతికూల పరిస్థితులను దూరంచేసేందుకు ప్రభావపూరితమైన చర్యలు తక్కువ ఖర్చుతో బాల్యం తొలినాళ్లలో చేపట్టవచ్చు. ఈ వయసులో సులువుగా పటిష్టమైన పునాదులు నిర్మించవచ్చు. నేటితరం చిన్న పిల్లలకు మనం సేవలందించలేకపోతే అది వారి హక్కులను ఉల్లంఘించడమేకాక దాని వలన రేపటి పేదరికం, అసమానతలకు బీజాలు పడతాయి. సవాళ్లతోపాటు ఎజెండా కూడా స్పష్టంగా ఉంది. చర్యలు తీసుకోవలసిన సమయం ఇదే.



బంగ్లాదేశ్‌లో సాత్కిరా జిల్లాలోని ఒక ప్రాథమిక పాఠశాల వెలుపల అక్షరాలను పరిశీలిస్తున్న పిల్లలు

© REUTERS

# ఇఎఫ్ఎ గ్లోబల్ మానిటరింగ్ రిపోర్ట్ ప్రశ్నావళి

అందరికీ విద్య గ్లోబల్ మానిటరింగ్ రిపోర్ట్

ఇఎఫ్ఎ జిఎంఆర్

## ఫీడ్‌బ్యాక్ అందించండి!

*అందరికీ విద్య గ్లోబల్ మానిటరింగ్ రిపోర్ట్ ఒక స్వతంత్ర నివేదిక. దీనిని యునెస్కో ప్రతి సంవత్సరం ప్రచురిస్తుంది. దయచేసి కొద్ది నిమిషాలు వెచ్చించి మా ప్రశ్నలకు సమాధానం ఇచ్చి మీరెవరో తెలియజేయండి. మీ వ్యాఖ్యలు, సూచనలను మేము కోరుతున్నాం.*

*ప్రశ్నావళిని మెయిల్ ద్వారా లేదా ఫ్యాక్స్ ద్వారా పంపవచ్చు (కింద చిరునామా ఇవ్వబడింది) లేదా* www.efareport.unesco.org *వద్ద జిఎంఆర్ వెబ్‌సైట్‌పై ఎలక్ట్రానికల్‌గా ఈ ప్రశ్నావళి పూరించవచ్చు.*

### వ్యక్తిగత/వృత్తిపరమైన సమాచారం

పేరు ..........

సంస్థ ..........

చిరునామా ..........

..........

నగరం .......... దేశం ..........

ఇ-మెయిల్ ..........

మీ ప్రధాన ప్రొఫెషనల్ రంగం/కార్యకలాపం ఏమిటి? ..........

### ఇఎఫ్ఎ గ్లోబల్ మానిటరింగ్ రిపోర్ట్

జిఎంఆర్ గురించి మీకు ఎలా తెలిసింది. ..........

..........

మీరు గత సంచికలు చూశారా? ..........

మీకు పూర్తి నివేదిక ప్రింట్ ఎడిషన్ చదివారా? .......... సారాంశ నివేదిక చదివారా? ..........

మీకు పూర్తి నివేదిక వెబ్ ఎడిషన్ చదివారా? .......... సారాంశ నివేదిక చదివారా? ..........

మీకు పూర్తి నివేదిక సిడి ఎడిషన్ చదివారా? .......... సారాంశ నివేదిక చదివారా? ..........

మీరు నివేదికను ఎలా ఉపయోగిస్తారో వివరించండి. ..........

..........

..........

..........

### మీ అభిప్రాయం

నివేదికను ఎలా మెరుగుపరచవచ్చు. ..........

..........

..........

..........

..........

గణాంక పట్టికలు గ్లోబల్ మానిటరింగ్ రిపోర్టులో దాదాపు సగాన్ని ప్రస్తుతం నివేదిస్తున్నాయి. వీటిని విడిగా సమర్పించినట్లయితే నివేదిక పట్ల మీ అభిప్రాయం మారుతుందా?

వ్యాఖలు లేదా సూచనలు ..........

..........

..........

..........

**జిఎంఆర్ ప్రాంతీయ సమీక్షలు**

ప్రతి సంవత్సరవు జిఎంఆర్ ఆధారంగా ప్రాంతీయ సమీక్షలు రూపొందిస్తారని మీకు తెలుసా?

జిఎంఆర్ ప్రాంతీయ సమీక్షను మీరెప్పుడైనా చదివారా?

చదివితే అది ప్రింట్ ఎడిషనా? వెబ్ ఎడిషనా? రెండూనా?

ఏ ప్రాంతం (తాలు)

ప్రాంతీయ సమీక్ష (ల)ను మీరు ఏ విధంగా ఉపయోగిస్తారు?

వ్యాఖ్యాలు లేదా సూచనలు

**జిఎంఆర్ వెబ్‌సైట్**

మీరు ఎప్పుడైనా జిఎంఆర్ వెబ్‌సైట్ సందర్శించారా?

మీరు దేనికోసం అన్వేషించారు? దానిని మీరు కనుగొన్నారా?

మీరు వెబ్‌సైట్‌పై బ్యాక్‌గ్రౌండ్ పేపర్లను ఎప్పుడైనా సంప్రదించారా?

మీ సొంత పట్టికలను తయారుచేసుకోవడం కొరకు స్టాటిస్టికల్ టూల్‌ను ఉపయోగించారా?

వెబ్‌సైట్‌ను ఏ విధంగా మెరుగుపరచవచ్చు?

**జిఎంఆర్ న్యూస్ అలర్ట్‌లు**

గ్లోబల్ మానిటరింగ్ రిపోర్ట్ న్యూస్ అలర్ట్‌లను ఇ-మెయిల్ ద్వారా అప్పుడప్పుడు పొందాలనుకుంటున్నారా?

అవును అయితే, ఇక్కడ మీ ఇ-మెయిల్ అడ్రస్ తెలపండి:

(ఎప్పుడైనా మీ సబ్‌స్క్రిప్షన్ రద్దుచేసే స్వేచ్ఛ మీకు ఉంది)

**ఏవైనా ఇతర వ్యాఖ్యలు లేదా సూచనలు**

కృతజ్ఞతలు.
ఇఎఫ్ఎ గ్లోబల్ మానిటరింగ్ రిపోర్ట్ బృందం
ప్యారిస్, ఫ్రాన్స్


**తపాలా చిరునామా ఫ్యాక్స్**

ఇఎఫ్ఎ గ్లోబల్ మానిటరింగ్ రిపోర్ట్
అటెన్షన్: జిఎంఆర్ ఫీడ్‌బ్యాక్
యునెస్కో,
7 ప్లేస్ డి ఫాంటెనాయ్
75352 ప్యారిస్ 07, ఫ్రాన్స్

ఫ్యాక్స్: + 33 (0) 1 45 68 56 41
www.efareport.unesco.org
ఇ-మెయిల్: efareport@unesco.org


ఇఎఫ్ఎ జిఎంఆర్ అందరికీ విద్య గ్లోబల్ మానిటరింగ్ రిపోర్ట్

# సారాంశం

ఇ.ఎఫ్.ఎ. గ్లోబల్ మానిటరింగ్ రిపోర్ట్ 2007

బాల్యం ప్రారంభదశలో మార్పు గణనీయంగా ఉండడమేకాక, ప్రతికూల పరిస్థితులకు గురయ్యే ప్రమాదం కూడా అధికంగా ఉంటుంది. ప్రాథమిక పాఠశాలకు వెళ్లడానికి ముందు సంవత్సరాలలో చిన్న పిల్లలకు సహాయం అందించే కార్యక్రమాలు తదనంతర విద్య, అభివృద్ధిలకు గట్టి పునాదులు వేస్తాయి. అటువంటి కార్యక్రమాలు ప్రతికూల పరిస్థితుల వలన కలిగే నష్టాలకు, మినహాయింపుకు పరిహారం అందించి పేదరికం నుండి బయటపడే మార్గాన్ని అందిస్తాయి.

ఈ సారాంశ నివేదిక అందరికీ విద్య తొలి లక్ష్యంపై దృష్టిసారిస్తుంది. బాల్యం ప్రారంభంలో సంరక్షణ, విద్యను విస్తరించి, మెరుగుపరచాలని ఇందుకోసం విద్యతోపాటు సంరక్షణ, ఆరోగ్యం, పౌష్టికాహారాలతో కూడిన సంపూర్ణ ప్యాకేజిని రూపొందించాలని ఈ లక్ష్యం దేశాలను కోరుతుంది. ఈ కార్యక్రమాల వలన ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న పిల్లలు అధికంగా ప్రయోజనంపొందే అవకాశం ఉన్నప్పటికీ చాలాకొద్ది వర్ధమాన దేశాలు, చాలా కొద్ది దాతృత్వ సంస్థలు బాల్యం ప్రారంభదశకు ప్రాధాన్యాన్ని ఇస్తున్నాయి.

మిగతా రంగాలలో ముఖ్యంగా సార్వత్రిక ప్రాథమిక విద్య అనే కీలక లక్ష్యం విషయంలో అందరికీ విద్య లక్ష్యాల సాధన దిశలో గణనీయమైన ప్రగతి ఉంది. ఎక్కువ మంది బాలికలు పాఠశాలకు వెళ్తున్నారు, అంతర్జాతీయ సహాయం పెరుగుతోంది. అయితే 2015 నాటికి లక్ష్యాన్ని సాధించాలంటే ఇంకా ఎంతో కృషి జరగాలి. తక్షణం సాహసోపేతమైన చర్యలు తీసుకోవాలి. అప్పుడే మినహాయింపును అధిగమించి బాల్యం ప్రారంభ దశలో, జీవితాంతం వరకు అందరికీ విద్యావకాశాలు హామీ ఇవ్వబడతాయి.

ఇఎఫ్ఎ జిఎంఆర్
అందరికీ విద్య గ్లోబల్ మానిటరింగ్ రిపోర్ట్

ముఖచిత్రం
ఖాట్మండు, నేపాల్‌లో ఆడుకుంటున్న పిల్లలు.
© OLIVIER CULMANN/TENDANCE FLOUE

UNESCO
United Nations
Educational, Scientific and
Cultural Organization

Organisation
des Nations Unies
pour l'éducation,
la science et la culture